ఈనాడు
శ్రీకాకుళం
మంగళవారం 2 జనవరి 2018 16 పేజీలు

ఆశీస్సులు... అభినందనలు!

2018లో అందరికీ శుభం జరగాలని కోరుతూ నూతన సంవత్సరానికి జిల్లా వాసులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రముఖులను కలిసి అభినందనలు తెలియజేశారు. వారి ఆశీస్సులు అందుకున్నారు. సోమవారం నిమ్మాడలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడుని కలిసిన కలెక్టర్ ధనంజయరెడ్డి, జేసీ చక్రధరబాబు... రాజాంలో మంత్రి కళా వెంకటరావును కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ త్రివిక్రమవర్మలను ఇక్కడి చిత్రాల్లో చూడొచ్చు. న్యూస్‌టుడే, కోటబొమ్మాళి, రాజాం

మరిన్ని చిత్రాలు 7 లో





రామకృష్ణాపురం ప్రాంతంలోని భూములు



డి.పట్టాలకు సంబంధించి రెవెన్యూ యంత్రాంగం తయారు చేసిన నిషిద్ధ జాబితా

డి.పట్టాల జాబితా

భూ కుంభకోణంలో మరో కోణం

- అన్నీ పథకం ప్రకారమే...
- నిషిద్ధ జాబితా నుంచి పలు సర్వే సంఖ్యలు, పేర్లు తొలగింపు
- నిషేధం ఉన్నా ఆగని రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- 'రామకృష్ణాపురం'లో కళ్లు తిరిగే చిత్రవిచిత్రాలు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే

ఆ భూమి...అక్కడి నుంచి అంగుళం కూడా కదల్లేదు... కానీ...ఆ భూమి పేరున తిరిగిన దస్త్రాల తీరు చూస్తే కళ్లు తిరుగుతాయి
వాటిని దఖలు పరిచిన వైనం నివ్వెరపరుస్తుంది
ఉండాల్సిన చోట పేర్లు లేవు
అసలు ఉండకూడదు...అన్న చోట మాత్రం ఉన్నాయి
ఇదంతా...అధికారులకు తెలియకుండానే సాగిందా??
అన్నదే అంతుపట్టని ప్రశ్న!
ఇదే...పలాస సమీపంలోని 'రామకృష్ణాపురం'లో అక్రమాలు చోటుచేసుకున్న 550 ఎకరాల మిస్టరీ!!

గుజరాత్ రాష్ట్రం కాండ్లాలో నెలకు రూ.50 వేలకు పైగా జీతం పొందుతున్న ఓ వ్యక్తికి 1996లో డి.పట్టా ఇచ్చారు...

విజయనగరంలో ఉంటున్న 38 ఏళ్ల వివాహితకు 1997లోనే డి.పట్టా ఇచ్చారు. అదే ఏడాది కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎకరా భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ సైతం చేశారు.

అనకాపల్లిలో ఉంటున్న 39 సంవత్సరాల వివాహితకు 1999లో 98 సెంట్ల భూమికి సంబంధించిన డి.పట్టా ఇచ్చారు. ఈ లెక్కన పట్టా పొందినప్పుడు ఆమె వయసు 18 సంవత్సరాలు!

- ఇంతే కాదు...ఇలా ఇంకా చాలా ఉన్నాయి. ఓ వైపు నిషిద్ధ జాబితాను పక్కన పెట్టి రిజిస్ట్రేషన్లు సైతం ఆగకుండా జరిగిపోతున్నాయి. ఈ భూములపై ఇటీవల వరుస కథనాలు 'ఈనాడు'లో ప్రచురితమైన విషయం విధితమే. ఆ తరువాత పలువురు రెవెన్యూ యంత్రాంగాన్ని ఆశ్రయిస్తున్నారు. మరి కొందరు ఈ వ్యవహారం నుంచి గట్టెక్కే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ భూములకు సంబంధించి తాజాగా వెలుగులోకి వచ్చిన మరిన్ని అంశాలు విస్తుపరిచేలా ఉన్నాయి.

ఆ జాబితా నుంచి పలు పేర్లు గల్లంతు: ప్రభుత్వం మంజూరు చేసిన డి.పట్టా భూములను ఇతరులకు విక్రయించటానికి లేదు. ఈ భూములను 22ఏ పేరుతో నిషిద్ధ జాబితాను రిజిస్ట్రేషన్ శాఖకు అందజేస్తారు. దాని ప్రకారం ఆయా సర్వే సంఖ్యలలోని భూములు రిజిస్ట్రేషన్లు చేయకూడదు. రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలోని డి.పట్టా భూములకు సంబంధించి 550 ఎకరాలకు పైగా 150 మంది పేర్లతో అడంగల్‌లో దర్శనమిస్తున్నాయి. వాటిలో కొన్ని పేర్లు నిషిద్ధ జాబితాలో లేవు. నిషిద్ధ జాబితాలో పేర్లున్నా కొన్నిసర్వే నెంబర్లలో భూములు రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. దీంతో ఇక్కడి (మిగతా 15వ పేజీలో)

ముగ్గురిని బలిగొన్న వరి నూర్పు యంత్రం



ఊహించలేదు... ప్రాణాలు నిలవలేదు!!

- ఉపాధినిచ్చిన యంత్రమే ఊపిరి తీసింది
- లొద్దపుట్టిలో ముగ్గురు మహిళల దుర్మరణం
- వరినూర్పు యంత్రం బోల్తాతో విషాదం


లొద్దపుట్టి (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే

కూలి పనికెళ్తే నాలుగు డబ్బులొస్తాయని...
కుటుంబాన్ని నెట్టుకురావొచ్చని...
వెళ్లిన ఆ ముగ్గురు మహిళలపై
విధి పగపట్టినట్లుంది!
ఓ పొలంలో నుంచి మరొక పొలంలోకి వెళ్లే సమయంలో ధాన్యం నూర్పిడి యంత్రం రూపంలో వెంటాడింది....ప్రాణాలు తీసేసింది!!
ఆ యంత్రంపైనుంచి జారిపోతున్న సమయంలో...
వారి...ప్రాణం ఎంతగా విలవిలలాడిందో...
భారీ బరువు ఒక్కసారి పడినప్పుడు
ఎంతగా అల్లాడిపోయారో...అని
ఘటనా స్థలిని చూసిన ప్రతి ఒక్కరూ శోకించారు!!!
ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో
ముగ్గురు మహిళల దుర్మరణం ఇక్కడ ప్రతి ఒక్కరిని విషాదంలోకి నెట్టింది.


నిత్యం ఆ యంత్రంతో పాటే ఉంటారు. అదే.. దక్కత జానికమ్మ (27), కొచ్చెర్ల తులసమ్మ (40), తిప్పన కూర్మమ్మ (48) జీవితాలను చిదిమేసింది. ఆ కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిల్చింది. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో జరిగిన ఈ ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.

లొద్దపుట్టి గ్రామానికి చెందిన రైతు ఒకరు వరినూర్పు యంత్రాన్ని వ్యవసాయ శాఖ ద్వారా తీసుకువచ్చారు. ఇతర రైతుల నూర్పులకు అద్దెకు తిప్పుతుంటారు. ఈ యంత్రంతో పాటు (మిగతా 15వ పేజీలో)

మృతులు



జానికమ్మ



తులసమ్మ



కూర్మమ్మ

2 లో కార్మికా.. అందుకో భరోసా

13 లో పది రోజుల పండగ
నేటి నుంచి 'జన్మభూమి - మా ఊరు'

మమ్మల్నే కదిలిస్తారా?

- ఉన్న చోట నుంచి వెళ్లం
- ఇదీ...ఆ ముగ్గురి కథ
- అండగా కొందరు ప్రజా ప్రతినిధులు
- ఫలితంగా... నిలిచిన ఉద్యోగుల పదోన్నతుల దస్త్రం

ఈనాడు - శ్రీకాకుళం



ఆ ముగ్గురు...
పదోన్నతులు ఇచ్చినా కదిలేది లేదని భీష్మించారు.
అదేదో...తామున్న చోటే ఉంచి కల్పించండంటున్నారు
మూడేళ్లు.. ఆరేళ్లు.. తొమ్మిదేళ్లు అయితేనేం..
మేమిక్కడే ఉంటామని చెప్పేస్తున్నారు
అలా అని వారేమీ పెద్దపెద్ద ఉద్యోగులు కాదు..
ఒకరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్.. ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు..
జిల్లాలో 72 మంది పదోన్నతులను అలా నిలిపేశారనే ఆరోపణలున్నాయి.
ఫలితంగా కలెక్టరేట్‌లో సదరు దస్త్రం ముందుకు కదలటం లేదు.
ముగ్గురికీ ముగ్గురు కీలక ప్రజాప్రతినిధులు అండగా నిలిచినట్లు సమాచారం!!
రాజాజ్ఞ లేకుండా చీమైనా కుడుతుందా..
ప్రభుత్వంలో దస్త్రమూ కదలదు కదా..
ఎక్కడి పదోన్నతుల దస్త్రం అక్కడే గప్‌చిప్ అంటూ..
ఆ దస్త్రాన్ని కలెక్టరేట్ పక్కన పెట్టేసింది.
పదోన్నతులు అందుకొని కొత్తసంవత్సరంలో... కొత్త కుర్చీలో కూర్చొందామనుకున్న ఉద్యోగులకు చివరికి నిరాశే ఎదురైంది..

ఎవరా ముగ్గురు..?

ఒకరు రేగిడి ఆమదాలవలస మండలంలో సీనియర్ అసిస్టెంటు... మరొకరు శ్రీకాకుళం ప్రాంత ఆర్ఐ... ఇంకొకరు మందస మండలంలో సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తూ డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొందిన అధికారి.

అక్కడ...ఆయనే అంతా?!

ఆయన రేగిడి ఆమదాలవలస మండలంలో ఓ సీనియర్ అసిస్టెంటు. జూనియర్ అసిస్టెంటు, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంటుగా మూడేళ్ల చొప్పున తొమ్మిదేళ్లుగా అక్కడే కొనసాగుతున్నారు. గతంలో ఒకసారి రణస్థలం, తరవాత వంగర, ఇంకోసారి కలెక్టరేట్... మరోసారి శ్రీకాకుళంలోని డీఎస్‌వో కార్యాలయానికి బదిలీ అయింది. అయినా ప్రతిసారి ఏదొకటి చెప్పి అక్కడే ఉండిపోయారు. సాధారణ బదిలీల్లో సైతం కదల్లేదు. ఎవరెవరు ఎన్ని సంవత్సరాలు నుంచి పని చేస్తున్నారో తహసీల్దార్లు నివేదికలు పంపించాలి. ఆ నివేదిక రూపొందించేది కూడా సీనియర్ అసిస్టెంటే. అందులోనూ తప్పులున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. ఇంతకు ముందు అక్కడికి నలుగురిని నియమిస్తే వారు కూడా రాలేకపోయినంత పనయింది. ఆ మండలంలో పదోన్నతుల్లో ఒక డీటీ, ఒక ఆర్ఐ పోస్టు (మిగతా 15వ పేజీలో)

ఎంతోమంది కార్మికులు ప్రభుత్వ సహాయానికి దూరమవుతున్నారు. అందుబాటులో ఎన్నో పథకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు ఉన్నా వాటిపై చైతన్యం లేక పొందలేకపోతున్నారు. ఇప్పటికే జిల్లా నుంచి వందల మంది అసంఘటిత రంగ కార్మికులు లబ్ధిపొందగా మరెంతోమందికి తెలియక వినియోగించుకోవడం లేదు. వారికి అందుబాటులో ఉన్న పథకాలు, అందే పరిహారాలపై 'న్యూస్‌టుడే' కథనం.

కార్మికా.. అందుకో భరోసా

● అసంఘటిత రంగానికి ఆసరా ● అందుబాటులో పథకాలు
● చైతన్యలోపంతో ప్రోత్సాహకాలకు దూరం



జిల్లాలో 15 లక్షల వరకు అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు

న్యూస్‌టుడే, రణస్థలం

కార్మికశక్తి లేకుంటే ఏ పనీ చేయలేం. ఏ పనిచేయాలన్నా కార్మిక శక్తే ప్రదానం. ప్రపంచీకరణ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో అన్ని విభాగాల్లో యాంత్రీకరణ పెరుగుతున్నప్పటికీ శ్రామిక శక్తి లేనిదే యంత్రాలు కూడా పనిచేయని పరిస్థితి. పారిశ్రామిక రంగం వృద్ధి చెందాలంటే శ్రామిక శక్తే ప్రధానం. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ సంఘటితరంగం, ఇతర రంగాల్లో పనిచేస్తున్న వారందరినీ అసంఘటితరంగ కార్మికులుగా పిలవబడుతున్నారు.

దుకాణాలు, సంస్థలు, కర్మాగారాలు, మోటారు రవాణా, సొసైటీ, ట్రస్టులో పనిచేస్తున్న వారికి



★ కార్మికుని కుమార్తె, కార్మికురాలి వివాహం కోసం రూ. 20,000 అందజేస్తారు. 2014-2016 వరకు 275 కుటుంబాలకు అందజేశారు.

★ **కార్మికుల పిల్లలు వికలాంగులైతే :** ఏ తరగతి చదువుతున్నా రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేస్తారు. ఇప్పటి వరకు 16 మంది పిల్లలకు అందజేశారు.

★ **దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు వైద్య సహాయం :** కార్మికుని కుటుంబ సభ్యులకు (గుండె, కాలెయం, క్యాన్సర్, బ్రెయిన్ ట్యూమర్, పక్షవాతం, కిడ్నీ, , ట్రూమా, ఎయిడ్స్) వంటి దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి శస్త్రచికిత్స నిమిత్తం రూ. 50,000ల వరకు ఆర్థిక సహాయం అందజేస్తారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 మంది కార్మికులకు అందజేశారు.

★ **ప్రమాదకరంగా మరణిస్తే :** ప్రమాదంలో మరణిస్తే రూ. 5 లక్షలు, (కార్మిక సంక్షేమ మండలి నుంచి రూ. 3 లక్షలు, ప్రధానమంత్రి సురక్ష యోజన నుంచి రూ. 2 లక్షలు అందజేస్తారు.) 2014 నుంచి ఇప్పటి వరకు 17 మందికి అందజేశారు. సహజ మరణం పొందితే కార్మికుని కుటుంబానికి రూ. 20,000 అందజేస్తారు. ఇప్పటివరకు 67 మందికి అందజేశారు. అంత్యక్రియలకు రూ. 10వేలు, అంగవైకల్యానికి రూ. 2,50,000 ఇస్తారు. ప్రసూతి సహాయం కింద రెండు కాన్పుల వరకు రూ. 20వేలు అందజేస్తారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకుంటే రూ. 5 వేలు అందజేస్తారు.

వీరు అర్హులు

భవన నిర్మాణ, ఆటో, హమాలి, హోటల్స్, దుకాణాలు, ఇంజినీరింగు పనులు , తోపుడుబళ్లు, రవాణా రంగం, ట్రాక్టర్లు, జేసీబీ డ్రైవర్లు, వ్యవసాయ కూలీ తదితరులంతా అసంఘటిత రంగ కార్మికులే. వీరే కాకుండా అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం , ఉపాధి హామీ తదితర పథకాల కార్మికులు ఈ రంగంలోకే వస్తారు.

ఈ పథకాల్లో ప్రమాదకర మరణం, సహజ మరణాలకు చంద్రన్న బీమా ద్వారా బీమా సొమ్ము చెల్లిస్తున్నారు. ఇందులో అన్ని రకాల చేతివృత్తులు, కుల వృత్తులు, బడుగువర్గాలు, ఐదు ఎకరాల లోపు మెట్టభూమి, రెండున్నర ఎకరాల లోపు మాగాణి భూమి కలిగిన రైతులంతా ఈ పథకంలో చేరవచ్చు.

■ రణస్థలం గ్రామానికి చెందిన లావేటి నరసింగరావు కుమార్తెకు ఈ ఏడాది అక్టోబరులో రూ. 20 వేలు ప్రసూతి సహాయాన్ని కార్మిక శాఖ ద్వారా అందించారు. ఇతను వడ్రంగి పనిచేస్తుంటాడు.

■ కోష్టకు చెందిన సింహాద్రి స్వాతి భర్త కోటేశ్వరరావు వడ్రంగి పనే చేస్తుంటాడు. ఈయన భార్యకు ప్రసూతి సహాయం కింద అక్టోబరు నెలలోనే రూ. 20 వేలు అందజేశారు.

■ లావేరు మండలం అదపాక గ్రామానికి చెందిన గంట్యాడ గురినాయుడు భార్య సరస్వతికి ప్రసూతి సహాయం కిందే రూ. 20 వేలు అందజేశారు. భర్త తాపీమేస్త్రిగా పనిచేస్తున్నారు.

■ కునుకు రాజు సాధారణ మరణం పొందితే భార్య రమణమ్మకు 2016 డిసెంబరులో రూ. 40 వేలు బీమా అందజేశారు. శ్రీకాకుళానికి చెందిన గంధం శ్రీనివాసరావు 2015లో మరణిస్తే ఆయణ భార్య రోహిణికి రూ. 2 లక్షలు అందజేశారు.

భవన , ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి

అంశం	పరిహారం (రూ)	2014–16లో లబ్ధిపొందిన కార్మికులు
ప్రమాదవశాత్తు మరణిస్తే	500000	11
సహజ మరణానికి	60,000	276
ప్రసూతి సహాయం (కార్మికుని భార్య, వారి కుమార్తెలకు రెండు కాన్పుల వరకు)	20,000	562
వివాహ కానుక (కార్మికుని కుమార్తె, మహిళా కార్మికులకు)	10,000	82
అంగవైకల్యం పొందితే (అంగవైకల్య శాతం ఆధారంగా)	5లక్షల వరకు ఇస్తారు	03
కార్మికుల అంత్యక్రియలకు	20,000	44

◆ ప్రతి కార్మికునికి శిక్షణ భృతి కింద రూ. 4500 అందజేస్తారు. 2014 నుంచి 2016 వరకు 3175 మంది కార్మికులకు అందజేశారు.

★ **విద్యా ప్రోత్సాహం :** కార్మికుల పిల్లలకు ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు పాలిటెక్నిక్, ఇంజినీరింగు, మెడిసిన్, లా, బిఎస్‌సి (అగ్రికల్చర్, వెటర్నరి, నర్సింగు, ఉద్యానవనం , బీడీఎస్, డీఎంఎల్‌టి, ఎంఎల్‌టీ, బి. ఫార్మసి,బీసీఏ ,ఎంసీఏ,బీబీఏ,ఎంబీఏ,డీహెచ్ఎంఎస్ కోర్సులకు రూ 5-10 వేల వరకు ఉపకారం అందజేస్తారు. ఈ పథకం కింద 510 మంది విద్యార్థులకు అందజేశారు.

ఇలా పొందొచ్చు : అసంఘటిత రంగ కార్మికులు సంబంధిత సంస్థల్లో పనిచేస్తున్నట్లు ఆయా యజమానులతో ధ్రువీకరణ పత్రాలు అదజేయాలి. భవన నిర్మాణ కార్మికులైతే సంబంధిత మేస్త్రితో 90 రోజులుగా పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. మేస్త్రికి భవన యజమాని ఎన్ని రోజులుగా పనిచేస్తున్నాడో ధ్రువీకరిస్తాడు. ఆర్థిక సహాయం పొందడానికి ప్రసూతి, వివాహ సహాయం పొందడానికి ఆరు నెలల లోపు కార్మిక శాఖ కార్యాలయానికి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేయాలి. మరణిస్తే ఏడాది లోపు పత్రాలతో దరఖాస్తు చేయాలి. దుకాణాలు, ఇతర సంస్థల్లో పనిచేసే వారూ ఇలాగే దరఖాస్తు చేసుకోవాలి.



కార్మిక శాఖకు తెలియజేయాలి

కార్మికులు ప్రసూతి, వివాహ, ఉపకార వేతనాలు వంటివి పొందాలంటే కార్మిక శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. ప్రసూతి సహాయానికి ప్రసవం అయిన ఆరు నెలల లోపు దరఖాస్తు చేసుకోవాలి. అసంఘటిత రంగ కార్మికులందరికీ ప్రమాద, సహజ మరణాల బీమా, అంగవైకల్యానికి చంద్రన్న బీమా పథకం నుంచే పరిహారం చెల్లిస్తున్నాం. **- వెంకటరత్నం, జిల్లా ఉప కార్మిక శాఖాధికారి**

ఇలా నిర్మిస్తే ... ఎన్నాళ్లు నిలిచెనో

పంచాయతీ కార్యాలయం నిర్మాణ పనుల్లో నాణ్యతకు పాతర



కట్టు పనుల కోసం వినియోగించేందు ఇసుక శాతం ఎక్కువ ఉన్న మిశ్రమాన్ని కలుపుతున్న దృశ్యం



నిబంధనలకు విరుద్ధంగా చిన్నరాళ్లతో నిలువుగా పేర్చి నిర్మిస్తున్న పునాది

గుళ్లసీతారాంపురం(సంతకవిటి), న్యూస్‌టుడే : పునాది పటిష్ఠంగా ఉంటేనే ఏ నిర్మాణమైనా కలకాలం ఉండేందుకు అవకాశం ఉంటుంది. ఏదైన భవనం నిర్మాణంలో పునాది నాణ్యతకు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. పునాది బలంపైనే భవన నిర్మాణం ఆధారపడి ఉంటుంది. అప్పుడే ఆ నిర్మాణం కొన్నేళ్లపాటు నిలబడేందుకు అవకాశం ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా పునాదుల్లో రాళ్లను నిలువుగా అమర్చి చిన్న చిన్న రాళ్లు వేసి ఏకంగా ఓ ప్రభుత్వ కార్యాలయ భవనాన్నే నిర్మించేస్తున్నారు. నిబంధనల ప్రకారం రాయిపై రాయిని అమర్చి నిర్మించాలి. అలాకాకుండా రాళ్లను నిలువుగా పేర్చడం వల్ల పునాదికి పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంది. అంతేకాకుండా సిమెంటు మిశ్రమంలో నాణ్యత లోపిస్తోంది. ఈ మిశ్రమంలో సిమెంటు శాతం కంటే ఇసుక శాతం ఎక్కువ వేసి నిర్మిస్తున్నారు. ఇలా నిర్మిస్తే 50 ఏళ్లపాటు ఉండాల్సిన భవనం ఎన్నేళ్లు నిలిచి ఉంటుందో చూడాలి. ఈ ప్రభుత్వ భవన నిర్మాణ పనులు సంతకవిటి - రాజాం ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే గుళ్లసీతారాంపురం గ్రామంలో చేపడుతున్నారు. గుళ్లసీతారాంపురం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం భవనాన్ని 20 ఏళ్ల కిందట నిర్మించారు. ఈ భవనం శిథిలమైందని అధికారులు తొలగించారు. ఈ భవనం స్థానంలోనే ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్ నిధులు రూ. 13 లక్షలతో కొత్తగా మరో భవనం నిర్మిస్తున్నారు. నిర్మిస్తున్న భవనం పనులైనా సక్రమంగా చేపడితే కలకాలం పంచాయతీ ప్రజలకు ఉపయోగపడేందుకు అవకాశం ఉంటుంది.

కఠిన చర్యలు తీసుకుంటాం

గుళ్లసీతారాంపురం పంచాయతీ భవనం పనుల్లో నాణ్యతపై రాజీపడేదే లేదు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసప్రభు, పంచాయతీరాజ్, ఏఈ

ఎస్సీ సివిల్ ఇంజినీరింగ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: రాష్ట్ర షెడ్యూల్డు కులాల సహకార ఆర్థిక సంస్థ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్తంగా ప్రవేశపెట్టిన రోడ్డు అంబులెన్స్ పథకంలో భాగంగా యూనిట్ మంజూరు కోసం షెడ్యూల్డు కులాలకు చెంది సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, డిప్లొమా పూర్తి చేసిన, తెల్ల రంగు రేషన్‌కార్డు కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె.వి. ఆదిత్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లు మరమ్మతులు చేపట్టేందుకు అవకాశం ఇచ్చే ఈ పథకంలో లైట్ కమర్షియల్ వాహనాలు మూడు చొప్పున, ఒక మల్టీ యుటిలిటీ వెహికల్‌ను మంజూరు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల ఆరో తేదీలోగా దరఖాస్తులు సమర్పించుకోవాలని కోరారు.

ఆదిత్య దర్శనం

◆ అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వామికి మంగళవారం వేకువజామున 4 గంటలకు మేల్కొలుపు సేవ, అనంతరం సుప్రభాత సేవ, ఉషఃకాలార్చన, మంత్రపుష్పం, బాల భోగం, నిత్యపూజలు ◆ ఉదయం 6 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనం ◆ 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఆర్జిత సేవలు ◆ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సూర్యనమస్కార సేవ ◆ స్వామి పరివార దేవతైన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు ◆ సుబ్రహ్మణ్యస్వామి, నాగమిథునంలకు ప్రత్యేక పూజలు, అర్చనలు ◆ నవగ్రహ మంటపంలో నవగ్రహాలకు నిత్యార్చనతో పాటు కుజునికి అష్టమూలికా తైలాభిషేకం, క్షీరాభిషేకం ◆ మధ్యాహ్నం 12 గంటల నుంచి నిత్యాన్నదానం ◆ ఒంటి గంట నుంచి స్వామికి మహారాజ భోగం ◆ మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు స్వామికి పవళింపు సేవ ◆ సాయంత్రం 6 గంటలకు మంత్రపుష్పం, మహా హారతి ◆ రాత్రి 8 గంటలకు స్వామికి పవళింపు సేవ

–న్యూస్‌టుడే, అరసవల్లి

పరిహారం... పరిహాసం!



- రైతులకు అందని పంటల బీమా పరిహారం
- బ్యాంకు అధికారుల వైఫల్యంతో ఇబ్బందులు

బ్యాంకు అధికారుల వైఫల్యంతో 2015-16 సంవత్సరానికి సంబంధించి రైతులకు అందాల్సిన పంటల బీమా పరిహారం ఇంత వరకు అందలేదు. ఈ విషయంపై రైతులు, తెదేపా, వైకాపా నాయకులు పలుమార్లు బ్యాంకు అధికారులకు మొరపెట్టుకుంటున్నప్పటికీ, వారికి పరిహారం అందజేయడంలో మాత్రం సఫలీకృతులు కాలేకపోతున్నారు. జిల్లాలోని అన్ని బ్యాంకులకు పంటల బీమా పరిహారం బీమా సంస్థ అందించినా ఆంధ్రాబ్యాంకుకు పరిహారం చెల్లించకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. – న్యూస్‌టుడే, నందిగాం

శ్రీకాకుళం రీజియన్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 80 ఆంధ్రా బ్యాంకు శాఖలు ఉన్నాయి. వీటిలో వరి పంటకు సంబంధించి సుమారు 45 బ్యాంకులు రైతులకు రుణాలు అందించి బీమా రైతులతో కట్టించుకుంటున్నాయి. ఆయా బ్యాంకుల పరిధిలో సుమారు 45 నుంచి 50 వేల మంది రైతులు ఉన్నారు. వీరందరికీ రూ.కోట్లతో బీమా పరిహారం చెల్లించాల్సి ఉంది. అయితే ఇంతవరకు బీమా సంస్థ ఒక్క పైసా విదల్చలేదు. పెద్ద రైతులకు పరిహారం చెల్లించి చిన్నకారు రైతులకు బీమా సంస్థ పరిహారం చెల్లించకపోవడంతో అందరికీ చెల్లించాలని సంస్థకు తెలియజేశామని, దీంతో ఆలస్యమవుతోందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 18వ తేదీన బీమా సంస్థ కొద్ది మంది రైతులకు మాత్రమే పరిహారం విడుదల కాగా, చిన్న, సన్నకారు, పెద్ద రైతులందరికీ విడుదల చేయాలని ఆంధ్రా బ్యాంకు జోనల్ అధికారులు ఈ ఏడాది నవంబరు 7వ తేదీన హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తెలియజేశారు. ప్రధాన కార్యాలయం నుంచి స్వయంగా బీమా సంస్థకు ఈ ఏడాది నవంబరు 22వ తేదీన సమాచారం అందజేశారు. బీమా సంస్థ నుంచి మాకు ఇంత వరకు ఎటువంటి సమచారం అందలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. మరి బీమా పరిహారం ఎప్పుడు అందుతుందోనని రైతులు నెలలతరబడి ఎదురుచూస్తున్నారు.

ఇక్కడ భారీ సంఖ్యలోనే...

నందిగాం మండలం పెద్దతామరాపల్లి ఆంధ్రా బ్యాంకు పరిధిలో 27 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలకు చెందిన రైతులు సుమారు 2,050 మంది వరకు ఉన్నారు. వీరందరికీ 2015-16 సంవత్సరానికి పంటల బీమా పరిహారం అందలేదు. పరిహారం కోసం రైతులు ఇప్పటికే బ్యాంకు ఎదుట ధర్నా చేసినప్పటికీ ప్రయోజనం చేకూరలేదు. ఎప్పుడెప్పుడు బీమా పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారా అంటూ రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జోనల్ కార్యాలయంతోపాటు ప్రధాన కార్యాలయానికి వివరాలు పంపించామని, ప్రధాన కార్యాలయానికి చెందిన అధికారులు బీమా సంస్థకు విషయం విశదపరిచారని స్థానిక బ్యాంకు మేనేజరు సీహెచ్ వెంకటకృష్ణ తెలిపారు. త్వరలో పరిహారం విడుదలవుతుందని, విడుదలైన తక్షణం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ఆయన చెబుతున్నారు.



ఎదురు చూస్తున్నాం

పంటల బీమా పరిహారం కోసం ఎదురు చూస్తున్నాం. ఒక్క ఆంధ్రాబ్యాంకు నుంచి బీమా పరిహారం అందకపోవడం విచిత్రంగా ఉంది. పలాస- కాశీబుగ్గ, నందిగాం, పూండి తదితర గ్రామాల్లోని వివిధ బ్యాంకులు పంటల బీమా పరిహారం చెల్లించాయి. ఆంధ్రా బ్యాంకు పరిహారం ఎప్పుడు చెల్లిస్తుందోనని ఎదురు చూస్తున్నాం.

– బూరె మాధవరావు, రైతు, సవరరామకృష్ణాపురం

బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాం



పంటల బీమా పరిహారం కోసం పెద్దతామరాపల్లి ఆంధ్రాబ్యాంకు చుట్టూ పలుమార్లు తిరుగుతున్నాం. అధికారులు మాత్రం ఇంకా పరిహారం రాలేదని సమాధానం చెబుతున్నారు. 2015లో రూ.90 వేలు రుణం తీసుకున్నాను. బీమా మొత్తం రూ.1,600 చెల్లించాను. అయితే ఇంతవరకు బీమా పరిహారం అందలేదు. బ్యాంకు అధికారులు స్పందించాలి.

–జినగ పోలయ్య, రైతు, కర్లపూడి

ఇంత నిర్లక్ష్యమా?



2015 పంట బీమా పరిహారం అన్ని బ్యాంకులకు వచ్చి ఆంధ్రా బ్యాంకుకు రాకపోవడంలో ఆంతర్యం తెలియడం లేదు. 2015లో రూ.80 వేలు రుణం తీసుకున్నాను. అప్పుడే రూ.1500 బీమా చెల్లించాను. నాకు 83 శాతం బీమా పరిహారం సుమారు రూ.70 వేలు రావాల్సి ఉంది. ఇది ముమ్మాటికీ బ్యాంకు అధికారుల నిర్లక్ష్యమని స్పష్టమవుతోంది.

– తమిరె ధర్మారావు, రైతు, పెద్దతామరాపల్లి


పలుమార్లు విన్నవించాం



పంటల బీమా పరిహారం విడుదల చేయాలని పలుమార్లు బీమా సంస్థకు విన్నవించాం. మరి వాళ్లు స్పందించడంలేదు. మా ప్రయత్నం మేము చేస్తున్నాం.

– సీహెచ్ వెంకటకృష్ణ, మేనేజరు, ఆంధ్రాబ్యాంకు, పెద్దతామరాపల్లి

నూరు శాతం పరిహారం విడుదల చేయలేదు



ఆంధ్రాబ్యాంకుకు నూరు శాతం పంటల బీమా పరిహారం విడుదల చేయలేదు. దీంతో నూరు శాతం విడుదల చేయాలని బీమా సంస్థకు తెలియజేశాం. స్వయంగా బ్యాంకు అధికారిని హైదరాబాద్‌లోని బీమా సంస్థకు పంపించి వివరాలు అందజేశాం. మరి బీమా సంస్థ వారు పరిహారం ఎప్పుడు విడుదల చేస్తారన్నది మాకు తెలియదు. విడుదల చేసిన తక్షణం రైతుల ఖాతాల్లో జమచేస్తాం.

– రాధాకృష్ణన్, జోనల్ మేనేజరు, ఆంధ్రాబ్యాంకు, శ్రీకాకుళం

ఉద్యోగం వచ్చిందన్న ఆనందం మిగలకుండానే..

శిక్షణ కానిస్టేబుల్ మృతితో విషాదం



సుబ్బారావు (దాచిన చిత్రం)

అరసవల్లి, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న పిల్లా సుబ్బారావు (23) అనారోగ్యంతో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. రణస్థలం మండలం వల్లభరావుపేటకు చెందిన పిల్ల తవిటినాయుడు మూడో కుమారుడైన సుబ్బారావు ఈ ఏడాది జరిగిన పోలీసు ఎంపికల్లో విశాఖపట్నం జిల్లా గ్రామీణ ప్రాంతానికి ఎంపికయ్యాడు. శ్రీకాకుళం గ్రామీణ మండలం తండేంవలసలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీపీటీసీ)లో శిక్షణ పొందుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక వాంతులు కావడంతో తోటివారిని లేపి విషయాన్ని చెప్పాడు. శిక్షణ కేంద్రంలో ఉన్న అధికారికి వారు సమాచారం అందించడంతో శిక్షణ కేంద్రంలో ఉన్న అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు తల నీలం రంగులోకి మారుతుండటంతో తక్షణం విశాఖపట్నానికి తరలించాలని పోలీసు అధికారులకు సూచించారు. విశాఖకు తీసుకువెళ్ళేందుకు ఏర్పాట్లు చేస్తుండగా మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న సుబ్బారావు తండ్రి తవిటినాయుడు రిమ్స్‌కు చేరుకుని బోరున విలపించారు. క్రిస్మస్ వేడుకలకు గత గురువారం ఇంటికి వెళ్ళి తిరిగి శనివారం శిక్షణకు తిరిగివచ్చాడని.. అంతలోనే తిరిగిరాని లోకానికి వెళ్ళిపోయాడంటూ విలపించారు. కానిస్టేబుల్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ త్రివిక్రమవర్మ, అదనపు ఎస్పీ టి.పనసారెడ్డి, ఆర్ఐ రవికుమార్‌లు రిమ్స్‌కు వెళ్ళి సుబ్బారావు కుటుంబసభ్యులను పరామర్శించారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సివిల్స్‌కు సన్నద్ధమవుతూ..

సుబ్బారావుకు సివిల్స్ రాయడమంటే చాలా ఇష్టం. పోలీసు శిక్షణ పొందుతున్నా రోజూ పుస్తకాలను చదువుతుండేవాడని పోలీసులు చెబుతున్నారు. నూతన సంవత్సరాల వేడుకల్లో పాల్గొని నిద్రించాడని.. అనంతరం అనారోగ్యానికి గురయ్యాడని వివరించారు.

అన్నల కంటే ముందే ఉద్యోగం

రణస్థలం, న్యూస్‌టుడే: పిల్లలందరినీ ఉన్నత చదువులు చదివించారు. ఆఖరి కుమారుడిగా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చిందని కుటుంబమంతా సంతోషపడ్డారు. అతను శ్రీకాకుళంలో శిక్షణ పొందుతూ ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబం తల్లడిల్లుతోంది. గ్రామం విషాదంలో మునిగింది. శిక్షణ పూర్తయిన వెంటనే విధుల్లో చేరుతాడనే ఆశలు గల్లంతయ్యాయి. రణస్థలం మండలం వల్లభరావుపేటకు చెందిన పిల్ల సుబ్బారావు మృతి చెందడంతో తల్లిదండ్రులు తవిటినాయుడు, అనసూయ, ఇతర కుటుంబ సభ్యులు విషాదంలో మునిగారు. సుబ్బారావుది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. రెండెకరాల వ్యవసాయ భూమిని తల్లిదండ్రులు సాగు చేస్తూ.. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తాము నిరక్షరాస్యులైనా పిల్లలను ఉన్నంతలో ఉన్నత చదువులు చదివించారు. సుబ్బారావుకు ఇద్దరు అన్నయ్యలు వాసు, అప్పలరాజు, అక్కయ్య రాధ ఉన్నారు. ముగ్గురూ పీజీ వరకు చదివి వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. సుబ్బారావు డిగ్రీ వరకు చదివారు. కానిస్టేబుల్ పరీక్ష రాసి ఎంపికయ్యాడు. మిగిలిన వారి కంటే ముందుగా ఉద్యోగమొచ్చిందని కుటుంబమంతా సంతోషపడ్డారు. ఉద్యోగ వేటలో ఉన్న తన సోదరులకు ఆసరాగా నిలుస్తాడనుకున్నారు. అంతలోనే అనంత లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. సుబ్బారావు గతంలో గ్రూప్-2కు ఎంపికై ఇంటర్వ్యూ వరకు వెళ్లాడు. అతని మృతదేహానికి మంగళవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారని గ్రామస్థులు తెలిపారు.




తలపాగకు..తలోచేయి

జి.సిగడాం, న్యూస్‌టుడే : శ్రీశైల మల్లికార్జునస్వామికి మహాశివరాత్రి పర్వదినం రోజున అలంకరించేందుకు తలపాగాను జి.సిగడాం మండలం దేవరవలస చేనేత కార్మికులు సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించి పనులు చురుగ్గా చేపడుతున్నారు. గ్రామ వీధుల్లో తలపాగాను నేసేందుకు తగిన ఏర్పాటు చేసి అంతా పనిలో నిమగ్నమయ్యారు. ఇందుకు వీధి పొడవున మగ్గం ఏర్పాటు చేశారు. ఇప్పటికే నేత పనులు చురుగ్గా సాగుతున్నాయని సంఘ సభ్యులు తెలిపారు. ఏటా దేవరవలస నుంచి స్వామికి తలపాగ పంపడం ఈ గ్రామస్థులకు ఆనవాయితీగా వస్తుంది.

చికెన్ ధరలు **బ్రాయిలర్ (బ్యాగ్) లైవ్:** 100; డ్రస్డ్: 155; స్కిన్‌లెస్: 175, **వెన్‌కాబ్:** లైవ్: 102; డ్రస్డ్: 143; స్కిన్‌లెస్: 168, **సుగుణ:** లైవ్ 108; డ్రస్డ్: 157; స్కిన్‌లెస్: 184.

ఆస్తి వివాదమే హత్యకు దారి తీసింది

సీఐ ఎన్.వేణుగోపాలరావు వెల్లడి



నిందితుడు సీతంనాయుడు

రాజాం, న్యూస్‌టుడే: తనయుడును చంపిన తండ్రిని సోమవారం అరెస్టు చేసినట్లు రాజాం సీఐ ఎన్.వేణుగోపాలరావు తెలిపారు. ఆయన చెప్పిన వివరాలు ప్రకారం రాజాం పట్టణంలోని నవ్యనగర్‌కు చెందిన కలిపిండి శ్రీకాంత్‌నాయుడు డిసెంబరు 28వ తేదీ రాత్రి హత్యకు గురయ్యాడు. ఇతనను చంపింది కన్న తండ్రి సీతంనాయుడేనని సీఐ తెలిపారు. ఆస్తి వివాదమే హత్యకు దారి తీసిందన్నారు. సీతంనాయుడుకు స్వగ్రామం విజయనగరం జిల్లా కూనాయవలసలో కొంత భూమి ఉంది. కుమార్తె వివాహం కోసం భూమిని విక్రయించాలని నిర్ణయించారు. సీతంనాయుడు సొంత సోదరికి ఈభూమి విక్రయించాలని పట్టుబడుతుండగా కుమారుడు , తల్లి సరోజిని ఇందుకు ససేమిరా అంటూ వచ్చారు. బయట వాళ్లకు విక్రయిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని, బయట వారికే అమ్ముదామని వీరు పట్టుబట్టారు. తన మాటకు అడ్డువస్తున్నారని ఆగ్రహించిన సీతంనాయుడు, కన్నకొడుకు విక్రాంత్‌నాయుడు నిద్రిస్తుండగా కత్తితో తలపై బలంగా వేటు వేశాడు. తీవ్ర రక్తస్రావం జరగడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ అర్ధరాత్రి తరువాత శ్రీకాంత్‌నాయుడు మృతి చెందారు. నేరాన్ని నిందితుడు అంగీకరించినట్లు సీఐ చెప్పారు.

ద్విచక్రవాహనం ఢీకొని కార్మికుడి మృతి



బత్సల దానయ్య (దాచినచిత్రం)

సీతానగరం(సంతబొమ్మాళి), న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామ పంచాయతీ సీతానగరం వద్ద సోమవారం జరిగిన రహదారి ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే... సీతానగరం గ్రామానికి చెందిన ఉప్పు పరిశ్రమ కార్మికుడు బత్సల దానయ్య(60) పని ముగించుకొని ఇంటికి తిరిగొస్తుండగా పూండి నుంచి టెక్కలి వెళుతున్న ఇద్దరు వ్యక్తులు తాము ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనంతో బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. తలకు తీవ్ర గాయం కావడంతో టెక్కలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించంతో '108' వాహనంలో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. రహదారి ప్రమాదానికి కారణమైన నిందితులిద్దరూ పరారయ్యారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ. సింహాచలం తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఇచ్ఛాపురం

దూగానపుట్టుగలో స్వచ్ఛ భారత్

బెజ్జిపుట్టుగ (కవిటిగ్రామీణం), న్యూస్‌టుడే: దూగానపుట్టుగలో సోమవారం గ్రామస్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెల 1వ తేదీన పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగంగా పెదతాత యువజన సంఘం ఆధ్వర్యంలో యువకులు, విద్యార్థులు శ్రమదానంతో పరిశుభ్రతను చేపట్టారు. వీధులను ఊడ్చి, మురుగు కాలువలను శుభ్రం చేశారు. బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు.

తెరపై సినిమాలు

● ఇచ్ఛాపురం : ఎల్‌మార్క్స్ సినిమా (శ్రీమణికంఠ) **2 కంట్రీస్, పూర్ణ - ఎంసీఏ** ● సోంపేట : శ్రీనివాస - **ఒక్క క్షణం,** తిరుమల - **ఎంసీఏ** ● కవిటి : మహలక్ష్మి - **ఎంసీఏ,** అశోక్ : **2కంట్రీస్**

–న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వేడుకగా నూతన సంవత్సర సంబరాలు



పురాధ్యక్షురాలు రాజలక్ష్మి ఇంటి వద్ద వేడుకలలో పురాధికారులు, సిబ్బంది



ఎంపీపీ ఇప్పిలి లోలాక్షీ కృష్ణారావుకు శుభాకాంక్షలు తెల్పుతున్న రెవెన్యూ, అధికారులు, సిబ్బంది



ఇచ్ఛాపురం దినవారీ బజారులోని వ్యాపారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న స్వర్ణమణి



ఎమ్మెల్యే అశోక్‌కు శుభాకాంక్షలు చెబుతున్న కమిషనర్ రవిబాబు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురంలో నూతన సంవత్సర సంబరాలు వేడుకగా జరిగాయి. వివిధ కూడళ్లలో సినిమా పాటలు వేసుకొని ఉల్లాసంగా నృత్యాలు చేశారు. గోర్జీవీధిలో మహిళలు సైతం నృత్యాల్లో పాల్గొని, అందరిని ఆకర్షించారు. మంగళవారం పేటలో చోటాభీమ్ రంగవల్లి కను తీర్చిదిద్దిన ఆ ప్రాంత చిన్నారులు ఉత్సాహంగా కేకును కత్తిరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఈటీల సంఘం ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఎంఈవో కురమాన అప్పారావు కేక్‌ను కత్తిరించి, అందరికీ శుభాకాంక్షలు చెప్పారు. పలు చోట్ల బాణసంచాను కాల్చారు. మహిళలు ఇంటి ముంగిట రంగవల్లికలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా ఇచ్ఛాపురం శాసనసభ్యులు డా. బెందాళం అశోక్‌కు ఇచ్ఛాపురం మండల, పట్టణ నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అలానే పురాధ్యక్షురాలు రాజలక్ష్మి ఇంటికి వెళ్లి పురాధికారులు, కొందరు కౌన్సిలర్లు శుభాకాంక్షలు చెప్పారు.

కవిటి, న్యూస్‌టుడే: కొత్త సంవత్సర వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే డా. బి.అశోక్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నేతలు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో కేక్‌ను కోసి వేడుకలు జరిపారు. మాజీ ఎంపీపీ బి.ప్రకాశ్ పాల్గొన్నారు. కవిటిలో జడ్పీటీసీ సభ్యుడు బి.రమేష్, సర్పంచి పి.శేఖర్‌లు అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. పి.ఎ.సి.ఎస్. అధ్యక్షులు బి.చిట్టిబాబు, వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పి. సాయిరాజ్ నివాసాలలో వేడుకలు నిర్వహించారు.



కవిటిలో కేక్‌ను కోస్తున్న ఎమ్మెల్యే అశోక్



కవిటి గ్రామీణం: ఎంపీపీ కిరణకుమారికి అభినందనలు తెలియజేస్తున్న అధికారులు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రజాప్రతినిధులకు వివిధ వర్గాల వారు అభినందనలు తెలిపారు. ఎంపీపీ బి.కిరణకుమారి, జడ్పీటీసీ సభ్యుడు బి.రమేశ్, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.చిట్టిబాబు, కవిటి మేజర్ పంచాయతీ సర్పంచి పి.శేఖర్‌కు అధికారులు, వివిధ పక్షాల నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిషత్తు, ఉపాధిహామీ పథకం, వ్యవసాయశాఖ, రెవెన్యూ, గృహనిర్మాణశాఖాధికారులు ప్రజాప్రతినిధులకు గృహాలు, కార్యాలయాల వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కంచిలి, న్యూస్‌టుడే: మండలంలో నూతన సంవత్సర వేడుకలను పురష్కరించుకొని అన్ని వర్గాలవారు ఘనంగా వేడుకలు నిర్వహించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు స్థానిక యువకులంతా ఆటపాటలతో నూతన సంవత్స వేడుకలు నిర్వహించుకున్నారు. సోమవారం ఉదయం మండలం పరిధిలో ఉద్యోగులు, వ్యాపారులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిద వర్గాల వారు తమ మిత్రులు, బందువులకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేసుకున్నారు.

ప్రజా ప్రతినిధుల సమక్షంలో..

మండలానికి చెందిన ప్రజాప్రతినిధుల సమక్షంలో నూతన సంవత్సర వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. మండలాధ్యక్షురాలు ఇప్పిలి లోలాక్షీకృష్ణారావు, ఉపాధ్యక్షురాలు మునకాల శేషమ్మావీరాస్వామి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు చేపట్టారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వెలుగు, విద్యా, వ్యవసాయ, వైద్య ఆరోగ్యశాఖలకు చెందిన ఉద్యోగులతో పాటు ఉపాధ్యాయ సంఘాలు, ఆటోయూనియన్ ప్రతినిధులు, నాయకులు, ప్రజలు వారిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ● మార్కెట్ కమిటీ ఛైర్మన్ బంగారు కురయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు తమరాల శోభన్‌లకు స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. ● జెడ్పీటీసీ సభ్యులు జామి జయ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పలికల భాస్కరరావులకు వివిధ శాఖల ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిజేశారు. ● అదేవిధంగా కంచిలికి చెందిన మాజీ శాసన సభ్యుడు నరేష్‌కుమార్ అగ్రవాల(లల్లూ)ను నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, ఆయన అభిమానులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



మాజీ జడ్పీటీసీ సభ్యుడు దాసు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న విద్యా సంస్థల ప్రతినిధులు

'నూతన' ఉత్తేజంతో ఘనంగా వేడుకలు

● ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షల వెల్లువ ● రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద హడావిడి

సోంపేట, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఎన్నికల ఏడాది కావడంతో రాజకీయ పార్టీల నాయకుల ఇళ్ల వద్ద పెద్ద ఎత్తున హడావిడి చోటుచేసుకుంది. పలాస, ఇచ్ఛాపురం ఎమ్మెల్యేలు గౌతు శ్యామసుందర శివాజీ, డాక్టర్ బెందాళం అశోక్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు నరేష్‌కుమార్ అగర్వాలా, పిరియా సాయిరాజ్, వైకాపా సమన్వయకర్త నర్తు రామారావుల వద్దకు ఆయా పార్టీల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

● సోంపేట మండలానికి చెందిన తెదేపా నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఇతర వర్గాల ప్రతినిధులు ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ఇంటి వద్దకు పెద్ద ఎత్తున తరలివెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

● సోంపేట మండలాధ్యక్షుడు చిత్రాడ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సూరాడ చంద్రమోహన్‌లకు మండల స్థాయి అధికారులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తెదేపా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు తరలివచ్చి ఇరువురు నాయకుల వద్ద హడావిడి చేశారు. సోంపేట సర్పంచి చిత్రాడ నాగరత్నం శేఖర్‌ను పలువురు తెదేపా నాయకులు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● వివిధ శాఖల అధికారులకు సంబంధిత సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, డీలర్లు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

● మాజీ మండలాధ్యక్షులు మంగి గణపతి, మంగి ధనలక్ష్మి, మాజీ జడ్పీటీసీ సభ్యులు డాక్టర్ ఎన్.దాసులకు పలువురు వైకాపా నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

కంచిలి, న్యూస్‌టుడే: కొత్త ఏడాది 2018లో యువతకు వ్యాపార, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో కొత్త అవకాశాలు తెచ్చిపెట్టాలని కంచిలి మండల తెదేపా యువత అధ్యక్షుడు బి.కామేశ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కోసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం మండలానికి చెందిన తెదేపా నాయకులంతా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌ను కవిటిలో కలిసి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



కంచిలిలో కేక్‌ను కోస్తున్న తెదేపా నాయకులు

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తుల పంపిణీ దృశ్యం

బారువ (సోంపేట), న్యూస్‌టుడే: బారువ ఫెయిత్ హోమ్ చర్చిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పేద క్రిస్టియన్ వర్గాల కుటుంబాలకు దుస్తులు, చీరలు, ఇతర పరికరాలు పంపిణీ చేశారు. ఫాస్టర్ ఎ.జాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎల్.రమేశ్, బి.రవి, తదితరులు పాల్గొని పేదలకు దుస్తులు, ఇతర పరికరాలను అందజేశారు.

ఎమ్మెల్యే డైరీ

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం శాసనసభ్యులు అశోక్ మంగళవారం ఇచ్ఛాపురం పురపాలక సంఘ సమావేశ మందిరంలో వివిధ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహిస్తారు. గురువారం ఇచ్ఛాపురం రానున్న సీఎం పర్యటనపై సమీక్ష అనంతరం బూర్జపాడులో జరిగే జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పాల్గొంటారు.

గ్యాస్ సరఫరా

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురంలోని శ్రీవెంకట సిద్ధభైరవి గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం ఇచ్ఛాపురం మండలంలోని కేదారిపురం, ముచ్చింద్ర, బాలకృష్ణాపురం, బెన్నుగానిపేట, మండపల్లి గ్రామాలకు, పట్టణంలో ఉన్న ఎ.ఎస్.పేట, పురుషోత్తపురం గ్రామాలతో పాటు పట్టణంలోని పలు వీధులకు గ్యాస్ సరఫరా చేస్తామని సంస్థ ప్రతినిధి వజ్రపు వెంకటేశ్ తెలిపారు.

ఇచ్ఛాపురం

ఘనంగా ధనుర్మాస పూజలు

ప్రగడపుట్టుగ (కవిటి), న్యూస్‌టుడే : ప్రగడపుట్టుగ కోదండ రామాలయంలో ధనుర్మాస పూజలను ఘనంగా నిర్వహించారు. సోమవారం వేకువ జాము నుంచే పూజలు ప్రారంభించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తిరుప్పావై పూజలను చేశారు. ప్రధానార్చకులు గార అంగధరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.



వస్త్రపురి కాలనీని వీడని డ్రైనేజీ కష్టాలు

● ఇళ్లల్లో ప్రవేశిస్తున్న మురుగునీరు ● చినుకుపడితే అవస్థలు వర్ణనాతీతం

న్యూస్‌టుడే- సోంపేట

సోంపేట వస్త్రపురి కాలనీ వీధుల్లో డ్రైనేజీ నిర్మాణం అస్తవ్యస్తంగా ఉండటంతో వందలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇళ్ల మధ్య భాగంలో నిర్మించిన డ్రైనేజీ ప్రణాళికాబద్ధంగా లేకపోవడంతో మురుగునీరు దిగువనున్న ఇళ్లల్లోకి ప్రవేశిస్తుంది. వర్షం పడితే మెట్ట భాగం నుంచి వరదనీరు డ్రైనేజీ మీదుగా ఇళ్లల్లో ప్రవేశిస్తుండటంతో కంటి మీద కునుకు లేని పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదనీరు, మురుగునీటితో పాటు పాములు, కప్పలు, పురుగులు, ఇతర క్రిమికీటకాలు ఇళ్లల్లోకి చేరుతుండటంతో సమస్యలను ఎదుర్కోవల్సిన పరిస్థితి నెలకొంది. కాలువ భాగం ఎత్తు చేయడంతో పాటు నిర్మాణాలను క్రమబద్ధీకరించి ఇబ్బందులను పరిష్కరించాలని ఏళ్ల తరబడిగా అధికారులను కోరుతున్నప్పటికీ పట్టించుకోకపోవడం దురదృష్టకరమని వస్త్రపురి కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఈ విషయమై సోంపేట ఈవో జ్యోతీశ్వరరెడ్డి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా నిధుల కొరత మూలంగా ఈ ఏడాది పనులు చేయలేమని, పంచాయతీ పాలకవర్గంతో చర్చించిన తరవాత వచ్చే ఆర్థిక సంవత్సరం ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.


మురుగునీటిని ఇంటి నుంచి బయటకు తోడుతున్న స్థానికులు (దాచిన చిత్రం)


వర్షాకాలంలో వరదనీటిని బయటకు పంపించేందుకు స్థానికుల అవస్థలు(దాచిన చిత్రం)


సంక్రాంతి కానుకలను అందిస్తున్న శంకరరెడ్డి

ప్రతి పేదింటిలోనూ సంక్రాంతి వెలుగులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ప్రతి పేదింటిలోనూ సంక్రాంతి పండగ వెలుగులు చూసేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్రాంతి కానుకలను అందిస్తున్నారని ఇచ్ఛాపురం సూపర్ మార్కెట్ అధ్యక్షుడు కొండా శంకరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఇచ్ఛాపురం సూపర్ మార్కెట్ ఆవరణలో హిందువులందరికీ చంద్రన్న సంక్రాంతి కానుకలను అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రతినిధి మల్లా వైకుంఠరావు కూడా పాల్గొన్నారు.

ఈదుపురంలో..

తిప్పనపుట్టుగ(ఇచ్ఛాపురం గ్రామీణం), న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురం పంచాయతీ తిప్పనపుట్టుగలో చంద్రన్న కానుకలను తెదేపా నాయకుడు నర్తు ప్రేమ్‌కుమార్ చంద్రన్న సంక్రాంతి సరకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద తిప్పన దాలయ్యరెడ్డి, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు. బూర్జపాడులో మాజీ సర్పంచి దున్న లోకనాథం, ధర్మపురంలో పి. హేమరాజు, మశాకపురంలో సర్పంచి భవానీ సరకులను అందించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

గాంధీపార్కు (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: నిరుపేదల కళ్లల్లో ఆనందాన్ని చూసినప్పుడే ఆయా సేవలకు పరమార్థం ఉంటుందని ఇచ్ఛాపురం పురపాలక సంఘ అధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి అన్నారు. సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సంతపేటలోని పెంతెకొస్తు న్యూ బిలీవర్స్ ప్రార్థనా మందిరంలో సంఘ కాపరి ప్రభుదాస్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఏటా ఈ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పురాధ్యక్షురాలు రాజలక్ష్మి పేర్కొన్నారు. 20 మంది నిరుపేదలకు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మేరుగు రాజేశ్వరి, బాసి పార్వతీశం, సాలిన డిల్లీరావులతో పాటు మేరుగు వెంకటరావు పాల్గొన్నారు.


పేదలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న పురాధ్యక్షురాలు రాజలక్ష్మి

వైద్య, ఆరోగ్య సౌకర్యాలు పెంపొందిస్తాం

గొర్లెపాడు(కవిటి గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్య సదుపాయాలను పెంపొందిస్తామని ఎమ్మెల్యే డా. బి.అశోక్‌బాబు అన్నారు. గొర్లెపాడులో సోమవారం రూ.9 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ బి.ప్రకాష్, జడ్పీటీసీసభ్యుడు బి.రమేష్, జిల్లాకోఆప్షన్‌సభ్యుడు సదానందరౌళో, సర్పంచి బి.పాపమ్మ, వైద్యఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌బాబు

నేటి నుంచి జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలు

కంచిలి, న్యూస్‌టుడే: నేటి నుంచి జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని మండలంలో చేపట్టనున్నారు. మంగళవారం తహసీల్దార్ సమక్షంలో జాడుపూడి, పెద్దకొజ్జిరియాలలోనూ, ఎంపీడీవో సమక్షంలో మఖరాంపురం, కత్తివరం పంచాయతీల్లో ఈ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు చేపట్టనున్న కార్యక్రమాల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని తహసీల్దార్ రామ్మోహనరావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డిలు తెలిపారు.

సీహెచ్.కపాసుకుద్ది (కవిటిగ్రామీణం), న్యూస్‌టుడే: జన్మభూమి-మా ఊరు గ్రామసభలను మంగళవారం కపాసుకుద్ది, నెలవంకలలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.రామకృష్ణారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేటలోని మేమున్నాం స్వచ్ఛంద సేవా సంస్థ రోగుల సేవలో సోమవారం గడిపింది. పూర్వ విద్యార్థులంతా సోంపేట సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 30 మంది రోగుల యోగక్షేమాలను తెలుసుకొని వారి అవసరాలు తీర్చేందుకు చర్యలు చేపట్టారు. అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.చిరంజీవి, పి.చంద్రశేఖర్, బి.సతీష్, బి.శంకరరావు, బి.జానకిరావు, ఒ.పాపారావు, ఆనంద్‌ల ఆధ్వర్యంలో మేమున్నాం ప్రతినిధులు రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు అందజేశారు. పేద రోగుల అత్యవసరాలు తీర్చేందుకు తమ వంతు సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు.


పండ్లు, రొట్టె అందజేస్తున్న మేమున్నాం సంస్థ ప్రతినిధులు

డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: దినవారీ తేదీ, వారాలు, తిథి, నక్షత్రాలను తెలిపే దినసూచికలు(క్యాలెండర్లు), దైనందిని(డైరీ)ల వినియోగం ద్వారా చక్కటి ప్రణాళికతో ముందుకు సాగవచ్చునని ఇచ్ఛాపురం ఎంఈవో కురమాన అప్పారావు అన్నారు. సోమవారం ఇక్కడి మండల విద్యావనరుల కేంద్రంలో ఇచ్ఛాపురం ఉపాధ్యాయ సంఘాలైన యూటీఎఫ్, ఏపీటీఎఫ్ దైనందినిలు, క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు ఆర్.వి.అనంతాచార్యులు, ఉమాశంకర్, సత్యమయ్య, సుహాస్‌చంద్‌లతో పాటు యూటీఎఫ్ ప్రతినిధులు ఎస్.ధనుంజయరావు, ఎ.శ్రీనివాసరావు, పి.ప్రేమ్‌కుమార్, పి.ప్రత్యూష, డి.భాస్కరరావు, కుమార్, రామప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే డా.బి.అశోక్‌బాబు సోమవారం ఆవిష్కరించారు. రామయ్యపుట్టుగలో ఏపీయూఎస్ నాయకులు సోమేశ్వరరరావు, కిరణ్, భగవాన్, విశ్వనాథం, శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఉపాధ్యాయ సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేసారు.


ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, పాకెట్ డైరీలను ఆవిష్కరిస్తున్న ఎంఈవో అప్పారావు


కవిటి గ్రామీణం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌బాబు

ఆదిత్యునికి సహస్ర దీపాలంకరణ

అరసవల్లి, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం సహస్ర దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. పుష్యపౌర్ణమి సందర్భంగా ఆలయ అనివెట్టి మండపం సమీపంలో ఉషాపద్మినీ ఛాయ సమేత ఉత్సవ మూర్తులను ఊయలలో వేంచేయించి అర్చకులు కీర్తనలు పాడారు. అనంతరం సహస్ర దీపాలంకరణ చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సహస్ర దీపాలంకరణ చేస్తున్న అర్చకులు

రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి దశగా

జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: గడచిన ఏడాదిలో జిల్లా అభివృద్ధికి అందరూ కృషిచేశారని.. ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి పిలుపునిచ్చారు. ప్రధానంగా రెవెన్యూశాఖపై కీలక బాధ్యత ఉంటుందని, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని పేర్కొన్నారు. నూతనసంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్‌ను జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో రెవెన్యూశాఖ భాగస్వామ్యం అధికమని.. అందరు సమన్వయంతో పనిచేస్తేనే ప్రగతి సాధ్యపడుతుందన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జల్లేపల్లి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వేణుగోపాలరావు, బి.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురి శుభాకాంక్షలు... కలెక్టర్ కె.ధనంజయరెడ్డికి సంయుక్త కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధరబాబు, సంయుక్త కలెక్టర్-2 పి.రజనీకాంతరావు, శ్రీకాకుళం, పాలకొండ, టెక్కలి ఆర్డీఓలు బి.దయానిధి, ఆర్.గున్నయ్య, ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి ఎస్.తిరుపతిరావు, వ్యవసాయశాఖ జేడీ జి.రామారావు, ఖజానా శాఖ డీడీ నిర్మలమ్మ, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, బీసీ కార్పొరేషన్ ఈడి రాజారావు, డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, పశుసంవర్ధక శాఖ జేడీ ఎం.వెంకటేశ్వర్లు, డీఎస్‌వో జి.మోహనబాబు, వయోజన విద్య డీడీ జి.కృష్ణారావు, డీపీవో కోటేశ్వరరావు, డీపీఆర్‌వో లోచర్ల రమేష్, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి రమేష్‌బాబుతో పాటు పలువురు జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బి.రమేష్ ఆధ్వర్యంలో పలువురు మిల్లర్లు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను శాలువాతో సత్కరించారు. జవహర్ నవోదయ విద్యార్థులు కలెక్టర్‌కు చిత్రపటాన్ని బహూకరించారు.



రెవెన్యూ సర్వీసుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ దృశ్యం

ఎం.ఎన్.మూర్తికి ఆర్‌ఐగా పదోన్నతి



పోలీసుక్వార్టర్స్(ఎచ్చెర్ల), న్యూస్‌టుడే : ఎచ్చెర్ల మండలంలోని ఏఆర్ కార్యాలయంలో ఆర్‌ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎన్.మూర్తికి ఆర్‌ఐగా పదోన్నతి పొందారని ఆర్ఐ కోటేశ్వరబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పదోన్నతిపై ఈయనను హైదరాబాదు ఆక్టోపస్‌కు బదిలీ చేయటం జరిగిందన్నారు.

కన్నులపండువగా సహస్ర దీపారాధన



వెంకటేశ్వర ఆలయ ముఖద్వారం వద్ద దీపపు కాంతులు

చీడిపూడి(సారవకోట), న్యూస్‌టుడే: సారవకోట మండలం చీడిపూడి గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో సోమవారం వేకువజామున భక్తులు జరిపిన సహస్ర దీపారాధన కన్నుల పండువగా సాగింది. ఆలయ ముఖద్వారం వద్ద ఉన్న మెట్లతోపాటు ఆలయ పరిసరాల్లో కూడా దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నార్ను.

జిల్లా ప్రజలంతా ఆనందంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లాజడ్జి వి.బి.నిర్మలగీతాంబ

శ్రీకాకుళం లీగల్, న్యూస్‌టుడే: నూతన సంత్సరంలో జిల్లాప్రజలు, న్యాయవాదులు అంతా ఆనందంగా ఉండాలని జిల్లాజడ్జి వి.బి.నిర్మలగీతాంబ ఆకాంక్షించారు. నూతన సంవత్సర ఆరంభం సందర్భంగా జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదనపు జిల్లాజడ్జి వి.గోపాలక్రృష్ణారావు, వినియోగదారుల న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీరాంమూర్తి, సీనియర్ సివిల్ జడ్జీలు పి.వి.ప్రసాదరావు, వివేకానందశ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జి ఆర్.శాంతశ్రీ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపు సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కడగళ రాంబాబునాయుడు, బెహర తిరుమలరావు, పిట్ట దామోదరరావు, తలే లక్ష్మణరావు, త్రిపురాన వరప్రసాద్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. అందరూ పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా కేకు కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు.

జాతీయస్థాయి లగోరి పోటీలకు లింగాలవలస విద్యార్థి ఎంపిక

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 5, 6, 7వ తేదీల్లో కర్ణాటక రాష్ట్రం మంగళూరులో జరగనున్న జాతీయస్థాయి లగోరి పోటీలకు లింగాలవలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదోతరగతి విద్యార్థి జి.తిరుమలరావు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.అనూరాధ తెలిపారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి అర్హత సాధించాడన్నారు. ఎంపికైన విద్యార్థిని వ్యాయామోపాధ్యాయులు బి.నారాయణ, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా పడిపూజ

కుందువానిపేట (కలెక్టరేట్), న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని కుందువానిపేటలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అయ్యప్ప పడి పూజను ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, మాజీ సర్పంచి గురుస్వామి దానయ్య, ఎస్.సత్యం, పి.కొండబాబుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కుందువానిపేట, బలరాంపురం, పుక్కళ్లపేట తదితర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్పభజన చేస్తున్న భక్తులు



హాజరైన అయ్యప్ప స్వాములు

'నూతన' సంబరం... అభిమాన సౌరభం



నిమ్మాడలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడిని భారీ గజమాలతో సన్మానిస్తున్న ఎన్జీవో సంఘం ప్రతినిధులు






మంత్రి, ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ త్రివిక్రమవర్మ, ఎమ్మెల్యేలు అశోక్, లక్ష్మీదేవి, డీటీసీ శ్రీదేవి



'విప్' రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ-2 రజనీకాంతారావు

నూతన సంవత్సర వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖులకు, అధికారులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేసేందుకు బారులుతీరారు. కొత్త ఏడాదిలో అంతా మంచే జరగాలని కోరుకున్నారు. ప్రజాప్రతినిధులను కలిసిన నాయకులు అభినందనలు తెలియజేశారు. నేతలు కార్యకర్తలతో కలసి ఉత్సాహంగా గడిపారు. పలు చోట్ల పక్కాగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో జరిగిన ఆ కోలాహలాన్ని ఇక్కడి చిత్రాల్లో చూడొచ్చు.

–న్యూస్‌టుడే, కోటబొమ్మాళి, రాజాం, బృందం



కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో కార్యకర్తల సందడి



ఉపకులపతి ఆచార్య డా. కూన రామ్‌జీకి...



నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తికి శుభాకాంక్షలు



మాతలలో కేకు కత్తిరిస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే కలమట



ఎమ్మెల్యే గౌతు శివాజీ, తెదేపా జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీషలకు..



రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులుకు...



మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతికి...



రాజాంలో మంత్రి కళాను కలిసేందుకు వచ్చిన అభిమానులు



సీతంపేటలో కేక్ కత్తిరిస్తున్న ఐటీడీఏ పీవో శివశంకర్



వీరఘట్టం మండలంలోని వదువలో పాలకొండ ఎమ్మెల్యే కళావతికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, కార్యకర్తలు

ఆహ్లాదంతోనే ఆరోగ్యం

● రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ● రూ. 90 లక్షలతో నిర్మించిన ఉద్యానవనం ప్రారంభం



ఉద్యానవనంలో సేద తీరుతున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు

టెక్కలి, న్యూస్‌టుడే: ఆహ్లాదమే ఆరోగ్యానికి నాంది అని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక కింజరాపు ఎర్రన్నాయుడు రక్షిత తాగునీటి పథకం ఆవరణలో రూ. 90 లక్షల నిధులతో నిర్మించిన కింజరాపు ఎర్రన్నాయుడు ఉద్యానవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. జిల్లాలో మరెక్కడా లేని విధంగా టెక్కలిలో ఉద్యానవనాలను అభివృద్ధి చేశామని, జిల్లాకే తలమానికంగా టెక్కలి ఉద్యానవనం నిలుస్తుందన్నారు. టెక్కలిలో పట్టణ గృహనిర్మాణ పథకం అమలుకు ఇప్పటికే సంబంధిత మంత్రితో మాట్లాడానని, త్వరలోనే కార్యరూపం దాలుస్తుందన్నారు. నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి భావనపాడు నౌకాశ్రయానికి సంబంధించి అనుమతులు మంజూరు చేస్తూ నిర్ణయించినట్లు చెప్పడం ఎంతో ఉత్సాహాన్నిచ్చిందన్నారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, టెక్కలి ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ తదితరులతో కలిసి కొంతసేపు సేదతీరారు. ఈ సందర్భంగా ఆదిఆంధ్రావీధికి చెందిన చిన్నారులు నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్‌ను కత్తిరించి వారితో సందడిగా గడిపారు. నేతలు, అధికారులు అంతా కలిసి సందడిగా గడుపుతూ ఉల్లాసంగా, ఆహ్లాదంగా నవ్వులు విరబూయించారు.



బారువ తీరంలో సందర్శకుల సందడి

పోటెత్తిన జన 'సంద్రం'



కవిటి సముద్ర తీరంలో అధిక సంఖ్యలో ఉన్న సందర్శకులు

బారువ (సోంపేట), కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది సందర్శకులు బారువ తీరానికి చేరుకొని నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకున్నారు. మహేంద్రతనయ సాగర సంగమ ప్రాంతం మొదలు మూడు కిలోమీటర్ల మేర తీరంలో సందర్శకుల సందడి చోటుచేసుకుంది. ఇచ్ఛాపురం మొదలు టెక్కలి వరకు వివిధ మండలాల ప్రజలు బారువలో ఆనందంగా గడిపారు. అదేవిధంగా బ్రహ్మపుర, పర్లాఖెముండి, తదితర ఒడిశా జిల్లాల నుంచి అధిక సంఖ్యలో యువత బారువకు వచ్చి సందడి చేశారు. అలానే కవిటి సముద్రతీరానికి జనం పోటెత్తారు. సోమవారం ఉదయం నుంచి పరిసర మండలాలతో పాటు ఒడిశా ప్రాంతం నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. సమీప సరుగుడు వనంలో వంటలు చేసుకొని వనభోజనాలను ఆరగించారు.

గుడ్ల ధరలు

ఈ క్రింది తేదీలలో NECC వైజాగ్ జోన్ వారు ప్రకటించిన గుడ్ల ధరలు
(100 గుడ్ల ధర)

తేది	విశాఖపట్నం	విజయనగరం|శ్రీకాకుళం
31-12-2017	360/-	364/-
01-01-2018	370/-	374/-
02-01-2018	380/-	384/-

-జోనల్ చైర్మన్, NECC, వైజాగ్ జోన్

ఉపాధే లక్ష్యం...



● వైటీసీలో శిక్షణ పొందుతున్న గిరిజన యువత
● ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పనకు కృషి

శిక్షణ ఇలా... : కంప్యూటర్ బేసిక్స్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషు వంటి శిక్షన తరగతులను నిర్వహిస్తున్నారు. యువతకు ఉదయం వ్యాయామం, యోగా తరగతులను నిర్వహిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నారు. వారానికో పరీక్ష విధానాలను అమలు చేసి, ఉత్తీర్ణతలను తరగతి గదుల్లో వివరిస్తున్నారు. దీంతో వారిలో పోటీతత్వం ఉంటోందని కేంద్ర నిర్వాహకులు తెలిపారు. ఒక్కొక్క అభ్యర్థి సుమారు రెండు మాసాలపాటు ఈ శిక్షణ పొందారు. శిక్షణ తరగతులు పూర్తయిన తరువాత విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు, గుంటూరు తదితర పట్టణాల్లోని ప్రైవేటు సంస్థల్లో ఉపాధి లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

న్యూస్‌టుడే, పాతపట్నం


నిరుద్యోగులుగా ఉండే కంటే ప్రభుత్వం అందించే సాంకేతిక శిక్షణను అందిపుచ్చుకొని ఉపాధి దిశగా అడుగులు వేయడం మంచిదనే భావిస్తున్నారు నేటి గిరిజన గ్రామీణ యువత. ఉత్తమ భవిష్యత్తుకు కంప్యూటర్‌పై అవగాహన అవసరమని భావించి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఐటీడీఏ, ఏపీఎస్ఎస్‌డీసీలు అందిస్తున్న ప్రోత్సాహంతో ఉపాధిని ఒడిసిపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో పదో తరగతి ఆపై చదువుకొని ఆర్థిక పరిస్థితులు అనుకూలించక, ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక చాలా మంది గిరిజనులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఇలాంటి వారికి దిశనిర్దేశం చేసి ఉపాధివైపు వారిని మళ్లించేందుకు ఐటీడీఏ, ఏపీఎస్ఎస్‌డీసీలు సంయుక్తంగా పాతపట్నం యువ గిరిజన శిక్షణ కేంద్రంలో నవంబరు 2017 నుంచి ఫిబ్రవరి 2018 మాసం వరకు కంప్యూటర్ సహాయకులు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. పాతపట్నం, హిరమండలం, కొత్తూరుతో పాటు పలు మండలాలకు చెందిన 60 మంది యువతీ యువకులు కంప్యూటర్ సహాయకులుగా శిక్షణ పొందుతున్నారు.



శిక్షణ పొందుతున్న యువకులు

యువతకు ప్రోత్సాహం



చదువు పూర్తి చేసుకున్నా తరువాత ఉద్యోగాలు దొరకలేదు. ఉన్నత చదువులు చదువుకునేందుకు ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో నిరుత్సాహ పడ్డా. ఈ సమయంలో సాంకేతిక విభాగంలో ఉచితంగా శిక్షణ తరగతులు ఇస్తుండటంతో చేరా. శిక్షణ పొందుతున్నా. ఇదో మంచి అవకాశం.

- బి.వెంకటేష్, ములుగూడ


ఉచిత వసతి.. శిక్షణ బాగు..



గిరిజన గ్రామాల్లో వందల సంఖ్యలో నిరుద్యోగులు ఉన్నారు. ఉపాధి అవకాశాలు లేక నిరుత్సాహంగా ఉన్న తరుణంలో ఉచితంగా శిక్షణ, వసతి కల్పించడం చాలా మంచి అవకాశం. ఇక్కడ శిక్షణ పొందుతున్నవారు అంతా నిరుపేదలే. భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధించగలమన్న నమ్మకం వచ్చింది.

- జె.గౌతమి, ఓంద్రుజోల


శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు



యువతకు ఉపాధిని కల్పించేందుకు ఐటీడీఏ, ఎ.పి.ఎస్.ఎస్.డి.సి.లు ఎంతగానో కృషి చేస్తున్నాయి. ఈ శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న వారికి రూ.8 నుంచి రూ.13 వేలు వరకు చెల్లించేందుకు ప్రైవేటు సంస్థలు ముందుకు వస్తున్నాయి.

- కె.శ్రీనివాసరావు, సంరక్షకుడు, వైటీసీ, పాతపట్నం

నిర్వహణ ఇలా... నిఘా ఎలా!!





పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్సులో ఆ శాఖాధికారులు రెండేళ్ల కిందట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల భద్రత దృష్టిలో ఉంచుకుని మూడు చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. కంట్రోలర్ గదిలో నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కానీ కెమెరాల నిర్వహణ లేకపోవడంతో దుమ్ము, ధూళితో నిండిపోయి ఉన్నాయి. ఇలానే వదిలేస్తే పూర్తిగా దుమ్ముతో నిండిపోతాయి. లక్ష్యం నెరవేరదు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి నిత్యం అయిదువేల మందికి పైగా రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో కాంప్లెక్సులో చోరీలు సైతం చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అధికారులు వీటి నిర్వహణ సక్రమంగా చేపడితే ఎటువంటి ఘటనలు చోటుచేసుకున్నా నిందితులను సులభంగా పట్టుకోవచ్చు.

–న్యూస్‌టుడే, పాలకొండ

చరిత్ర జ్ఞాపకాలు ఆ పంచరత్నాలు

ఈ



వంశధార జలాశయం

వంశధార జలాశయం నిర్మాణంతో జిల్లా స్వరూపం మారనుంది. ఇటు సాగునీటి అవసరాలలోను, అటు భౌగోళికంగా గ్రామాలు, జనాభా పరంగా పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. నిర్వాసిత గ్రామాలను తొలగించి వారికి మరోచోట నివాసాలను ఏర్పాటు చేస్తుండటంతో పలు మార్పులు జరగనున్నాయి. 'పంచ రత్నాలు' పిలిచే గ్రామాలు పాడలి, తులగాం, దుగ్గుపురం, తులగాం, చిన్నకొల్లివలస కనుమరుగయ్యాయి. మండలాల్లోను ఆర్థికంగా, సామాజికంగా, జనాభా పరంగా క్రమేపీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆమదాలవలస మండలంలో కొద్దిపాటి భూభాగం మినహా, దాదాపు గరిష్ఠంగా పాతపట్నం నియోజకవర్గంలోనే ఈమార్పులన్నీ చోటు చేసుకోవడం గమనార్హం.

–న్యూస్‌టుడే , హిరమండలం



గార్లపాడు



దుగ్గుపురం



చిన్నకొల్లివలస



పాడలి



తులగాం

మారనున్న 'హిరమండలం' స్వరూపం..

జిల్లా భౌగోళిక చిత్రపటంలో మార్పులు

ఎల్ఎన్‌పేట, కొత్తూరు మండలాల్లో ఒక్కసారిగా జనాభా పెరుగుదల

'పంచ రత్నాలు'గా ఎందుకు పిలుస్తారంటే:

వంశధార నదిపై గొట్టాబ్యారేజి నిర్మాణం సమయంలో అప్పట్లో రాష్ట్రపతి వివి గిరి ఈప్రాంతంలో పర్యటించారు. పాడలి, తులగాం, దుగ్గుపురం, తులగాం, చిన్నకొల్లివలస గ్రామాల మీదుగా వెళ్లే సమయంలో ఇక్కడ తాగు, సాగు నీరు, పాడి పంటలు, పచ్చని కొండలు, ప్రజల స్థితిగతులు భౌగోళిక స్వరూపంను చూసి ముగ్ధుడై ఈ ఐదు గ్రామాలకు 'పంచ రత్నాలు'గా పేరుపెట్టారు. నాటి నుంచి వాడుకలో వీటిని పంచ రత్నాలుగా పిలుస్తున్నారు. నేడు వంశధార జలాశయం నిర్మాణం కారణంగా ఈ 'పంచ రత్నాలు' కనుమరుగయ్యాయి.

పునరావాసం ఏర్పాటు చేసిన మండలం, గ్రామాలు (ఈ సంఖ్యలో స్వల్ప మార్పులు చోటుచేసుకోవచ్చు)

మండలం	గ్రామం	కుటుంబాలు
ఎల్ఎన్‌పేట	మోదుగువలస	443
ఎల్ఎన్‌పేట	తాయమాంబపురం	502
ఆమదాలవలస	గాజుల కొల్లివలస	300
ఆమదాలవలస	జొన్నవలస	150
ఎల్ఎన్‌పేట	శ్యామలాపురం సమీపంలో	225
ఎల్ఎన్‌పేట	మోదుగువలస సమీపంలో	35
సీతంపేట	పులిపుట్టి	140
కొత్తూరు	మెట్టూరు	470
కొత్తూరు	గూనబద్ర	420
హిరమండలం	సుభలయ ఆర్‌ఆర్ కాలనీ	550
హిరమండలం	ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో	145
ఎల్ఎన్‌పేట	జగన్నాథపురం	410

◆ మరికొంతమంది నిర్వాసితులు జిల్లాలోని వివిధ చోట్ల ఇల్లు నిర్మించుకుంటున్నారు.

మండలాల్లో మార్పు

ఒక్కసారిగా ఎల్ఎన్‌పేట, కొత్తూరు మండలాల్లో నిర్వాసితులు అధికశాతం నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో ఈమండలాల్లో జనాభా, వ్యాపార పరంగా ఒక్కసారిగా మార్పు కనిపిస్తోంది. కొత్తూరు మండలంలో మెట్టూరు, గూనబద్ర, ఎల్ఎన్‌పేట మండలంలో ఎల్ఎన్‌పేట శ్యామలాపురం గ్రామాల సమీపంలో స్పష్టంగా ఈమార్పు కనిపిస్తోంది. ఇక్కడ వ్యాపారాలు బాగా పుంజుకున్నాయి. ఇదే సమయంలో హిరమండలం మండలం నుంచి ప్రధానమైన ఆరు పంచాయతీల ప్రజలు ఇతర చోట్లకు తరలి వెళ్లడంతో హిరమండలంలో జనాభా తగ్గింది. వ్యాపార పరంగా మందగించింది.

'డి'నోటిఫికేషన్ ఆమోదానికి పంపాం :

వంశధార నిర్వాసిత గ్రామాలు గెజిట్ నుంచి 'డి'నోటిఫికేషన్ కోసం (రద్దుకోసం) జిల్లా కలెక్టర్ ఆమోదానికి పంపించాం. కలెక్టర్ ఆమోదం అయితే తప్ప పూర్తి వివరాలు వెల్లడించలేం. డినోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయితే అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగ్రామాల నోటిఫికేషన్ లేదా పంచాయతీల ఏర్పాటు ఏర్పాటు చేయడం వంటి ప్రక్రియను చేపట్టగలం. ఇది ప్రభుత్వ నిర్ణయంపై ఆధార పడి ఉంటుంది.

- కోటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి, శ్రీకాకుళం.

మార్పులు ఇవీ..

◆ హిరమండలం మండలంలో ఇంతవరకు 23పంచాయతీ 6 పంచాయతీలు పూర్తిగా కనమరుగుకానున్నాయి. నిర్వాసితులు ఇతర మండలాలకు తరలి వెళ్లడంతో హిరమండలంలో పలు పలు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో 17 మండలాలతో జిల్లాలోనే చిన్నమండలంగా గుర్తింపు పొందనుంది.

◆ కొత్తూరు మండలం 33పంచాయతీలతో ఉండగా, 6 పంచాయతీలు కనుమరుగు అయినప్పటికీ ఈమండలంలో ఆర్‌ఆర్ కాలనీలు, జనాభా వచ్చిచేరడంతో పెద్ద మండలంగా మారనుంది.

◆ ఎల్ఎన్‌పేట(లక్ష్మీనర్సుపేట) మండలం 19పంచాయతీలతో అత్యంత చిన్న మండలంగా దస్త్రాల్లో నమోదై ఉంది. ఈ మండలంలో ఒక గ్రామం కనుమరుగైనా నిర్వాసితులకు అదే మండలంలో పునరావాస కాలనీలు ఏర్పాటు చేశారు. దీంతో జనాభా, ఓటర్లు ఇదే మండలంలో దాదాపు సర్దుబాటు జరిగినట్లయింది. చిన్నమండలం హోదా కోల్పోనుంది.

హిరమండలం మండలంలో కనుమరుగైన పంచాయతీలు, గ్రామాల వివరాలు

గ్రామ పంచాయతీ	గ్రామం	జనాభా (2011సం)	ఇళ్లు	కుటుంబాలు	ఓటర్లు
చిన్నకొల్లివలస	చిన్నకొల్లివలస	949	312	476	573
గార్లపాడు	గార్లపాడు	1660	502	647	704
గార్లపాడు	భీమవరం	208	49	53	106
దుగ్గుపురం	దుగ్గుపురం	1354	401	421	872
దుగ్గుపురం	చిన్నసంకిలి	585	186	212	413
దుగ్గుపురం	గదబపేట	268	87	88	176
పెద్దసంకిలి	పెద్దసంకిలి	998	299	339	732
పెద్దసంకిలి	బర్రిపేట	490	154	170	403
తులగాం	తులగాం	2166	623	832	1696
పాడలి	పాడలి	3874	1167	1236	2576
పాడలి	సోలిపి	114	38	42	26
హిరమండలం	హిరమండలం	2603	1790	157	1471
హిరమండలం	కోరాడ	2230	927	520	1560

ఒదిగిన వెదురందం..

● ఆకట్టుకునే రూపాల్లో వస్తువుల తయారీ ● గిరిజన మహిళలకు ఉపాధి అవకాశం



తుది మెరుగులు దిద్దుతున్న మహిళలు

న్యూస్‌టుడే, సీతంపేట

సీతంపేట మన్యంలోని అటవీ ప్రాంతంలో విస్తారంగా లభ్యమయ్యే వెదురుతో అనేక రకాల వస్తువుల తయారు చేస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు గిరిజన మహిళలు. గ్రామంలోనే వీటిని తయారు చేస్తూ అమ్మకాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. సీతంపేట మండలం మేకవ గ్రామానికి చెందిన 25 మంది గిరిజన మహిళలు. టేకు, గుగ్గిలం, ఇతర విలువైన కలపతో తయారు చేసే వస్తువుల మాదిరిగానే వెదురు(వెదురు కర్ర)తో వివిధ రకాల వస్తువులు తయారు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. ఈ వస్తువులను కొనేందుకు జిల్లావాసులు ఆసక్తి చూపుతున్నారు. దీనిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఉద్దేశం : గిరిజన మహిళలు ఆదాయం పొందే మార్గం చూపడం
సహకారం : నాబార్డు
ఏ సంఘం : ఆర్ట్సు స్వచ్ఛంద సంస్థ
ఏ పథకం కింద : గ్రామీణ ప్రాంతాల్లో ఔత్సాహిక మహిళా అభివృద్ధి కార్యక్రమం
ఎంతమందికి : 25 మందికి..
ఎందులో శిక్షణ ఇచ్చారు : వెదురుతో వివిధ రకాల వస్తువుల తయారీపై
ఏ రకాలు : వెదురుతో సోఫాసెట్లు, కుర్చీలు, ఫ్లవర్‌వాజ్, టీపాయ్‌లు, టీట్రేస్‌లు, కుర్చీలు, ఇతరత్రా వస్తువులు.
ఎక్కడ : సీతంపేట మండలం మేకవలో



వెదురుతో తయారు చేసిన ఫ్లవర్‌వాజ్‌లు

అన్ని విధాలా సహకారం అందజేస్తున్నాం: వెదురుతో వివిధ రకాల వస్తువుల తయారీకి సంబంధించి అన్ని విధాలా గిరిజన మహిళలకు సహకారం అందజేస్తున్నాం. మార్కెటింగ్ సౌకర్యం 'మాతోట' రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఐటీడీఏ పీవో శివశంకర్ మార్కెటింగ్‌పై సహకారం అందజేస్తామన్నారు. పర్యాటక ప్రాంతాల వద్ద ఇవి ఉంచి అమ్మకాలు చేస్తున్నారు. విశాఖపట్టణంలో జరిగిన సరసు మేళాలో సైతం అమ్మకాలు చేపట్టాం. నాబార్డు సహకారంతో ఇది సాధ్యమైంది.

- ఎన్.సన్యాసిరావు, డైరెక్టరు, ఆర్ట్సు సంస్థ, బి.శంకరరావు, సమన్వయకర్త, ఆర్ట్సు సంస్థ



వస్తువులను పరిశీలిస్తున్న నాబార్డు ఏజీఎం ఎం.డీ.వాసుదేవన్ (దాచిన చిత్రం)

ఏవిధంగా కావాలంటే.. :



ఇంతకు ముందు కూలీ పనులకు వెళ్లి ఖాళీ సమయంలో కేవలం ఫ్లవర్ వాజ్ వంటివి మాత్రమే చేసే వాళ్లం. మాకు వివిధ రకాల వస్తువులను తయారు చేసేలా శిక్షణ ఇచ్చారు. దీంతో మేము వివిధ రకాలను తయారు చేయగలుగుతున్నాం. అదపు ఆదాయం తెచ్చుకోగలుగుతున్నాం. పర్యావరణానికి ఎలాంటి హాని తలపెట్టకుండా ఎండిపోయే సమయంలో ఉన్న వెదురు చెట్లను నరికి వాటిని వివిధ రకాలుగా ముక్కలు చేసి పుచ్చిపోకుండా ఉండేందుకు గమాక్షన్ వేసి ఉడకబెట్టి ఏవిధంగా కావాలంటే ఆవిధంగా ముక్కలుగా, బద్దలుగా ఎలా కావాలంటే అలా తయారు చేస్తాం. దీంతో అదనంగా ఆదాయం లభిస్తోంది.

- సవర శశిరేఖ, సవర చామంతి

బలపడిన బంధం



ఆంధ్ర-ఒడిశాలను అనుసంధానం చేసేందుకు మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణం నేటికి పూర్తయింది. దశాబ్ద కాలం క్రితం ఒడిశా ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు జరగక తీవ్ర జాప్యం నెలకొంది. ఇటీవల ఆ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేసింది. వంతెన నిర్మాణం శతశాతం పూర్తయింది. 2018 సంవత్సరం జనవరి మాసంలో ప్రారంభించేందుకు అధికారులు తగు చర్యలు చేపడుతున్నారు. ఈ వంతెన వినియోగానికి వచ్చినట్లయితే ఇరుప్రాంతాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది.

-న్యూస్‌టుడే, పాతపట్నం

సేవకు మేము సైతం...

న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

● వృద్ధాప్యంలోనూ నిస్వార్థసేవలు
● యువతకు స్ఫూర్తి


సేవకు వయస్సుతో పనిలేదంటున్నారు వీరు. నిస్వార్థం సేవలు అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వృద్ధాప్యంలోనూ తమకుతోచిన సేవలందిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

పింఛనర్లకు అండగా..



పాలకొండలోని ఆంజనేయనగర్‌కు చెందిన **కేవీ రమణమూర్తి** ఉపాధ్యాయుడుగా 2006లో పదవీ విరమణ చెందారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా సేవలందించిన ఈయన పదవీవిరమణ అనంతరం తోటిపింఛనుదారులకు సేవలందించడం ప్రారంభించారు. ఈయన సేవలను గుర్తించిన విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమించారు. పింఛనుదారులు మృతి చెందితే ఆ కుటుంబానికి ప్రభుత్వపరంగా రావాల్సిన సాయం సకాలంలో అందేలా ఈయన కృషిచేస్తున్నారు. ఉపఖజానా కార్యాలయ సిబ్బందికి పింఛనుదార్లుకు సంధానకర్తగా వ్యవహరిస్తూ వారిబాగోగులు కోసం తన వంతుసాయం చేస్తున్నారు. పింఛనుదారులకు జీవితకాల ధ్రువపత్రాలు అందించడం, ప్రభత్వ పరంగా అందుతున్న రాయితీలు సకాలంలో అందేలా చొరవచూపుతున్నారు. పింఛనుదారులకు న్యాయం జరిగేలా గత పదేళ్లుగా కృషిచేస్తున్నారు.

బోధనలతో మంచిని పెంచుతూ..



పాలకొండ పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన **జద్దు జగ్గారావు** తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి ఆరేళ్ల కిందట పదవీవిరమణ చేశారు. సమాజరుగ్మతలకు వ్యతిరేకంగా తన రచనలు, బోధనలతో ముందుకుసాగుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజూ సాయంత్రం సమయాల్లో మంచివిషయాలు, భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, గీతాసారం తదితర అంశాలను బోధిస్తూ ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా తనవంతు పాటుపడుతున్నారు. మంచి విషయాలు బోధిస్తూ నైతిక, మానవతా విలువులు బోధిస్తున్నారు. ప్రస్తుతం ఎన్‌కేరాజపురంలో ప్రతిరోజూ ప్రవచాలు అందిస్తున్నారు. తన రచనలద్వారా యువతలో మార్పుకోసం కృషిచేస్తున్నారు. సిరినోముపూదండతోపాటు పలు పుస్తకాలు రచించారు.



అన్నార్తులకు అండగా..

ఎంఎంనగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని **తెన్నేటి పార్వతి** నిరాశ్రయులకు అండగా ఉంటున్నారు. పాలకొండలో నిర్వహిస్తున్న సంచార నిత్యన్నదానపథకం, రోగులసహాయకులు ఉచితభోజనం అందించేందుకు రూ.లక్ష విరాళం నిర్వహకులకు కొద్దిరోజులు కిందట అందించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు వీలుగా 250 కంచాలను ఈ ఏడాది పంపిణీ చేశారు. తనకు తోచిన సేవలందిస్తున్నారు.

సేవల్లో తరిస్తూ..

కోమటిపేటకు చెందిన విశ్రాంత ఇంజినీరింగ్‌శాఖ ఉద్యోగి శిల్లా **ఆంజనేయగుప్త** సేవల్లో తరిస్తున్నారు. పట్టణంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న సంస్థలకు విరాళాలు అందించడంతో పాటు తన స్నేహితులు, బంధువులతోనూ సేవలు చేయిస్తున్నారు. కోటదుర్గ ఆలయానికి భక్తులు సౌకర్యం కోసం ఇటీవలే 20గాలిపంకాలు బహుకరించారు. సత్యసాయి సేవాసమితికి రూ.లక్ష విరాళంగా అందించారు. తన స్నేహితుని సాయంతో పాలకొండ కోటదుర్గ ఆలయానికి కళ్యాణమండపం నిర్మించారు.



ఖైదీల్లో పరివర్తనకోసం



నీలమ్మకాలనీకి చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి **ఎన్‌వీ రమణ** ఖైదీల్లో పరివర్తనకోసం మూడేళ్లుగా కృషిచేస్తున్నారు. ప్రతి నెలా రెండో శనివారం పాలకొండ ఉపకారాగారంలో దివ్యజ్ఞానబోధ సభలు పేరిట నైతిక, మానవతా విలువలు నేర్పిస్తున్నారు. కుటుంబానికి దూరంగా కారాగార శిక్షతో కుటుంబాలకు, వ్యక్తిగతంగా కలిగే నష్టాలను వివరిస్తున్నారు. దీంతోపాటు విద్యార్థుల్లో మానవీయ విలువలు పెంపొందించేందుకు విద్యాసదస్సులు నిర్వహిస్తున్నారు. కుటుంబ విలువలు మహిళలు పాత్ర అంశంపై గ్రామీణ ప్రాంతాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు.

వెంకటేశ్వరలో జాతీయ సదస్సు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి-17న రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ సైన్స్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మంట్-2018 పేరిట (ఐసీఆర్ఐఎస్ఈఎం 2018) జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రధానాచార్యులు డా. ఎం.గోవిందరాజు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సుకు సంబంధించిన పుస్తకాన్ని విభాగాధిపతులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ సదస్సులో పాల్గొనాల్సిన వారు తమ పరిశోధన పత్రాలు ఫిబ్రవరి-2లోగా కళాశాల వెబ్‌సైట్‌కు పంపించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డా. బి.శ్రీనివాసరావు, కో-కన్వీనర్ బి.గంగాధర్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధానాచార్యుడు ఎం.గోవిందరాజు, విభాగాధిపతులు

జాతీయ రహదారిపై ఇసుక ట్రాక్టర్ బోల్తా

కుశాలపురం(ఎచ్చెర్ల), న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం కుశాలపురం సమీపంలోని బైపర్స్ కూడలి వద్ద సోమవారం మధ్యాహ్నం చిలకపాలెం వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తాపడింది. స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం ప్రమాదం జరిగిన సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ గెంతేయడంతో సురక్షితంగా బయట పడినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై అడ్డంగా ట్రాక్టర్ బోల్తా పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఎచ్చెర్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించారు.



జాతీయ రహదారిపై బోల్తాపడిన ఇసుక ట్రాక్టర్

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: మంగళవారం గోంగూర దానంచేస్తే ఆర్థిక విషయాలు అనుకూలిస్తాయా?, వాస్తుదోషాలు ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: అమ్మో! ఒకటో తారీఖు (శ్రీకాంత్, రాశి).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'బెండకాయ కొబ్బరి వేపుడు', మీ చేతి వంట 'మలైకోఫ్తా కర్రీ', 'ఆలూకార్న్ సూప్', జస్ట్ ఎ మినిట్ 'గుమ్మడి పరోటా' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ: (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు(విధి–2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జబర్దస్త్ (రిపీట్), 06-00: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్) 06-30: తేనె మనసులు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: సైసై సయ్యారే: దర్శకేంద్రుడి పాటల సందడి..., 10-30: 'ఫన్' డే (స్పెషల్ కామెడీ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 అమ్మాయి క్యూటు అబ్బాయి నాటు రిపీట్
01:15 పిట్టగోడ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 పోవే..పోరా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం రిపీట్
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి 07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 అల్లరే అల్లరి
08:30 సరదాగా కాసేపు
09:00 పటాస్
09:30 మహాతల్లి
09:45 ఫ్రూట్స్
10:00 నా షో నా ఇష్టం రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస: సాఫ్ట్ స్కిల్స్ ఎవరికి ఎంత అవసరం - పార్ట్ 1 (ఉ.6:00, రా.11:30)
★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా.10:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
★ అమృతం: వండర్ వెజిటబుల్స్ (ఉ.8:00, మ.12:30, రా.8:00)
★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.1:00, రా.8:30)
★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్: మహిళల్లో గుండె జబ్బులా? ఎలా అడ్డుకుందాం? (ఉ.9:30)
★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్: స్త్రీలలో మూత్రనాళ సమస్యలా? ఎటువంటి జాగ్రత్తలు అవసరం? (మ.2:00, రా.7:00)
★ అంతరంగం: కొత్త సంవత్సరంలో తీసుకునే సంకల్పాలను..మీరు మధ్యలోనే వదిలేయకుండా ఉండాలంటే ఏంచేయాలి? (ఉ.10:00)
★ అంతరంగం: మీ పిల్లల ఫోన్లను చెక్ చేయాలనుకుంటున్నారా? మరి వారిని ఎలా మ్యానేజ్ చేయాలి? (మ.2:30, రా.9:30)
★ ఆరోగ్యమస్తు: 1. నూతన సంవత్సరం - ఆరోగ్య సంకల్పాలు, 2. పూర్ణాయుషుకు పోషకాహారం, 3. లాలాజలం..ఓ దివ్యౌషధం (ఉ.10:30)
★ ఆరోగ్యమస్తు: 1. రక్తంలో పూడికలు ఏర్పడడానికి కారణాలు, 2. మనం హోటళ్ళో తినగా మిగిలిన ఆహారాన్ని ప్యాక్ చేసి ఇంటికి తీసుకొని వెళ్లడం మంచిదేనా?, 3. శరీరంలో వాపుల వెనుక దాగున్న వాస్తవాలు (మ.3:00, రా.9:00)
★ డా. ఈటీవీ: గుండె ఆరోగ్యం (ఉ.11:00)
★ డా. ఈటీవీ: చర్మ సంరక్షణ (ఉ.11:15)
★ డా. ఈటీవీ: మధుమేహం (మ.3:30, రా.7:30)
★ డా. ఈటీవీ: ENT (మ.3:45, రా.7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలీషాపింగ్ 7-00: సన్‌రైజ్ సినిమా: దొంగపెళ్ళి (శోభన్‌బాబు, విజయశాంతి) 10-00: మార్నింగ్ షో: బాలమిత్రుల కథ (మాస్టర్‌దేవానంద్, మాస్టర్ సురేంద్ర) మధ్యాహ్నం: 1-00: మాటీనీ: ఘటోత్కచుడు (ఆలీ, రోజా) సాయంత్రం: 4-00: ఈవినింగ్‌షో : హృదయం (మురళి, హీరా) రాత్రి: 7-00: ఫస్ట్‌షో: బాగ్దాద్ గజదొంగ (ఎన్టీఆర్, జయలలిత) 10-00: మై ఛాయిస్ (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కోడిగుడ్డు శెనగల ఛాట్ & గోధుమగడ్డి బాదం పాన్‌కేక్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (పంజాబీ క్యూసైన్) - చోలే ఆలూ ఔర్ గోబీ కా టిక్కీ ఛాట్, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - కర్డ్ అండ్ ఓట్స్ సెరియల్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - స్పినాచ్ ఎగ్ పొంగణాలు, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - మటన్ దమ్ బిర్యానీ & కార్జం వేపుడు, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - అవలక్కి ఎర్రియప్ప, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - అరవి కబాబ్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - గుమ్మడికాయ హల్వా, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - గుమ్మడికాయ గింజలతో సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పారిస్ క్యూసైన్) - పార్క్ ఫ్రైడ్ చికెన్ & చికెన్ కర్రీ విత్ పొటాటోస్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) ఇండియన్ కేక్, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ - స్టఫ్డ్ ఎగ్ విత్ చికెన్ & చాక్లెట్ ఎక్లైర్స్, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - పెరుగు మర్చీ మటన్ బిర్యానీ & కాజు మటన్ ఫ్రై, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - ఉల్లి పునుగులు, మ.2.45, రా.10.30: ఎట్‌హోమ్ - మ్యాంగో స్క్వాష్ & క్లాసీ రంచ్ డ్రెస్సింగ్, మ.3.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 °, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 °, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థ యాత్ర: శ్రీ లక్ష్మీనారాయణ దేవాలయం, మధురవాడ, విశాఖపట్నం, 5-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 °, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 °, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 °, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థ యాత్ర: శ్రీ గోదారంగనాథస్వామి ఆలయం, ఎదులాబాద్, మేడ్చల్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360 °, 09-00 ఈటీవీ న్యూస్, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 02-01-2018

ఉదయం: 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (అష్టాదళ పాదపద్మారాధన సేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - ఆంజనేయ స్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారికల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ +ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:**12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్రనామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 భగవద్గీత - బాలవికాసం, 03-30 అద్భుత ఆలయాలు - మురుడేశ్వర్ (రిపీట్), **సాయంత్రం:** 04-00 శ్రీదేవీ కటాక్షం, 04-30 విలువలు - విజ్ఞానం, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు - భక్తిచైతన్యం, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - గుహ్య అగస్త్యేశ్వరస్వామి ఆలయం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాలకృష్ణమాచార్యులు.

భక్తి TV **ఉదయం:** 06-00 శ్రీ లలితాసహస్రం, 06-30 హనుమాన్ చాలీసా, 07-00 అర్చన, 07-30 శ్రీ కనకధారస్తోత్రం 08-00 పుణ్యక్షేత్రం, 08-30 ఆరుద్ర దర్శనం (లైవ్), 11-00 ధర్మ సందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీ కనకధారస్తోత్రం, 05-30 హనుమాన్ చాలీసా, 06-00 శ్రీ లలితాసహస్రం, **రాత్రి:** 07-00 భక్తి విశేషాలు, 07-30 అమృత కలశం 08-00 ఆరుద్ర దర్శన మహోత్సవం 08-30 శ్రీమద్భగవద్గీత, 09-00 దుర్గాసప్తశతి 09-30 మహా భారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తి విశేషాలు, 11-00 గోదామృతం.

జీ తెలుగు **ఉదయం:** 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: చందమామ, 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 రారండోయ్ వేడుకచేద్దాం, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 కళ్యాణ వైభోగం రిపీట్, **సాయంత్రం:** 04-00 డ్రామా జూనియర్స్ రిపీట్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్).

మా **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: పోకిరి, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కోడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లి కూతురు, 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: లీడర్, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్ర బంధం, 10-00 నీలికలువలు, 10-30 స్టార్ మా పరివార్ అవార్డ్స్.

జెమిని **ఉదయం:** 06-00 టెలీషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: నేనున్నాను, 11-30 నాగిని 2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 షిరిడి సాయి, 03-00 సినిమా: శంభో శివ శంభో, 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 జూలకటక, 10-30 సినిమా: మిస్టర్ ఫర్‌ఫెక్ట్.

HBO ఉదయం: 06-00 స్నిచ్, 07-54 రాక్ ఆఫ్ ఏజెస్, 09-53 టీనేజ్ మ్యుటెంట్ నింజా టర్‌టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-52 300: రైజ్ ఆఫ్ యాన్ ఎంపైర్, మధ్యాహ్నం: 01-24 బ్యాట్‌మ్యాన్ వర్సెస్ సూపర్‌మ్యాన్: డాన్ ఆఫ్ జస్టిస్.

మాగాణి మినుము, పెసరలో యాజమాన్యం



వరి మాగాణుల్లో అపరాలను సార్వా, దాళ్వా వరి తర్వాత సాగు చేస్తారు. మాగాణి మినుము, పెసర సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కృష్ణా జిల్లా ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జె.పద్మావతి, డాక్టర్ కె.నాగేంద్రరావు, డాక్టర్ కె.శ్రీనివాసరావు, బి.హరిరామ్‌కుమార్ తెలిపారు. వరి మాగాణుల్లో పెసర కంటే మినుమును ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో వరి కోయడానికి రెండు, మూడు రోజుల ముందు మినుము లేదా పెసర విత్తనాన్ని వెదజల్లుతారు. ఈ విధంగా చల్లిన విత్తనం మొలిచి వరికోసిన తర్వాత భూమిలో మిగిలిన తేమను, భూసారాన్ని వినియోగించుకుని పంట చేతికి వస్తుంది. ఈ సాగులో దుక్కి తయారీ, ఎరువులు వేయడం, కలుపు తీయడం ఉండదు. వరి మాగాణులకు అనువైన మినుము, పెసర రకాలను ఎంచుకోవడం, ఈ పంటలకు సూచించిన సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చు.

విత్తన మోతాదు: మాగాణి మినుముల్లో ఎకరానికి 16-18 కిలోలు, పెసరలో ఎకరానికి 18-12 కిలోల విత్తనాన్ని ఒక చదరపు మీటరుకు సుమారుగా 35 మొక్కలు ఉండే విధంగా వెదజల్లితే మంచి దిగుబడులు సాధించవచ్చు. కనుక సిఫార్సుకు మించకుండా విత్తనం చల్లడం, పొలంలో సరైన సాంద్రతలో మొక్కలు ఉండటట్లు చల్లితే మంచి ఫలితాలు వస్తాయి. వరి పొలంలో నుంచి నీరు తీసిన తర్వాత రోజు విత్తనం చల్లి, వరి పైరును రెండురోజుల తర్వాత కోయాలి. అలాగాక విత్తనం చల్లినవెంటనే వరికోసిన పొలాల్లో పంట చివరిదశలో బెట్టకు గురయ్యే ప్రమాదం ఉంది.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి మాంకోజబ్ లేదా కార్బండజమ్ 2.5 గ్రాములు + ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ. పైరు విత్తడానికి 24 నుంచి 48 గంటల ముందు పట్టించి ఆరబెట్టి విత్తడం ద్వారా.. తొలి దశల్లో వచ్చే తెగుళ్లు, రసంపీల్చే పురుగులను నివారించవచ్చు. రైజోబియం కల్చరు 20 గ్రాములు కిలో విత్తనానికి విత్తే గంట ముందు పట్టించి విత్తితే.. నత్రజని స్థిరీకరణ బాగా జరిగి, అధిక దిగుబడి వస్తుంది.

–న్యూస్‌టుడే, ఘంటసాల (కృష్ణాజిల్లా)

కొబ్బరిలో కొమ్ముపురుగు

అన్ని ప్రాంతాల్లో కొబ్బరిని కొమ్ము పురుగు ఆశించి నష్టం చేస్తోంది. దీని నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారి కోటేశ్వరరావు తెలిపారు.

లక్షణాలు: విప్పారిన ముదురు ఆకులపై 'వి' ఆకారంలో కత్తిరించినట్లు ఉంటుంది.

★ కొబ్బరి చెట్టు మొవ్వులో పురుగు తొలిచిన రంధ్రం, పురుగు వదిలిన పిప్పి ఉంటుంది. కొమ్ము పురుగు కొబ్బరి లేత మొవ్వు భాగాన్ని తొలవటం వల్ల విప్పారని లేత ఆకులు నష్టపోయి కొబ్బరి దిగుబడులు తగ్గుతాయి. చిన్న మొక్కలను ఈ పురుగు ఆశిస్తే మొవ్వు కుళ్లిపోయే ప్రమాదం ఉంది.

★ ఈ పురుగు ప్రత్యక్షంగా చేసే నష్టమే కాకుండా ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకు తిరుగుతున్నప్పుడు మొవ్వుకుళ్లు తెగులును కూడా వ్యాప్తి చేస్తుంది. కొమ్ము పురుగు నష్టపరిచిన మొవ్వు భాగం నుంచి వచ్చే పులిసిన వాసనకు కొబ్బరిలో కాండం తొలిచే ఎర్రముక్కు పురుగు ఆశించే ప్రమాదం ఉంది.



కొమ్ముపురుగు



పురుగు కత్తిరించిన ఆకులు

నివారణ చర్యలు: కొబ్బరి తోటల్లో పడిపోయినచెట్లను తొలగించి మొదలు (భూమిలో ఉన్నభాగం) తవ్వించి తగులబెట్టాలి. తోటలో పశువుల ఎరువు కుప్పలు ఉంచరాదు. దగ్గరలోని పశువుల ఎరువుల కుప్పలను మూడు నెలలకొకసారి తిరగేస్తూ కార్బరిల్(50 శాతం) 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. మూడు నెలలకొకసారి కొబ్బరి చెట్ల మొవ్వు ఆకుల వలయాలలో వేపపిండి లేదా వేప గింజల పొడి 100 గ్రాములను 150 గ్రాముల ఇసుకలో కలిపి వేయాలి.

– న్యూస్‌టుడే, చిత్తూరు (వ్యవసాయం)

పది రోజుల పండగ

- నేటి నుంచి 'జన్మభూమి- మా ఊరు'
- పింఛన్లు, రేషన్‌కార్డులు పంపిణీ
- ఉపకార వేతనాలు అందజేత
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం



న్యూస్‌టుడే- రాజాం

పది రోజుల పాటు అధికారులు పల్లెబాట పట్టనున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయనున్నారు. భారీగా మంజూరైన సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు అందించేందుకు నిర్ణయించారు. ఈమేరకు మంజూరు ఉత్తర్వులు, రేషన్‌పత్రాలను అక్కడికక్కడే అందిస్తారు.

జనవరి రెండో తేదీ నుంచి 11వ తేదీ వరకు పది రోజుల పాటు 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నాలుగు విడతలుగా జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నుంచి అయిదో విడత జన్మభూమి కార్యక్రమం మొదలవుతోంది. రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో ఈ జన్మభూమిని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. సంక్షేమ పథకాలు మంజూరుపై ప్రధానంగా దృష్టి సారించింది. పార్టీలకు అతీతంగా అర్హులను ఎంపిక చేయాలని నిర్దేశించింది. ఈమేరకు వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టింది. జిల్లాలో వేలాది మందికి మేలు జరగనుంది. గతంలో వచ్చిన రెవెన్యూ, ఇతర సమస్యలపైనా ప్రధానంగా దృష్టి సారించారు. జనం మధ్యకు అధికారులు వెళ్లనున్న నేపథ్యంలో ఇప్పటి వరకు వచ్చిన అర్జీలు, పరిష్కారం, పెండింగ్‌లో ఉంటే దానికి గల కారణాలు, ఇతరత్రా వాటిని పరిశీలించి నివేదికలు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు, పక్కాగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించారు. వీరికి పింఛన్లు మంజూరు చేసే అధికారం ప్రభుత్వం కట్టబెట్టింది. అర్హులుంటే వీరు నేరుగా 100 మంది వరకు పింఛన్లు మంజూరు చేసే వీలుంటుంది.

పంపిణీ చేయనున్నవి

రేషన్‌కార్డులు	: 5,314
పింఛన్లు	: 20వేలు
ఉపకారవేతనాలు	: 1,03,666

పథకాలు ఇలా

పింఛన్లు: జిల్లాకు 20వేలు పింఛన్లు మంజూరయ్యాయి. ఒక్కో నియోజకవర్గానికి 2వేలు చొప్పున కేటాయించారు. నియోజకవర్గంలోని మండలాల్లో జనాభా ఆధారంగా 2వేల పింఛన్లను సర్దుబాటు చేశారు. గత జన్మభూమి నుంచి వివిధ మార్గాల ఇంతవరకు 25,234 దరఖాస్తులు రాగా, ప్రభుత్వం 20వేలు పింఛన్లు మంజూరు చేసింది. వీటికి సంబంధించిన మంజూరు ఉత్తర్వులను లబ్ధిదారులకు జన్మభూమి -మా ఊరు' కార్యక్రమంలో అందిస్తారు. ఫిబ్రవరి నుంచి వీరికి పింఛను నగదును పంపిణీ చేస్తారు. ఇప్పటికే జిల్లాలో 2.86 లక్షల మందికి పింఛన్లు అందుతున్నాయి. తాజా పింఛన్లతో ఈసంఖ్య 3.06 లక్షలకు చేరనుందని డీఆర్‌డీఏ పీడీ జి.కిషోర్‌కుమార్ తెలిపారు.

రేషన్‌కార్డులు: ఇప్పటికే 8.07 లక్షల వరకు బడుగులకు రేషన్‌కార్డులున్నాయి. ఇంకా వేల మందికి రేషన్‌కార్డులు లేవని అర్జీలు వచ్చాయి. ఇందులో 5,314 కుటుంబాలకు కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేశారు. వీటికి సంబంధించిన కార్డులు వచ్చాయి. వీటిని 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమంలో అందిస్తారు. ఇంకా ఎవరికైనా రేషన్‌కార్డులు లేకపోతే వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా 'జన్మభూమి'లో అధికారులకు అర్జీలు ఇవ్వొచ్చని జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు తెలిపారు.

ఉపకారవేతనాలు: జిల్లాలో చంద్రన్న బీమా పథకంలో ఉన్న లబ్ధిదారుల పిల్లలకు ఉపకార వేతనాలు అందిస్తున్నారు. 1,03,666 మందికి వీటిని అందించనున్నారు. మొత్తం రూ.12.43 కోట్లు మేర విద్యార్థుల ఖాతాలకు జమ చేయనున్నారు. వీటికి సంబంధించిన మంజూరు ఉత్తర్వులను ఆయా గ్రామ సభల్లో 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమంలో అందిస్తారు. అదే రోజు విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తారు. 2014 జూన్ రెండో తేదీ నుంచి ఇప్పటి వరకు చంద్రన్న బీమా, ఇతర బీమా పథకాలు ద్వారా పరిష్కరించిన క్లైమ్‌ల వివరాలను ఆయా సభలో చదివి వినిపించాల్సిన బాధ్యత బీమా మిత్రలదే. ప్రతీ మండలానికి ఇద్దరు చొప్పున బీమా మిత్రలు ఉన్నారు. లబ్ధిదారులకు వ్యక్తిగతంగా మంజూరు ఉత్తర్వులు అందిస్తారు. 9,10, ఇంటర్, ఐటీఐ విద్యార్థులకు నెలకు రూ.100 చొప్పున ఏడాదికి రూ.1,200 నిధులు మంజూరయ్యాయి. విద్యార్థులకు ఖాతాలు ఉంటే వారి ఖాతాలకే జమవుతాయి. లేదంటే తల్లిదండ్రుల ఖాతాకు జమ చేస్తామని జిల్లా అధికారి సీతారామయ్య స్పష్టం చేశారు.

'జన్మభూమి'లో భాగంగా నేటి నుంచి క్రీడాపోటీలు

పాత శ్రీకాకుళం, న్యూస్‌టుడే: నేటి (మంగళవారం) నుంచి ఈ నెల 11 వరకు జరుగనున్న జన్మభూమి కార్యక్రమంలో భాగంగా 16 ఏళ్లలోపు బాలికలకు, 14 ఏళ్లు పైబడిన బాలురకు వివిధ క్రీడాపోటీలను పంచాయతీ స్థాయి నుంచి మండలస్థాయి వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్థాయిలో ఈ నెల 2న వాలీబాల్, 3న కబడ్డీ, 4న ఖోఖో, 5న అథ్లెటిక్స్ పోటీలు, మండలస్థాయిలో 6న కబడ్డీ, 7న 5 కిలోమీటర్ల పరుగు, 8న ఖోఖో, 9న వాలీబాల్, 10న అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని ఆయన వివరించారు. బాలికలకు ప్రత్యేకంగా తొక్కుడుబిళ్ల, క్యారెమ్స్ తదితర పోటీలు, బాలురకు కర్రాబిళ్ల, గోళీలు, కోతి కొమ్మచ్చి తదితర పోటీలు గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పోటీలకు అవసరమైన డీఎస్‌ఏ శిక్షకులను, కోచ్‌ను, ఎన్‌వైకే వలంటీర్లను నియమించామన్నారు. జిల్లాస్థాయి అయిదు కిలోమీటర్ల పరుగును రాజాంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

'జన్మభూమి'ని విజయవంతం చేయాలి

భైరిలో లాంఛనంగా ప్రారంభం

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జన్మభూమిలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో వస్తున్న అర్జీలను ఆన్‌లైన్‌లో ఫొటోలతో పాటు అప్‌లోడ్ చేయాలన్నారు. పంచాయతీ స్థాయిలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు నోడల్ అధికారులుగా, మండలస్థాయిలో ప్రత్యేకాధికారులు నోడల్ అధికారులుగా కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. అర్హులకు రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. శ్రీకాకుళం మండలంలోని భైరి గ్రామంలో జన్మభూమి కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలోని ఇచ్ఛాపురానికి వస్తున్నందున పర్యటనను విజయవంతం చేయాలని తెలిపారు. అన్ని శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శనశాలలో ఉంచాలన్నారు. సమీక్షలో సంయుక్త కలెక్టర్-2 పి.రజనీకాంతరావు, సీపీవో వి.వి.ఎల్.ప్రసన్న, జిల్లా పరిషత్ సీఈఓ బి.నగేష్, డీఆర్‌డీఏ పీడీ జి.సి.కిశోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కె.ధనంజయరెడ్డి

సీఎం సమీక్ష: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలెక్టర్లు, జిల్లా అధికారులతో జన్మభూమి కార్యక్రమంపై సోమవారం సమీక్షించారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు టెలీ సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

కర్రపెండలంకు గిట్టుబాటు ధరేది?

- ధర తగ్గించి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- గిరిజనులకు తీవ్రంగా నష్టం

సీతంపేట, న్యూస్‌టుడే : సీతంపేట మన్యంతో పాటు జిల్లాలోని గిరిజన ప్రాంతంలో ఈసీజన్‌లో విస్తారంగా పండే కర్రపెండలం ధర గతేడాదితో పోల్చితే అమాంతం తగ్గడంతో గిరిజనులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెండలం పంట ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఉంటుంది. కొండలపైన, పోడు వ్యవసాయంలోనూ, ఇళ్ల పెరడుల్లో గిరిజనులు పండించే పెండలంకు గిట్టుబాటు ధర లభించని పరిస్థితి. గిరిజనులకు పండే పెండలంను కావిళ్లలో సమీపంలోని వారపు సంతలకు తీసుకువచ్చి విక్రయాలు జరుపుతున్నారు. మన్యంలో వేలాది టన్నుల పెండలం లభ్యమవుతుంది. మార్కెట్‌లో దీనికి మంచి గిరాకీ ఉన్నప్పటికి గిరిజనులకు మాత్రం ఆఫలితం దక్కడం లేదు. పిండి పదార్థం ఎక్కువగా లభించే పెండలంపై ఎంతో మోజు చూపుతారు. కానీ ధర లేకే గిరిజనులు దిగాలు చెందుతున్నారు.

రూ.500కు పడిపోయిన కావిడి ధర: పెండలం కావిడి ధర రూ.400 నుంచి 500కు పడిపోయిందని గిరిజనులు తెలిపారు. సుమారు 40 నుంచి 50 కిలోల బరువు వచ్చే కావిడి ధర అంత తగ్గిపోతే ఎలా గిట్టుబాటు అవుతుందని ప్రశ్నిస్తున్నారు. కొండల నుంచి తవ్వి మోసుకుని సంతలకు తీసుకువచ్చిన కూలి సైతం లభించడం లేదని వాపోతున్నారు. ఇదే కావిడి గతేడాది రూ.800 నుంచి రూ.1000 వరకు విక్రయాలు జరిపామని అంటున్నారు. సంతలకు వచ్చే వ్యాపారులు సిండికేట్ అవ్వడం, ఇతరత్రా కారణాలతో గిట్టుబాటు ధర అన్నది లభించడం లేదని అంటున్నారు.

నిల్వ ఉండే పంట అయినా..: పెండలం ఎన్ని రోజులైనా నిల్వ ఉంచుకోవచ్చు. అందువల్ల దీనిని కారుచౌకగా సంతలో వ్యాపారులు కొనుగోలు చేసుకుని నిల్వలు చేసుకుని అధిక ధరకు అమ్మి సొమ్ములు చేసుకునే పనిలో పడ్డారని పలువురు గిరిజనులు ఆరోపిస్తున్నారు. కొండల్లో పూర్తి సేంద్రీయ పద్ధతిలో పండడం, ఆరోగ్యపరంగా మంచి ఆహారం కావడంతో పల్లపు ప్రాంతీయులు వీటిపై ఎక్కువగా మోజు చూపుతారు. పండగ రోజుల్లో మంచి ధర పలుకుతుంది. అయినా గిరిజనులకు మాత్రం మేలు కలగడం లేదు. కటక్, భువనేశ్వర్, బరంపురం, పర్లాఖెముండి, తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఇతర ప్రాంతాల వారు వచ్చి వారికి అవసరమైన మేర కొనుగోలు చేసుకుంటారు.



సీతంపేట సంతలో అమ్మకానికి తెచ్చిన పెండలం

చిత్తశుద్ధి లేకనే..: వేలాది టన్నులు ప్రతి ఏటా మన్యంలో పెండలం పండుతుంది. దీన్ని ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేసి వ్యాపారం చేయడం కాని, చిప్స్ మాదిరిగా తయారు చేసి విక్రయాలు జరిపే వీలున్నా ఆదిశగా ఎలాంటి చర్యలు లేకపోవడంతో గిరిజనులకు నష్టం కలుగుతుంది. మంచి పోషక విలువలు, పిండి పదార్థం కలిగిన పెండలంతో ఎలాంటి ఆహార పదార్థాలైనా తయారు చేయడానికి వీలు కలుగుతుంది. ఆదిశగా చర్యలు లేకపోవడంతో దళారీల పరం అవుతుందని గిరిజనులు వాపోతున్నారు. ఇతర పంటల గూటికే పెండలం ధర సైతం చేరిందని వాపోతున్నారు. గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

కనీసం గిట్టుబాటు కావడం లేదు:



పెండలం ధర కనీసం గిట్టుబాటు కావడం లేదు. 50 కిలోల పెండలం కావిడి రూ.500కే అమ్ముడుపోతుంది. దీంతో కొండల నుంచి సేకరించి తీసుకువచ్చిన కూలి సైతం లభించడం లేదు. ఇదే కావిడి గతేడాది రూ.1000 వరకు ధర పలికింది. ధర విషయంలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. పంటంతా దళారీల పరమవుతుంది. గిరిజనోత్పత్తులన్నింటికి గిట్టుబాటు ధర లభించడం లేదు. గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు చేపట్టాలి.

- సవర మల్లేష్, జగతిపల్లి, సీతంపేట మండలం

మలేరియా జ్వరంతో చిన్నారి మృతి

బుడార్శింగి (మందస), న్యూస్‌టుడే : మందస మండలం బుడార్శింగి పంచాయతీ నర్శింగపురానికి చెందిన గిరిజన చిన్నారి నిమ్మల దీపిక (6) మలేరియా జ్వరంతో బాధపడుతూ సోమవారం మృతిచెందింది. దీపిక తల్లిదండ్రులు సుభాశ్, మౌని తెలిపిన వివరాలు ప్రకారం.. దీపికకు నాలుగు రోజుల కిందట జ్వరం వచ్చింది. ఇంటి వద్దే సంచి వైద్యం చేయించగా తగ్గలేదు. సోమవారం జ్వరం తీవ్రమై అపస్మారకంలోకి వెళ్లడంతో శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. ఆసుపత్రిలో చేరిన కొద్ది సేపటికే మృతి చెందింది. దీపికకు మలేరియా జ్వరంతో పాటు కామెర్లు ఉన్నాయని వైద్యులు పేర్కొన్నట్లు తెలిపారు.

అనుసంధాన రహదారిని బాగు చేస్తే బస్సులు నడుపుతాం

పెద్దతామరాపల్లి (నందిగాం), న్యూస్‌టుడే: నందిగాం మండలం పెద్దతామరాపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న వంతెన కింద భాగంలోని అనుసంధాన రహదారిని బాగుచేస్తే బస్సులు నడుపుతామని టెక్కలి ఆర్టీసీ డిపో మేనేజరు ఈశ్వరరావు పేర్కొన్నారు. 'ఈనాడు'లో సోమవారం 'బస్సు ఎక్కాలంటే మెట్లు ఎక్కాల్సిందే' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈమేరకు సోమవారం ఆయన అనుసంధాన రహదారిని సోమవారం పరిశీలించారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచన మేరకు దిమ్మిడిజోలకు అదనపు బస్సును మంగళవారం నుంచి నడుపుతామన్నారు. ఆయనవెంట ట్రాఫిక్ సూపర్‌వైజరు నాగయ్య తదితరులున్నారు.



రహదారిని పరిశీలిస్తున్న టెక్కలి ఆర్టీసీ డిపో మేనేజరు ఈశ్వరరావు

మమ్మల్నే కదిలిస్తారా?

(మొదటిపేజీ తరువాయి) ఖాళీగా ఉన్నాయి. వాటినీ ఖాళీగా ఉంచాలనే ఒత్తిళ్లు వస్తున్నాయి. ఈయన స్థానంలో జి.సిగడాం నుంచి సీనియర్ అసిస్టెంటును నియమించారు. ఆయన్ను రానీయరు... ఈయన కదలరు. ఇందుకు జిల్లాలోని ఓ ముఖ్య ప్రజాప్రతినిధి ఆంతరంగికులు చక్రం తిప్పుతున్నట్లు సమాచారం.

శ్రీకాకుళంలో ఆర్ఐదే పెత్తనం..

ఈయన శ్రీకాకుళం ప్రాంతంలోనాలుగేళ్లుగా ఒక చోట ఆర్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. మూడు సార్లు బదిలీ అయినా నిలుపుదల చేయించుకున్నారు. కలెక్టరేట్‌కు బదిలీ చేసి.. ఆస్థానంలో కలెక్టరేట్‌లో పని చేస్తున్న వారిని పదోన్నతిపై అక్కడ నియమించారు. ససేమిరా.. ఆర్ఐగానే కొనసాగించండి.. ఆర్ఐ తప్ప మరో పోస్టే చేయనంటూ భీష్మించినట్లు సమాచారం. ఆ అధికారికి స్థానిక ప్రజా ప్రతినిధి ఒకరు సంపూర్ణ సహకారాలు అందిస్తున్నట్లు సమాచారం.

డీటీ ఇస్తే మాత్రం వెళ్తానా

మందసలో సీనియర్ అసిస్టెంటుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఒకరికి డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి కల్పించి.. టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో ఎల్.ఆర్.. డీటీగా నియమించారు. ఈయన వల్ల డీటీ పదోన్నతుల దస్త్రమే ఆగిపోయింది. పైగా ఆ స్థానం ఆయన కౌన్సెలింగులో కోరుకున్నదే కావడం విశేషం. అక్కడికి వెళ్లకుండా.. తిరిగి మందస మండలంలోనే డీటీ కేడరులో సూపరింటెండెంట్‌గా నియమించాలని వత్తిడి పెంచారు. అక్కడే ఇమ్మంటూ ఓ ప్రజాప్రతినిధి కూడా కలెక్టరేట్‌పై వత్తిడి పెంచారు. ఇవన్నీ కౌన్సెలింగు ద్వారా నియమించిన పోస్టింగులు. రాని స్థానం.. కాని స్థానాకి వత్తిడి పెంచుతున్నారంటే.. మరొకరి అవకాశాన్ని దెబ్బతీస్తున్నట్లే. ఒకరిని మార్పు చేయాలంటే.. మిగిలిన అందరి స్థానాలు కూడా మారిపోతాయి. మళ్లీ వీళ్లందరినీ కౌన్సెలింగుకు అయినా పిలవాలి. లేదంటే.. నచ్చిన వారికి నచ్చిన స్థానంలో నియమించాలి. ఏం చేయాలో తెలియని అయోమయంలో పడిన కలెక్టరేట్ ప్రస్తుతానికి అస్త్ర సన్యాసం చేసేసి చేతులు దులుపేసుకుంటోంది.

ఆ ముగ్గురు కౌన్సెలింగ్ చేసినా...

జిల్లాలో దీర్ఘకాలంగా పదోన్నతులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో చర్యలు చేపట్టి వివిధ స్థాయిల్లో 72 మందికి పదోన్నతులు ఇటీవల కల్పించారు. కలెక్టర్, జేసీ, ఏజేసీ... ఈ ముగ్గురూ కౌన్సెలింగు చేసి మరీ... ఆఫీసు సబార్డినేట్ నుంచి డిప్యూటీ తహసీల్దార్ వరకు నియామకాలు చేశారు. మొత్తం ఖాళీలను వివరించి ఒక్కొక్కరి నుంచి ప్రాధాన్యం క్రమంలో మూడు ఐచ్ఛికాలు తీసుకున్నారు. సీనియార్టీ ప్రకారం పోస్టింగులు ఇచ్చారు. సరికొత్త కౌన్సెలింగు విధానంగా కూడా ప్రశంసలు అందుకుంది. జూనియర్ అసిస్టెంటు కేడరులో 45 రోజుల పాటు సర్వే శిక్షణ పూర్తి చేసిన వారికి తరవాత ఆర్ఐ లేదా సీనియర్ అసిస్టెంటులుగా పదోన్నతికి అవకాశం ఉంటుంది. తర్వాత వారికి డీటీలుగా పదోన్నతి లభిస్తుంది. డీటీ కావాలంటే కచ్చితంగా ఆర్.ఐగా రెండేళ్లు పని చేయాల్సి ఉంటుంది. జిల్లాలో రాజకీయ నేతలతో వత్తిళ్లు చేయించుకుంటూ పలువురు ఆర్ఐలుగా పని చేస్తూ ఆ పోస్టును విడిచిపెట్టడం లేదు. ఈ కోవలోనిదే శ్రీకాకుళం ఆర్ఐ పోస్టు కూడా. ఇది ఎగ్జిక్యూటివ్ పోస్టు. తహసీల్దార్ తరవాత ఆర్ఐలే కీలకం. ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (ఇన్‌కం సర్టిఫికెట్స్) విచారణ, మ్యుటేషన్, భూ సంబంధ విచారణలకు వీరే కీలకం. వీఆర్వోలపైనా వీరిదే దాదాపు పెత్తనం. ఆ అధికార హోదాను విడిచిపెట్టేందుకు అంగీకరించని కొందరు ఆర్ఐలు నిర్ణీత వ్యవధి గడిచినా.. అదే హోదాలో ఉండేందుకే ఆశపడుతున్నారన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

ఒకట్రెండు రోజుల్లో పదోన్నతులు..

జనవరి ఒకటో తేదీ హడావుడి, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో దస్త్రాన్ని పరిశీలించేందుకు సమయం చిక్కలేదు. దానిని ఆసాంతం పరిశీలించి వెంటనే పదోన్నతులు పొందిన వారికి ఇచ్చిన పోస్టింగులను విడుదల చేస్తాం. మంగళ, బుధవారాల్లో ఖరారు చేస్తాం..

- పి.రజనీకాంతరావు, జేసీ-2, శ్రీకాకుళం

ఊహించలేదు... ప్రాణాలు నిలవలేదు!!



సంఘటనా స్థలంలో గుమిగూడిన ప్రజలు



సంఘటనపై వివరాలను సేకరిస్తున్న పోలీసులు

(మొదటిపేజీ తరువాయి) డ్రైవర్, ముగ్గురు కూలీలు పనిచేస్తున్నారు. ఎక్కడ నూర్పులయినా వీరు వెళ్తారు. అలానే సోమవారం లొద్దపుట్టి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో వరి నూర్పు చేశారు. అక్కడ పని ముగిసిన తరువాత 500 మీటర్ల దూరంలో మరో రైతు పొలంలో నూర్పిడికి యంత్రంతో సహా బయలుదేరారు. ఆ యంత్రాన్ని ట్రాక్టరుతో తీసుకువెళుతుండగా... ఆ సమయంలో ఆ ముగ్గురూ యంత్రంపై ఓ వైపు కూర్చొన్నారు. రెండు పొలం గట్లను సునాయాసంగా దాటిన యంత్రం... మూడో గట్టు వద్ద అదుపుతప్పింది. బరువైన యంత్రంతో ఉన్న ట్రాక్టరును చోదకుడు నియంత్రించలేకపోయారు. దీంతో ఆ భారీ యంత్రం ఒక్కసారిగా పక్కకు కుప్పకూలిపోయింది. తప్పించుకునే అవకాశం లేని పరిస్థితిలో ఆ ముగ్గురు కూలీలు యంత్రం కింద నలిగిపోయారు. సమీపంలోని వారు వెంటనే వచ్చి యంత్రాన్ని పైకి ఎత్తే ప్రయత్నం చేసినా... జరగాల్సిన నష్టం అప్పటికే జరిగిపోయింది. ఆ ముగ్గురూ ప్రాణాలొదిలారు.

తీరని విషాదంలో గ్రామం

● మృతులు ముగ్గురూ పేదింటివారే. లొద్దపుట్టి మధ్యవీధికి చెందిన దక్కత జానికమ్మకు వివాహం కాలేదు. తండ్రి, ఐదుగురు సోదరులు,

ముగ్గురు అక్కలు ఉన్నారు. జానికమ్మ ఆఖరి అమ్మాయి. కుటుంబ పోషణ కోసం నిరంతరం శ్రమిస్తుంది. అలానే నూర్పుయంత్రంలో పనికి కుదిరింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు యంత్రంతో పాటు పనిచేసి వచ్చిన ఆదాయంతో కుటుంబానికి ఆసరాగా నిలుస్తుంది. ● కొచ్చెర్ల తులసమ్మ గ్రామంలోని అంబుగాంవీధి వాసి. ఈమె వితంతువు. భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. కుమార్తెకు వివాహం చేసింది. కుమారుడ్ని చదివించుకుంటూ వస్తోంది. కూలి పనులతో వచ్చిన ఆదాయమే వీరికి ఆధారం.

● తిప్పన కూర్మమ్మ లొద్దపుట్టి కాళికావీధిలో నివాసం ఉంటోంది. ఈమె వితంతువు. ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఒక అమ్మాయికి మాత్రం వివాహం చేసింది. మిగిలిన వారు చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు.

అప్పటిదాకా సంతోషం

వీరు ఎక్కడ నూర్పులకు వెళ్లినా అక్కడ రైతులు, రైతు కూలీలతో స్నేహంగా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తూ, యంత్రం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ పని చేసేలా కృషి చేస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. అలానే సోమవారం మధ్యాహ్నం భోజన విరామం తరువాత మరో పొలంలో నూర్పులకు సిద్ధమయ్యారు. నిత్యం వెళ్లే మార్గాలే కావడంతో యంత్రంపై కూర్చుని మాట్లాడుకుంటున్న వేళ... విధి వక్రించింది. మూడు కుటుంబాలలో వేదన మిగిల్చింది. ఈ ఘటనతో గ్రామస్థులు విషాదంలో మునిగారు. ఇచ్ఛాపురం సీఐ ఎం.అవతారం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రూరల్ ఏఎస్ఐ కుమార్ కేసు నమోదు చేశారు. శవపంచనామా నిమిత్తం మృత దేహాలను ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్యే, డీఎస్పీ సందర్శన: సంఘటన తెలిసిన తరువాత ఇచ్ఛాపురం శాసన సభ్యులు డా. బెందాళం అశోక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో మృతదేహాలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. శవ పంచనామా చేసి మంగళవారం ఉదయం 9గంటలలోగా మృతదేహాలను బంధువులకు అప్పగించాలని వైద్యులకు సూచించారు.

ఒప్పంద వైద్యులకు శుభవార్త!

● మూడేళ్ల సర్వీసు ఉన్నవారి క్రమబద్ధీకరణ ● జిల్లాలో 30 మందికి అవకాశం?

న్యూస్‌టుడే- గుజరాతీపేట (శ్రీకాకుళం) జిల్లాలోని ఒప్పంద వైద్యులకు నూతన సంవత్సరంలో తీపి కబురు అందనుంది. ప్రభుత్వ పరిధిలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తూ మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 80 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, 18 సామాజిక ఆసుపత్రులు, టెక్కలి, పాలకొండల్లో ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నాయి. వీటిల్లో 100 మంది వరకు ఒప్పంద ప్రాతిపదికన వైద్యులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు వివిధ కేడర్లలో రూ. 38 వేల నుంచి రూ.52 వేల జీతం అందుతోంది. తమను క్రమబద్ధీకరించాలని నాలుగేళ్లుగా ప్రభుత్వానికి వీరు వినతిపత్రాలు అందజేస్తున్నారు. ప్రభుత్వం సైతం రెండేళ్లుగా క్రమబద్ధీకరిస్తామని చెబుతున్నప్పటికీ కార్యాచరణలోకి రాకపోవడంతో నిరాశలో ఉన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం ఒప్పంద వైద్యులను క్రమబద్ధీకరించాలని నిర్ణయించడంతో వారు ఎదురు చూపులు ఫలించినట్లయ్యాయి. అయితే మూడేళ్ల సర్వీసు ఉన్న వారిని మాత్రమే క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు సుమారు 30 మంది ఉన్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం కోరిన మీదట వీరికి సంబంధించిన సమాచారాన్ని వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్



కార్యాలయానికి పంపించినట్లు తెలిసింది. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సనపల తిరుపతిరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. ఒప్పంద వైద్యుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించిన విషయం వాస్తవమేనని.. ఇంకా మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉందన్నారు. మార్గదర్శకాల్లో ప్రభుత్వం సూచించిన మేరకు అర్హులైన వారి జాబితా తయారు చేసి పంపిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఎస్టీల్లో చేర్చాలని మత్స్యకారుల దీక్షలు

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మత్స్యకార ఎస్టీ సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నాటికి ఈ దీక్షలు 22వ రోజుకు చేరాయి. గార మండలం మొగదాలపాడు గ్రామానికి చెందిన సీహెచ్.చిన్న, పి.సూరిబాబు, జి.వి.స్వామి, పి.సూర్యనారాయణ తదితరులు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో సాధన సమితి ప్రతినిధులు చింతపల్లి సూర్యనారాయణ, మోస ఫల్గుణరాజు, కె.నర్సింగరావు, కె.అప్పారావు, ఎం.నర్సింహమూర్తి, ఎం.ఎర్రన్న, పాపయ్య, సంతబొమ్మాళికి చెందిన మహిళా మత్స్యకారులు పాల్గొన్నారు.

భూ కుంభకోణంలో మరో కోణం

(మొదటిపేజీ తరువాయి) భూముల వ్యవహారంలో పక్కా పథకం ప్రకారం వ్యవహరించారనే అనుమానాలకు బలం చేకూరుతోంది. ఒకే సర్వే నెంబర్‌తో డి.పట్టా ఉండి ఉంటే.. అదే సర్వే నెంబర్‌కు రిజిస్ట్రేషన్ ఎలా జరిగింది అనేది యంత్రాంగానికే తెలియాల్సి ఉంది. రెవెన్యూ యంత్రాంగం తయారు చేసిన డి.పట్టా భూములకు సంబంధించిన నిషిద్ధ జాబితాలో పలువురు రాజకీయ నాయకులు, ఉద్యోగులు, బడా వ్యాపారుల పేర్లు గల్లంతయ్యాయి. ఈ భూములకు సంబంధించి 148ఏ నుంచి 218/4 సర్వే నెంబర్లు వరకు 312 పేర్లతో నిషిద్ధ జాబితా తయారు చేశారు. ఈ జాబితాలో ఫవర్ గ్రిడ్‌కు కేటాయించిన భూములు సైతం ఉన్నాయి. 148ఏ నుంచి 218 వరకు గల సర్వే నెంబర్లలో పలువురు బడా బాబులు సైతం ఉన్నారు. అలాంటి వారిలో కొందరి పేర్లు నిషిద్ధ జాబితాలో లేవు. ఉన్న వాటిలో పలువురి పేర్లు రెండు, మూడు సార్లు నమోదయ్యాయి.

అక్రమ మార్గాన రిజిస్ట్రేషన్లు

భూముల కంప్యూటరీకరణ జరగక ముందు రెవెన్యూ కార్యదర్శి చేతి రాతతో ఇచ్చే అడంగల్ ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. కంప్యూటరీకణ జరిగాక నిషిద్ధ జాబితాలో లేని సర్వే నంబర్లకు సంబంధించిన 1బి, కంప్యూటర్ అడంగల్ చూసి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. పలాస మండలం రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో డి.పట్టా భూములకు సంబంధించి గతంలో చేతి రాత అడంగల్‌తో కొంత వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. తాజాగా నిషిద్ధ జాబితాలో పలువురి పేర్లు లేకుండా చేయటంతో మరికొంత వరకు భూముల రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. ఇలా అక్రమార్గాన భూములు చేతులు మారుతున్నాయి.

అంతుపట్టని అంశాలెన్నో..

ఇక్కడి భూములకు సంబంధించి గత నెల చివరి వారంలో 'ఈనాడు'లో వరుస కథనాలు రావడంతో... ఇప్పటికే ప్రాథమిక నివేదికను ఉన్నత యంత్రాంగానికి రెవెన్యూ యంత్రాంగం పంపించింది. అలాగే నిఘా వర్గాలు సైతం నివేదికను రాష్ట్రప్రభుత్వానికి పంపించేందుకు సిద్ధం చేస్తోంది. మరో వైపు ఈ భూములకు సంబంధించిన అంతుపట్టని అంశాలెన్నో వెలుగులోకి వస్తున్నాయి. ఒకే కుటుంబంలోని 18 ఏళ్ల కుమార్తెకు, ఆమె తల్లికి కూడా డి.పట్టాలున్నాయి. మరో కుటుంబంలో మూడు ఎకరాలకు పైబడి ఇద్దరు తోడికోడళ్లకు పట్టాలున్నాయి. ఇంకో కుటుంబంలో తండ్రికి, కుమారునికి ఆరు ఎకరాలకు సంబంధించి డీ పట్టాలున్నాయి. ఇలాంటి అంతుపట్టని అంశాలకు సంబంధించిన జాబితాను చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. అసైన్‌మెంట్ చట్టం ప్రకారం పేద కుటుంబంలో ఒకరికి మాత్రమే ప్రభుత్వం డి.పట్టా మంజూరు చేస్తుంది. రామకృష్ణాపురం విషయంలో మాత్రం ఇష్టారాజ్యంగా చేసినట్లు అవగతమవుతోంది. గతంలో పని చేసిన తహసీల్దార్లు డి.పట్టాలు మంజూరు చేసినట్లు ఎక్కువ మంది రెవెన్యూ యంత్రాంగానికి దస్త్రాలు చూపుతున్నారు. అందుకు సంబంధించిన నిజ పత్రాలు మాత్రం ఒక్కటి కూడా ఇంతవరకు రెవెన్యూ యంత్రాంగానికి అందకపోవడం గమనార్హం. ఉన్నత యంత్రాంగం సమగ్ర దర్యాప్తు నిర్వహించి ప్రభుత్వ భూములను కాపాడి, అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఆమదాలవలస

కూరగాయల ధరలు

రైతుబజారులో నిన్నటి కూరగాయల ధరలు(కిలో రూపాయలలో) టమాటా 16, వంకాయలు 35, బెండకాయలు 38, పచ్చి మిర్చి 38, కాకరకాయలు 30, వంకాయలు 40, క్యాబేజీ 28, క్యారెట్ 35, దొండకాయలు 30, బంగాళదుంపలు 14, గోల్కొండ చిక్కుడు 30, గోరు చిక్కుడు 33, ఉల్లిపాయలు 40, అల్లం 50, వెల్లుల్లి 60, ఆనపకాయ 16, అరటికాయలు(జత) 15, ములగకాయ(ఒకటి) 5. బియ్యం ధరలు: స్వర్ణ మసూరి 24, సాంబమసూరి 36, సన్నరకం బియ్యం 30.

-న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



కొంచాడలో చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ దృశ్యం

ప్రభుత్వ కార్యాలయాల్లో కానరాని మరుగుదొడ్లు

ఉద్యోగులు, సందర్శకులకు తప్పని అవస్థలు



మరుగుదొడ్ల సదుపాయం లేని పొందూరు మండల పరిషత్తు కార్యాలయం

సరుబుజ్జిలి,న్యూస్‌టుడే: 'ఇంట గెలిచి రచ్చ గెలవమని' సామెత. ఇతరులకు చెప్పే ముందు మనం ఆచరించి చూపాలన్నది దాని అర్థం. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా మార్చేందుకు మండల ప్రత్యేకాధికారులు, మండల అధికారులు అన్ని కోణాల్లో యుద్ధప్రాతిపదికన మరుగుదొడ్లను నిర్మించేందుకు కృషి చేస్తున్నారు. 2018 మార్చి నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో మరుగుదొడ్లను నిర్మించేందుకు యువజన సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, సర్పంచులను భాగస్వామ్యం చేస్తూ పరుగులు పెడుతున్నారు. మండల ప్రత్యేకాధికారులు మండల పరిషత్తు అధికారులు, మండల పరిషత్తు అధికారులు, పంచాయతీ, గ్రామ స్థాయి అధికారులను దత్తత తీసుకొని మరీ శ్రమిస్తున్నారు. ఇంత ప్రచారం చేస్తున్న ఆయా అధికారుల సొంత కార్యాలయాలు ఎలా ఉన్నాయని పరికిస్తే ఆశ్చర్యంగా ఉంది. నియోజకవర్గంలోని ముఖ్య కార్యాలయాల్లోనూ కనీసం మరుగుదొడ్లు లేవు. ఉన్నవి నిర్వహణ లేక కంపు కొడుతున్నాయి.

ఆమదాలవలస నియోజకవర్గంలో సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాలు ఉన్నాయి. వీటిలో 105 పంచాయతీలు ఉన్నాయి. అయితే మండలానికొక ప్రత్యేకాధికారి ఉండగా, ప్రతి పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. వీరందరూ కలిసి గ్రామాల్లో ప్రతి ఒక్క ఇంటి వద్ద మరుగుదొడ్లను నిర్మించడమే లక్ష్యంగా ఏర్పరచుకున్నారు. మండలాల్లో కొన్ని ముఖ్యమైన వాటిలో తహసీల్దార్, మండల పరిషత్తు, వెలుగు, ఉపాధిహామీ పథకం, వ్యవసాయ శాఖ కార్యాలయం, విద్యాశాఖ, గృహ నిర్మాణ శాఖ, విద్యుత్తు శాఖ కార్యాలయాలు కీలకమైనవి. ఆయా కార్యాలయాలకు నిత్యం ఏదో ఒక పని మీద ప్రజలు వస్తుంటారు. ప్రస్తుతం ఆయా కార్యాలయాల్లోని అధికారి గదిలో ప్రత్యేకంగా ఓ మరుగుదొడ్డి ఉంటుంది. అయితే సిబ్బంది, ఇక్కడకు వచ్చే ప్రజల పరిస్థితి అధికారులకు పట్టడం లేదు.

సరుబుజ్జిలిలో..

మండలంలో 21 పంచాయతీలు ఉన్నాయి. ప్రతి పంచాయతీలో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని ప్రత్యేకాధికారిని నియమించారు. గ్రామాల్లో ప్రచారాలు భాగస్వా వారు పనిచేస్తున్న ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల జాడ కనిపించకుండా పోయింది. మండల పరిషత్తు కార్యాలయంలో మోడల్ మరుగుదొడ్డిని నిర్మించారు. దాన్ని ఇప్పటివరకు వినియోగించే దాఖలాలు లేవు. దీంతో అది పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని నిరుపయోగంగా ఉంది. కార్యాలయం లోపల ఉన్న మరుగుదొడ్లు వినియోగానికి వీలుగా లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతూ వినియోగించుకుంటున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న మరుగుదొడ్లు ఒక్క అధికారులకే తప్ప ఇతరులు వినియోగించుకునేందుకు వీలు లేకుండా తలుపులకు తాళాలు వేసి ఉంటున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికే తప్ప వచ్చే రోగులకు మరుగుదొడ్లు వినియోగించడానికి అవకాశం లేదు. మండల విద్యాశాఖ, వ్యవసాయ కార్యాలయాలు, భవితా కేంద్రంలో మహిళా ఉద్యోగులు ఉన్నా మరుగుదొడ్ల సదుపాయం లేదు. వెలుగు కార్యాలయంలో అధికారులకు ఒకటి, కార్యాలయానికి వచ్చే మహిళలకు మరో రెండు మరుగుదొడ్లను నిర్మించారు. అయితే రెండు మరుగుదొడ్లు పూర్తిగా పాడవ్వడంతో వినియోగానికి వీలులేకుండా పోయి నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ఉన్న ఒక్క మరుగుదొడ్డిని వెలుగు, మండల పరిషత్తు, ఉపాధిహామీ పథకం, మండల విద్యాశాఖ, భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు వినియోగించుకుంటున్నారు.

పొందూరు మండలంలో...

మండలంలో 29 పంచాయతీలు ఉన్నాయి. ఇక్కడ గ్రంథాలయం, తహసీల్దార్ కార్యాలయం, వెలుగు, ఉపాధిహామీ పథకం, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, వ్యవసాయ శాఖ, పశు వైద్య కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ఆరుబయటకు వెళ్లి అవసరాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే మండల పరిషత్తు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రమే మరుగుదొడ్ల సదుపాయం కల్పించారు. వివిధ అవసరాలపై వచ్చే ప్రజలు వాటిని వినియోగించుకోవడానికి అవకాశం లేదు. మేజరు పంచాయతీ కార్యాలయం వద్ద మరుగుదొడ్డి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆమదాలవలస మండలంలో..


మండలంలో 28 పంచాయతీలు ఉన్నాయి. ఇక్కడ మండల పరిషత్తు, తహసీల్దార్, వెలుగు, వ్యవసాయశాఖ, గ్రంథాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిర్మించిన మరుగుదొడ్లు కేవలం అధికారులు మాత్రమే వినియోగించుకోవడానికి వీలుగా ఉన్నాయి. పశువైద్య కేంద్రంలో ఇద్దరు మహిళా ఉద్యోగులు ఉన్నా అక్కడ మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

బూర్జ మండలంలో..

మండలంలో 27 పంచాయతీలు ఉన్నాయి. ఇక్కడ గ్రంథాలయం, ఆయుర్వేద ఆసుపత్రి, పశువైద్య కేంద్రం, వ్యవసాయశాఖ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు ఉన్నా మరుగుదొడ్ల సదుపాయం లేదు. దీంతో ఆరుబయటకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. మండల రిసోర్సు కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్తు కార్యాలయాల్లో ఉన్న మరుగుదొడ్లు కేవలం అధికారుల వినియోగానికి మాత్రమే పరిమితమై ఉన్నాయి. గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులను ఈ విషయమై అడగగా మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బూర్జ మండలంలో మరుగుదొడ్లు లేని శాఖా గ్రంథాలయం



శిథిలావస్థకు చేరుకున్న సరుబుజ్జిలి వెలుగు కార్యాలయం వద్ద మరుగుదొడ్డి

చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ

పొందూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొంచాడ, బురిడికంచరాం గ్రామాల్లో చంద్రన్న సంక్రాంతి కానుకలను సోమవారం పంపిణీ చేశారు. కొంచాడలో 200 మందికి సంక్రాంతి చంద్రన్న కానుకలను సర్పంచి ముగడ తవిటినాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు సింహాద్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● బురిడికంచరాంలో 300 మందికి చంద్రన్న సంక్రాంతి కానుకలను సర్పంచి వండాన సత్యం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

భాజపా కార్యదర్శుల నియామకం

పొందూరు,న్యూస్‌టుడే: పొందూరు మండల భాజపా కార్యదర్శుల నియామకం జరిపినట్లు మండల పార్టీ అధ్యక్షుడు గురుగుబిల్లి తేజేశ్వరరావు పేర్కొన్నారు. దుమ్మిద రామచంద్రరావు, పొట్నూరు శ్రీనివాసరావు, ససపల నారాయణమూర్తిలను కార్యదర్శులుగా నియమించారు. మహిళా కార్యదర్శిగా పైడి సమలతను, ఉపాధ్యక్షులుగా కోల మొఖలింగం, జాయింటు కార్యదర్శిగా కోటిపాత్రుని శ్రీరామూర్తి, కోశాధికారిగా కాలెపు వెంకటరమణలను నియమించినట్లు అధ్యక్షులు తెలిపారు. ఆయనతో పాటు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు బలివాడ సత్యనారాయణ, జిల్లా కోకన్వీనర్ బండారు జయప్రతాప్ కుమార్, భాజపా సీనియర్ నాయకుడు పసుపురెడ్డి నాగేశ్వరరావులు ఉన్నారు.

జన్మభూమి కార్యక్రమాల్లో భాజపా నేతలు, కార్యకర్తలు పాల్గొనాలి

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలంలో ఈ నెల 2 నుంచి నిర్వహించనున్న జన్మభూమి గ్రామసభల్లో భాజపా నాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొనాలని మండల పార్టీ అధ్యక్షుడు గురుగుబెల్లి తేజేశ్వరరావు పేర్కొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు విధిగా వివరించాలని తెలిపారు. భాజపా సీనియర్ నాయకులు బలివాడ సత్యనారాయణ, బండారు జైప్రతాప్‌కుమార్, దుమ్మిద రామచంద్రరావు, పసుపురెడ్డి నాగేశ్వరరావు పొట్నూరు నాగేశ్వరరావు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

9న ధర్నాలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పొందూరు, న్యూస్‌టుడే: పింఛను సాధన సమితి ఆధ్వర్యంలో తాలూకా కేంద్రాల్లో ఈ నెల 9న చేపట్టనున్న ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ పొందూరు మండల శాఖ గౌరవ అధ్యక్షుడు కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం పొందూరు ఎంఆర్‌సీ కార్యాలయంలో యూటీఎఫ్ మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు, సహాయ కార్యదర్శి రమణమూర్తి, ఉపాధ్యక్షుడు గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.



నీరు లేని వంశధార కుడి ప్రధాన కాలువ

కుడి ప్రధాన కాలువకు నీటిని విడిచిపెట్టాలి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని వంశధార కుడి ప్రధాన కాలువకు నీటిని విడిచిపెట్టాలని మండలంలోని రబీ వరిని సాగు చేసే రైతులు కోరుతున్నారు. కాలువ ద్వారా సాగునీరు విడిచిపెట్టకపోతే వరి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని అంటున్నారు. చెరువుల్లో నిల్వ ఉన్న నీరు పంట పొలాలకు విడిచిపెట్టడంతో వాటి నీటి సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. వంశధార అధికారులు స్పందించి వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీటి చెరువులకు నీటిని విడిచిపెట్టాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

గ్యాస్ సమాచారం

ఆమదాలవలస పట్టణంలోని శ్రీవాని గ్యాస్ ఏజెన్సీ(హెచ్‌పీ గ్యాస్) ద్వారా డిసెంబరు 30, 31 తేదీల్లో బుకింగ్ చేసుకున్న హిరమండలం అర్బన్, సరుబుజ్జిలి మండలం, వంజంగి, వాకలవలస, దూసి, కలివరం, తొగరాం, కొత్తవలస, ఎన్పీవాడ, కొర్లకోట, ఆమదాలవలస పట్టణంలోని వినియోగదారులకు సోమవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. డిసెంబరు 31, జనవరి 1 తేదీల్లో బుకింగ్ చేసుకున్న ఎల్ఎన్‌పేట మండలం, అక్కులపేట, కొల్లివలస, బూర్జ, ఆమదాలవలస పట్టణంలోని వినియోగదారులకు మంగళవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామని ఏజెన్సీ ప్రతినిధి తెలిపారు. ఈ నెలలో సాధారణ గృహ వినియోగ గ్యాస్ సిలిండరు(14.2 కిలోలు) ధర రూ.758, వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండరు(19 కిలోలు) ధర రూ.1348 అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లను బుకింగ్ చేసుకునేందుకు 9666023456, 9493723456, 9493823456 నంబర్లకు, గ్యాస్ సిలిండర్ల లీకేజీ వంటి ఫిర్యాదుల కోసం 9032010566 నంబరుకు ఫోన్ చేయాలని ఏజెన్సీ ప్రతినిధి సూచించారు.

-న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఆమదాలవలస

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు

మంగళవారం వేకువ జామున 5 గంటల నుంచి స్వామి వారికి సుప్రభాత సేవ, తిరుప్పావై పారాయణం, గోదాదేవి తిరువీధి, భక్తుల గోత్ర నామాలతో పూజలు, 6 గంటలకు మంగళాశాసనం, 7.30 గంటలకు బాలభోగం, 8 గంటలకు సర్వదర్శనం, 9 గంటలకు విశేష హోమాలు, మధ్యాహ్నం 12 గంటలకు రాజభోగం, నిత్యదర్శనం, రాత్రి 9 గంటలకు లక్ష్మీనారాయణ స్వామి వారికి పవళింపు సేవ. -న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

తెరపై సినిమాలు

ఆమదాలవలస శ్రీదేవి: అదిరింది **పొందూరు** ఊర్వశి: డిటెక్టివ్ బాలాజీ: ఎంసీఏ -న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: ఈ నూతన సంవత్సరానికి సంబంధించి యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ప్రభుత్వ విప్ కూన రవికుమార్ తమ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సరుబుజ్జిలి ఎంఈవో డి.బాలరాజు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఫణిరాజు, పి.మురళీధర్‌రావు, నాయకులు పీవీ తేజేశ్వరరావు, సైలాడ రాజేష్‌బాబు, బి.జగదీశ్వరరావు, కొత్తకోట శ్రీహరిరావు, అమ్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



చైర్‌పర్సన్ తమ్మినేని గీత దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు, తదితరులు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస పట్టణంలోని తెదేపా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కూన రవికుమార్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా జేసీ-2 రజనీకాంతరావు, ఏఎస్పీ పనసారెడ్డి, పాలకొండ ఆర్డీవో గున్నయ్య, ఛైరపర్సన్ తమ్మినేని గీత, కౌన్సిలర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, తదితరులు అక్కడికి చేరుకొని విప్ రవికుమార్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెదేపా కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులతో సందడిగా మారింది.



తొగరాంలో ఎంపీపీ తమ్మినేని భారతికి శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా నాయకులు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఈ నూతన సంవత్సరంలో పురపాలక సంఘం అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత పేర్కొన్నారు. సోమవారం నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తన నివాసం వద్ద కేక్‌ను కత్తిరించి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, నాయకులు, పురపాలక అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు, అభిమానులు అక్కడకు చేరుకొని ఛైర్‌పర్సన్ గీత, విద్యాసాగర్ దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ బొడ్డేపల్లి రాముకు పురపాలక మేనేజరు కె.శ్రీనివాసరావు, సిబ్బంది, తదితరులు కేక్‌ను తినిపించారు. గతేడాది అభివృద్ధి బాగుందని, నూతన సంవత్సరంలో 'స్వచ్ఛ సర్వేక్షణ్'తో పాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సిబ్బంది అంతా మెరుగైన సేవలను అందించాలని కమిషనర్ కోరారు.

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండల, పట్టణ ప్రాంతాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సంవత్సరం అంతా బాగుండాలని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బంధువులకు, మిత్రులకు, వివిధ పార్టీల నాయకులు స్వీట్, బొకేలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని తొగరాం గ్రామంలో ఎంపీపీ తమ్మినేని భారతికి నాయకులు, కార్యకర్తలు కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కనుగులవలస గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు బొడ్డేపల్లి సరోజనమ్మకు వైకాపా నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. కనీస వేతన సంఘం అమలు రాష్ట్ర డైరెక్టర్ కోట గోవిందరావుకు అభిమానులు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఆమదాలవలస భాజపా కార్యాలయంలో భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాతిన గడ్డెయ్యకు భాజపా నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

బూర్జ, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం చిన్నారుల నుంచి పెద్దల వరకు ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షురాలు పీరుకట్ల విజయలక్ష్మి, ఎంపీపీ బి.సూర్యారావు, జడ్పీటీసీ సభ్యుడు ఎ.రామకృష్ణ, వైస్ ఎంపీపీ పీరుకట్ల ప్రభాకరరావులను వివిధ శాఖలకు చెందిన అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వాకర్స్ క్లబ్‌లో ...

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మేజరు పంచాయతీ వాకర్స్ క్లబ్, వర్తకుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఆదివారం అర్ధరాత్రి ఘనంగా జరుపుకున్నారు. క్లబ్ సభ్యులు డాక్టర్ ఎం.సునీల్‌కుమార్ కేక్‌ను కత్తిరించారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు శుభాకాంక్షలుతెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కె.సాయికుమార్, డాక్టర్ విజయ భాస్కర్, జి.వెంకటరావు, పూండ్రు రామకృష్ణ, జవహర్ గుప్తా, వాసు. తదితరులు పాల్గొన్నారు.

బూర్జ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం విద్యార్థులంతా నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాలకొండ ఉప విద్యాశాఖాధికారి, స్థానిక విద్యాశాఖాధికారి ఐ.వెంకటరావును మండల పరిధిలోని ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలతో అభినందించారు. లక్కుపురం గ్రామానికి చెందిన యువత ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉప్పు, రంగులు, పూలతో భారతదేశ చిత్రపటాన్ని వేశారు.

'నవోదయ'లో ...

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను విద్యార్థులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు కరచాలనం చేసుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలుపుకున్నారు. అనంతరం విద్యాలయం ఆవరణలో చెట్ల కింద వనభోజనంలా అందరూ ఓ చోట కూర్చొని భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ పి.రంగారావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలసలో విప్ రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు, తదితరులు



పొందూరు: కేక్‌ను కట్ చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్



కమిషనర్ రాముకు కేక్‌ను తినిపిస్తున్న పురపాలక అధికారులు

పేదలను ఆదుకోవాలి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి పేదవాడిని ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని లొద్దలపేట సూర్యా స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి పూజారి రమణమూర్తి అన్నారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా ఆమదాలవలస లెప్రసీ కాలనీలో ఉన్న వారికి దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న పూజారి రమణమూర్తి

నేటి నుంచి జన్మభూమి కార్యక్రమాలు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలో ఈ నెల 2 నుంచి 11వ తేదీ వరకు 21 పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.పావని తెలిపారు. 2న ఉదయం 10.30 గంటలకు గోనెపాడు, ఇస్కలపాలెం, మధ్యాహ్నం 2 గంటలకు బప్పడాం, మూలసవలాపురంలలో, 3న ఉదయం 10.30 గంటలకు కొండవలస, షళంత్రిలలో, మధ్యాహ్నం 2 గంటలకు రొట్టవలస, తెలికిపెంటలలో, 4న ఉదయం 10.30 గంటలకు పాలవలస, మతలబుపేటలలో జన్మభూమి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలానే 5న ఉదయం 10.30 గంటలకు రావివలస, కొత్తకోటలలో, 6న ఉదయం 10.30 గంటలకు చిన్నకాకితాపల్లి, డకరవలసలలో, 8న ఉదయం 10.30 గంటలకు చిగురువలస, విజయరాంపురంలలో, 9న ఉదయం 10.30 గంటలకు సింధువాడ, పురుషోత్తపురంలలో జన్మభూమి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా 10న ఉదయ 10.30 గంటలకు పెద్దపాలెం, యరగాంలలో, 11న ఉదయం 10.30 గంటలకు సరుబుజ్జిలి పంచాయతీ గ్రామాలలో ఎంపీడీవో, తహసీల్దార్ టీమ్‌ల ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

పొందూరు, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం నుంచి జన్మభూమి గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మలకాం, తండ్యాం, లయిదాం గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, విధిగా పాల్గొనాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం నుంచి జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబీబ్ తెలిపారు. మండలంలోని పంచాయతీల్లో ఈ నెల 10వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని విజయవతం చేయాలని మండల ప్రత్యేకాధికారి పంచాది రాధ అన్నారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తొగరాం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తొగరాం వైద్యాధికారి భవ్య అన్నారు. సోమవారం తొగరాం ఆరోగ్య కేంద్రంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొనాలని తెలిపారు. మంగళవారం మండలంలోని కె.మునగవలస, సైలాడ, తొగరాం, చీమలవలస గ్రామాల్లో నిర్వహించే జన్మభూమి కార్యక్రమానికి వైద్యులు, సిబ్బంది హాజరుకావాలని తెలిపారు.

పాఠశాలకు నగదు విరాళం

తోలాపి(పొందూరు గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని తోలాపి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు రౌతు గోవిందరావు పాఠశాల అభివృద్ధికి రూ.10 వేల నగదును సోమవారం ప్రధానోపాధ్యాయురాలు కె.భూలక్ష్మికి విరాళంగా అందజేశారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ఈ విరాళాలను వినియోగించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు ఈ సందర్భంగా తెలిపారు. నగదు విరాళాన్ని అందజేసిన ఉపాధ్యాయుడిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల

జన్మభూమి-మాఊరును విజయవంతం చేయాలి

జి.సిగడాం, న్యూస్‌టుడే: మండలంలో వాంగ్రంగి, ఆనందపురం, దవళపేట, సంతవురిటి గ్రామాల్లో మంగళవారం నిర్వహించే జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో శంకరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని చెప్పారు.

నేడు మంత్రి రాక

లావేరు, న్యూస్‌టుడే: మంత్రి కిమిడి కళావెంకటరావు మంగళవారం మధ్యాహ్నం లోపెంటలో నిర్వహించే జన్మభూమి-మాఊరు సదస్సులో పాల్గొంటారని ఎంపీడీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ ఎస్.సుధాసాగర్ తెలిపారు. ఈమేరకు అధికారులు గ్రామంలో సమావేశ నిర్వహణ ఏర్పాట్లపై సర్పంచి నాయిని లక్ష్మి, ఎమ్పీటీసీ అనుపాన నాగమ్మలతో చర్చించారు.



మొక్కజొన్నపై పెరిగిన మక్కువ!

● రబీలో పెరిగిన విస్తీర్ణం ● గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రైతుల మొగ్గు

న్యూస్‌టుడే, రణస్థలం

వర్షాలు విరివిగా పడే ఖరీఫ్‌లో రణస్థలం, లావేరు మండలాల రైతులు మొక్కజొన్న పంట పండించేవారు. రానురాను వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఖరీఫ్‌లో పల్లం, మెట్ట భూముల్లో కూడా మొక్కజొన్న పంట సాగు చేయడం ప్రారంభించారు. ఈ ఏడాది తోటపల్లి నీరు ఖరీఫ్‌లో కొంతమేరకే సరఫరా చేయగలిగారు. వచ్చే ఏడాది నుంచి ఖరీఫ్‌నకే కాకుండా రబీలో కూడా పూర్తిగా నీరివ్వాలని అధికారులు భావిస్తుండడంతో రబీలో రైతులు వరి పండించకుండా ఆరుతడి పంట అయిన మొక్కజొన్న సాగును అలవాటు చేస్తున్నారు. వచ్చే ఏడాది రబీలో మొక్కజొన్న సాగు చేసేలా రైతులను ఈ ఏడాది నుంచే ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు ఈ ఏడాది రబీలో కూడా రైతులకు మొక్కజొన్న విత్తనాలు 50 శాతం రాయితీపై అందించారు. రబీలో వరి పండిస్తే రైతులకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సమస్యలు తలెత్తుతాయనే ఉద్దేశంతో ఆరుతడి పంటలు పండించాలని రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు ఈ ఏడాది రబీలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. జిల్లా కలెక్టర్ ధనంజయరెడ్డి సూచనలు మేరకు, అధికారులు మొక్కజొన్న సాగు పెరిగేలా చర్యలు తీసుకున్నారు.

నియోజకవర్గంలో మొక్కజొన్న సాగు ఇలా.. (హెక్టార్లలో)

మండలం	2016	2017
రణస్థలం	1790	2340
లావేరు	1897	2739
జి.సిగడాం	915	2410
ఎచ్చెర్ల	110	248

రాయితీపై విత్తనాలు... ఈ ఏడాది రబీలో కూడా 50 శాతం రాయితీపై విత్తనాలు అందజేశారు. రణస్థలంలో 419, లావేరులో 362, జి.సిగడాంలో 270, ఎచ్చెర్ల మండలంలో 45 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు రాయితీపై అందజేశారు.



నీరు అందుబాటులో ఉండడంతో.. ఈ ఏడాది తోటపల్లి కాలువల ద్వారా చెరువులు నింపారు. గతంలో రబీ కాలానికి నీరు తడి లేక మోటార్ల వద్ద రెండు ఎకరాలే సాగు చేసేవాడిని. ఈ ఏడాది అయిదున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. చెరువుల్లో ఉన్న నీటితో పాటు, బోర్లలో కూడా నీరు ఉండడంతో ఎక్కువ విస్తీర్ణంలో వేశాను. వచ్చే ఏడాది నుంచి పూర్తి స్థాయిలో నీరందితే మరింత సాగు చేసే వీలుంటుంది.

–సీహెచ్.గోవిందరావు, రైతు, వేల్పురాయి



ఆర్థిక ప్రయోజనం... గతంలో రెండెకరాల్లోనే మొక్కజొన్న సాగు చేసేవాడిని. ఈ ఏడాది ఆరు ఎకరాల్లో వేశాను. చెరువుల్లో నీరు చేరడం వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు, చెరువుల్లో నీరు పొలానికి రెండు మూడు తడులకు వస్తుంది. దీనివల్ల పంటకు మేలు కలుగుతుంది. మొక్కజొన్న పంట రైతుకు గిట్టుబాటు అవుతుంది. ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉండడంతో మొక్కజొన్న పంటపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

–పాశపు శ్రీనివాసరావు, రైతు, కంబాలపేట



భూసారం దెబ్బతినకుండా సూక్ష్మపోషకాలు... అన్ని కాలాల్లోనూ మొక్కజొన్న పంట పండించడం వల్ల భూసారం దెబ్బతింటుంది. ఇందుకు రైతులకు జింకు, జిప్సం ఉచితంగా పంపిణీ చేశాం. రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తిగా ఉన్నారు. అందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు అందిస్తున్నాం. గిట్టుబాటు ధర లభించడంతో ఈ పంట సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

–మహేష్‌నాయుడు, వ్యవసాయాధికారి, రణస్థలం



రైతులకు అలవాటు చేద్దామనే.. ఈ ఏడాది నీటి సదుపాయం ఉన్నచోట విస్తారంగా పంట వేయించాం. వచ్చే ఏడాది నుంచి రబీకి కూడా తోటపల్లి నీరు సరఫరా అవుతుందని కలెక్టరు చెప్పారు.. అందువల్ల రబీలో వరి సాగు చేస్తే సమస్యల పాలవుతారని.. ఆరుతడి పంట అయిన మొక్కజొన్న సాగు చేయిస్తే మేలని ఈ ఏడాది నుంచే రైతులకు అలవాటు చేయమన్నారు. ఇప్పటికే మొక్కజొన్న సాగు అలవాటు పడిన మన రైతులు వచ్చే ఏడాది చెరువుల కింద ఆరుతడి పంట కింద మొక్కజొన్న సాగు చేసుకుంటే అధిక ప్రయోజనం పొందుతారు. **–కె.చంద్రారావు, ఏడీ, వ్యవసాయ శాఖ, రణస్థలం**

కొత్త సంవత్సరంలో కొంగొత్తగా



ఉపకులపతి రామ్‌జీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బోధన సిబ్బంది

జి.సిగడాం, న్యూస్‌టుడే : మండలంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖలకు సంబంధించిన సిబ్బంది నూతన సంవత్సరాల శుభాకాంక్షలు ఒకరికి ఒకరు చెప్పుకున్నారు. అలాగే సర్పంచులు, ఎమ్పీటీసీలు, నాయకులు గ్రామాల్లో కేకు కోసి ఆనందంగా జరుపుకున్నారు. మంత్రి కిమిడి కళావెంకటరావు క్యాంప్ కార్యాలయంలో మండలంలో తెదేపా సర్పంచులు, ఎమ్పీటీసీలు, ఇతర నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కళావెంకటరావు మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా తెదేపా నాయకులు, కార్యకర్తలు నూతన ఉత్తేజంతో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల అధికారులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠంనాయుడు స్వగ్రామం ఎస్.పి.ఆర్.పురంలో మండల వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలల్లో.. పలు పాఠశాలల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా చేపట్టారు. బాతువ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కేకు కోశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ముగ్గులు వేసి సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మండలంలో జి.సిగడాం ఉన్నత పాఠశాల, సంతవురిటి, ఎందువ, డి.బొండపల్లి తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా చేపట్టారు.

అంబేడ్కర్‌విశ్వవిద్యాలయం(ఎచ్చెర్ల), న్యూస్‌టుడే: అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని 2018 సంవత్సరంలో మరింత అభివృద్ధి పథంలో ముందుకు నడిపిద్దామని ఉపకులపతి డా. కూన రామ్‌జీ అన్నారు. ఈ సందర్భంగా వర్సిటీలో ఆయనను రిజిస్ట్రార్ గుంట తులసీరావు, పరీక్షల నిర్వహన సమన్వయకర్త తమ్మినేని కామరాజు, ప్రధానాచార్యులు పెద్దకోట చిరంజీవి, ఛీఫ్ వార్డెన్ బిడ్డికి అడ్డయ్య , బోధన సిబ్బంది హనుమంతు సుబ్రహ్మణ్యం, స్వామినాయుడు, శ్రీధర్ తదితరులు కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిలో వర్సిటీ రెగ్యులర్ ఆచార్య నియామకాలు పూర్తిచేసుకొని జాతీయ స్థాయి సంస్థల గుర్తింపుతోపాటు అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు అందరి సహకారంతో కృషిచేస్తానన్నారు.

రణస్థలం, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా ప్రజాప్రతినిధులకు, నాయకులకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మంత్రి కిమిడి కళావెంకటరావును రాజాంలో ఎంపీపీ గొర్లె విజయ్‌కుమార్, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ గొర్లె విజయ్‌కుమార్‌ను మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు , తెదేపా కార్యకర్తలు ఆయన స్వగ్రామం మరువాడలో కలిశారు. వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త గొర్లె కిరణ్‌కుమార్‌ను పాతర్లపల్లిలో వైకాపా కార్యకర్తలు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు , ఎన్.ఈశ్వరరావులకు బంటుపల్లిలో వారి ఇళ్ల వద్ద కార్యకర్తలు అభిమానులు సందడి చేశారు.



మంత్రి కళాకు శుభాకాంక్షలు తెలుపుతున్న మండల తెదేపా సర్పంచులు, ఎమ్పీటీలు



మాజీ ఎమ్మెల్యే నీలకంఠంనాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు



వైకాపా నేత బొత్స సత్యన్నారాయణకు అభినందనలు తెలుపుతున్న మండల వైకాపా నాయకులు



మంత్రి కిమిడి కళావెంకటరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ గొర్లె విజయ్‌కుమార్, తదితర్లు



బాతువ ఉన్నత పాఠశాలలో..

ఎచ్చెర్ల

సంగమేశ్వరుడికి అభిషేకాలు

సంగాం (వంగర), న్యూస్‌టుడే : సంగమేశ్వరాలయంలోని సంగమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు గణపతి, కనకలింగం తెలిపారు. సోమవారం ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కొనసాగుతున్న పోరాటం

వాల్తేరు, (సంతకవిటి), న్యూస్‌టుడే : నాగావళి నదిపై వాల్తేరు - ఇసుకలపేట గ్రామాల మధ్య వంతెన నిర్మించాలంటూ వంతెన పోరాటకమిటీ చేస్తున్న రిలేనిరాహార దీక్షలు 317 రోజుకు చేరాయి. సోమవారం వంతెన పోరాటకమిటీ కన్వీనర్ జి.నారాయణస్వామి ఆధ్వర్యంలో సభ్యులు రిలేనిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ దీక్షలో వంతెన పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చలో జన్మభూమి

- ఈ కార్యక్రమంతోనైనా న్యాయం జరిగేనా?
- నేటి నుంచి ప్రారంభం
- పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

జి.సిగడాం, న్యూస్‌టుడే :

● జి.సిగడాం మండలం నక్కపేట గ్రామానికి చెందిన తవిటయ్య పింఛనుకు అర్హతున్న ఇంతవరకు రాలేదు.

● దవళపేట గ్రామంలో గతంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో 20 మంది వరకు కొత్తగా రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసినప్పటికీ ఇంతవరకు ఒక్కరికీ రేషన్‌కార్డు అందలేదు. ఇలా ప్రతి గ్రామంలోను ఏదో ఒక సమస్యతో బాధితులు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది జన్మభూమి కార్యక్రమంలో న్యాయం జరుగుతుందో లేదోనని ఆశగా ఉన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పింఛన్లు, రేషన్‌కార్డులు తదితర పలు పథకాలు అందక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇక మరో జన్మభూమి కార్యక్రమం రావడంతో ప్రజలు అందాల్సిన పథకాలపై దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు.

జన్మభూమి-మాఊరు కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామ సభల కోసం పలు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలాల్లో పంచాయతీల వారీగా రెండు బృందాలు ఏర్పాటుచేసి జన్మభూమి గ్రామ సభలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అయితే గత జన్మభూమి-మాఊరు కార్యక్రమ గ్రామసభల్లో అర్హులైన వారికి పింఛన్లు, రేషన్‌కార్డులు అందకపోవడంతో ఈ ఏడాది కార్యక్రమంలోనైనా వస్తాయేమోనని ఆశగా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.



జి.సిగడాంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరుగుతున్న దృశ్యం(పాతచిత్రం)

అర్హులకు పింఛన్లు అందేనా?

మండలాల్లో జనాభా ప్రాతిపాదికన అందిస్తున్న పింఛన్లు అర్హులకు ఈ ఏడాది జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో అందుతాయోలేదోనని ఎదురుచూస్తున్నారు. తెదేపా నాయకులు, జన్మభూమి కమిటీల మద్దతుదారులకే పింఛన్లు ఏటా అందిస్తున్నారని, అర్హులైన వారికి అందడం లేదని గ్రామాల్లో పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలో వేల పింఛన్లు అధికారులు మంజూరు చేసినా గ్రామస్థాయిలో జన్మభూమి కమిటీ సభ్యుల ఆమోదం కావాల్సి ఉండగా అధికార పార్టీ మద్దతు ఉన్న వారికే పింఛన్లు అధికారులు అందిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మండలాల వారీగా పింఛన్లు మంజూరు కోసం వేలాది దరఖాస్తులు వస్తున్నప్పటికీ ఏటా అర్హులైన వారికి అందని పరిస్థితి నెలకొంటుంది.

ఈ ఏడాదైనా పక్కాగా జరిగేనా?

ఏటా గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమాలను తూతూమంత్రంగానే నిర్వహిస్తున్నారు. గ్రామసభలకు మొక్కుబడిగా హాజరై పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు వివరాలు చదివి ఫొటోలకే పరిమితం అవుతున్నారు. క్షేత్రస్థాయిలో అర్హులైన వారు ఎంత మంది ఉన్నారు , పింఛన్లు, రేషన్‌కార్డులు సరిగా అందుతున్నాయా లేదానని పర్యవేక్షించడం లేదు. దీంతో గ్రామాల్లో చేపట్టే ఈ కార్యక్రమంపై ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

గ్రామసభల్లో చదవడానికే పరిమితం

గ్రామాల్లో కొత్తగా రేషన్‌కార్డులు కోసం దరఖాస్తులు చేసుకున్న వారి పేర్లు జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో చదవడానికే పరిమితం అవుతుంది. క్షేత్రస్థాయిలో మాత్రం రేషన్‌కార్డులను లబ్ధిదారులకు మంజూరు చేయించడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఫొటోలు సరిగా రాలేదని, కొంతమంది కుటుంబ సభ్యుల వివరాలు నిలిపేయడం తదితర కారణాలతో లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో రేషన్‌కార్డులు అందడం లేదు. గత ఏడాది జన్మభూమి కార్యక్రమంలో గ్రామసభల్లో రేషన్ కార్డులు కోసం మంజూరైన పేర్లు ఇంతవరకు లబ్ధిదారులకు అందని పరిస్థితి నెలకొంది.

చర్యలు తీసుకుంటున్నాం

గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం మంగళవారం నుంచి పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉదయం, మధ్యాహ్నం అధికారులతో రెండు బృందాలు ఏర్పాటుచేసి గ్రామ సభల నుంచి వచ్చిన ప్రజా సమస్యలను నమోదు చేయడంతోపాటు పరిష్కరించేలా చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అందరూ సహకరించాలి.

– ఆదిత్యలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి , జి.సిగడాం

చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ

జి.సిగడాం, న్యూస్‌టుడే: పాలకండ్యాం గ్రామంలో సోమవారం సర్పంచి పలిశెట్టి సూర్యనారాయణ చేతులమీదుగా పలువురు లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం అన్నివర్గాలకు న్యాయం చేసేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. సంక్రాంతి కానుకలను వినియోగించుకొని పండగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతన సంవత్సర వేడుకలను జరిపి గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి పెద్ది భాస్కరరావు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జన్మభూమి-మాఊరు

లావేరు, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు రెండు బృందాలుగా జన్మభూమి-మాఊరు సదస్సు ఉంటుందని తహసీల్దార్ సుధాసాగర్, ఎంపీడీవో కిరణ్‌కుమార్ అన్నారు. 2న గుమడాం, తాళ్లవలస, చిగురుకొత్తపల్లి గ్రామాల్లో జరుగుతుంది. 3న పెదరావుపల్లి, చిన్నమురపాక, మురపాక, కేశవరాయునిపాలేం, 4న బెజ్జిపురం, బుడతవలస, గుమడాం, తామాడ గ్రామాల్లో జరుగుతుంది. 5న పాతకుంకాం, కొత్తకుంకాం, పెదరావుపల్లి, గుర్రాలపాలేం గ్రామాల్లో, 6న పెదకొత్తకోట, గోవిందపురం, అదపాక, బుడుమూరు, 8న పెదలింగాలవలస, పోతయ్యవలస, అప్పాపురం, వెంకటాపురం సదస్సులు జరుగుతాయని వారు చెప్పారు. 7న మండల పరిషత్ కార్యాలయం నుంచి వెంకటాపురం కూడలి వరకు మండల కార్యాలయాల సముదాయం నుంచి అయిదు కిలోమీటర్లు పరుగు ఉంటుందని తెలిపారు. 11న లావేరు ఉన్నత పాఠశాల ఆవరణలో మెగా రుణమేళా కార్యక్రమం జన్మభూమి సదస్సుల్లో భాగంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. జన్మభూమి కార్యక్రమంలో ఫిర్యాదుదారులు అందించిన దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ నెంబర్లు ఫిర్యాదులో నమోదు చేయాలని తెలిపారు.

భగవద్గీత నగర సంకీర్తన

రాజాం, న్యూస్‌టుడే : పాశ్చాత్య సంస్కృతి నుంచి యువతను బయట పడేసేందుకు, వారిలో అవగాహన కల్పించేందుకు భగవద్గీత పారాయణంతో నగర సంకీర్తన సోమవారం నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సంకీర్తన నిర్వహించారు. ఇందులో వికాసతరంగిణి అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి, సుజ్ఞాన సేవా సమాజం అధ్యక్షుడు టంకాల సన్యాసినాయుడు, దొంతంశెట్టి శ్రీదేవి, గడే అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వికాసతరంగిణి ప్రతినిధులు

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు

అరసవల్లి, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జిల్లాజడ్జి నిర్మలగీతాంబ దంపతులు, సంయుక్త కలెక్టర్ చక్రధరబాబు ఉన్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ప్రత్యేక పూజలు చేశారు.



జిల్లాజడ్జి నిర్మలగీతాంబ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

సంతకవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : ఆంగ్ల పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జి.ఎస్.పురం స్కూల్ కాంప్లెక్సు ఛైర్మన్ శ్రీరామ్మూర్తి అన్నారు. సోమవారం మందరాడ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు అదపాక దామోదరరావు పేద విద్యార్థుల కోసం తయారుచేసిన ఆంగ్ల పుస్తకానికి సంబంధించిన పుస్తకాలను సంతకవిటి ఎం.ఆర్.సీ కార్యాలయంలో ఆవిష్కరించారు. పదో తరగతి పరీక్షలకు 60 రోజులు ఉన్నందున విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికతో చదివి ఆంగ్లంపై పట్టు సాధించి మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుప్రకాష్ , అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగా, ఆయుర్వేదంలో ఉచిత శిక్షణ

రాగోలు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో అన్ని వర్గాల వారికి యోగా, ఆయుర్వేదం కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ సెంటర్ హెడ్ సి హెచ్.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఉంటాయన్నారు. బీఎస్సీ నర్సింగ్, ఎంఎల్‌టీ, బీపీటీ, మెడికల్ కోడింగ్, బిల్లింగ్‌లలో నిర్ణీత రుసుంతో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణానంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.



కిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ధాన్యం..దైన్యం

రాజాం, న్యూస్‌టుడే: ధాన్యం తరలిపోతున్నాయి. ఇతర జిల్లాలకు చెందిన ప్రైవేటు వ్యాపారులు రాజాం నియోజకవర్గంలో భారీగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో భారీగా కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేసి తరలించుకుపోతున్నారు. ఒక్కో చోట ఒక్కో ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర మాత్రం సమకూరడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

తెదేపాతోనే గ్రామాల అభివృద్ధి

జి.సిగడాం, న్యూస్‌టుడే : తెదేపా ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కంచరాన సూరన్నాయుడు అన్నారు. సోమవారం దవళపేట గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు సీసీ రహదారులు, తాగునీరు తదితర సౌకర్యాలు తెదేపా ప్రభుత్వ హయాంలోనే అమలయ్యాయన్నారు. రైతులను ఆదుకునేందుకు రుణమాఫీతోపాటు పంట గిట్టుబాటు ధర వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. సాగునీటికి ఇబ్బందులు లేకుండా జిల్లాలో మడ్డువలస, తోటపల్లి కాలువల ద్వారా సాగునీరు అందించిన ఘనత తెదేపా ప్రభుత్వానిదేనన్నారు. గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు, రేషన్ కార్డులు తదితర పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.



మాట్లాడుతున్న సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సూరన్నాయుడు

శ్రీకూర్మంలో నేటి పూజలు

మంగళవారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, నిత్యాభిషేకం, నిత్యార్చన, ప్రాబోధిక, తిరువారాధన, మంగళాశాసనం, బాలభోగం, సర్వదర్శనం, * మధ్యాహ్నం 12 గంటలకు రాజభోగం, సర్వదర్శనం, ★ సాయంత్రం 7:30 గంటలకు నిత్య తిరువారాధన, మంగళాశాసనం, ★ రాత్రి 8 గంటలకు పవళింపు సేవ

-న్యూస్‌టుడే, శ్రీకూర్మం (గార)

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం సాంస్కృతికం, గుజరాతీపేట (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా నగరంలోని పలు దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. విజయగణపతి ఆలయంలో స్వామికి స్వర్ణపుష్పార్చన చేశారు. ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉమారుద్రునికి, పార్వతీదేవికి విశేషపూజలు చేశారు. నూతన సంవత్సరం ఆరంభం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు రుద్రాభిషేకం, లలితాహోమం నిర్వహించారు.

సినిమాలు

- ఎస్వీఎస్ రామాంజనేయ (రణస్థలం): ఎంసీఏ
- వెంకటరమణ (పైడిభీమవరం) : 2 కంట్రీస్

నరసన్నపేట

తెదేపాలోకి మట్టవానిపేట గ్రామస్థుల చేరిక

జలుమూరు, పోలాకి, న్యూస్‌టుడే: జలుమూరు మండలం కరవంజ పంచాయతీ మట్టవానిపేట గ్రామానికి చెందిన తూము శ్రీనివాసరావు, బొమ్మాళి పాపారావు, తూము కృష్ణయ్యతో పాటు పలువురు సోమవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమక్షంలో తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచి జుత్తు అప్పల నాయుడు, ఉపసర్పంచి చల్ల గోపాలరావు, నీటి సంఘం అధ్యక్షుడు సంపతిరావు శ్రీరాములు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

వంశధార నదికి నక్షత్ర హారతి

శ్రీముఖలింగం(జలుమూరు), న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన జలుమూరు మండలంలోని శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్రం సమీపంలోని పవిత్రమైన వంశధార నదికి సోమవారం దేవాదాయశాఖ సిబ్బంది, అర్చకులు నక్షత్ర హారతి ఇచ్చారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని నదికి హారతి ఇస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సిబ్బంది, పలువురు అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మీ సమస్యలకు ఇవిగో పరిష్కారాలు

ఈనాడు మీతోడు

నరసన్నపేట, న్యూస్‌టుడే: గ్రామీణ రహదారులు మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పలు గ్రామీణ ప్రాంతాలకు రహదారుల సదుపాయం మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, అయితే నిధుల కొరతతో జాప్యం జరుగుతున్నా.. చిత్తశుద్ధితో సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈనాడు-మీతోడు కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సమస్యలకు ఎమ్మెల్యేతోపాటు పలువురు అధికారులు పరిష్కారాలు చూపారు.

సమస్య: నరసన్నపేట ఇందిరానగర్ ప్రధాన వీధిలో కాలువల మధ్య నుంచి ఉన్న పైపుల్లో నుంచి తాగునీరు సరఫరా అవుతోంది. దీంతో తాగునీరుంతా దుర్గంధంగా మారుతోంది.?

-డి.రవికుమార్, ఇందిరానగర్

పరిష్కారం: ఇటీవల నీటి ట్యాంకు శుభ్రపరిచాం. అందువల్ల చివరి ప్రాంతాల్లో కాస్త మురుగునీరు వచ్చినట్లు సమాచారం వచ్చింది. ఇకపై అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. **-గొద్దు చిట్టిబాబు, సర్పంచి**

సమస్య: నరసన్నపేట పట్టణంలోని మారుతీనగర్ నాలుగోవీధి గోతుల మయంగా ఉంది. రహదారి మరమ్మతులు చేయండి. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వాటిని అరికట్టాలి.? **-జీవీ రమణ, మారుతీనగర్**

పరిష్కారం: మారుతీనగర్ ప్రధాన వీధి రహదారి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. సంక్రాంతి అనంతరం పనులు చేపడతాం. పందుల సంచారంపై చర్యలు చేపడతాం. **- బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే**

సమస్య: పోలాకి మండలం గొల్లలవలస మీదుగా తోటాడ-డోల రహదారి దారుణంగా ఉంది. విద్యార్థులు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు.?

-అప్పలస్వామి, యుగంధర్, పంచరెడ్డి లక్ష్మణరావు

పరిష్కారం: గొల్లలవలస మీదుగా వెళ్లే రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం. పలు గ్రామీణ రహదారులు అభివృద్ధి చేయాలని ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. ఇందులో భాగంగా తోటాడ, డోల రహదారి పనులు చేపడతాం. **- బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే**

సమస్య: నరసన్నపేట పట్టణంలోని పురుషోత్తమనగర్ కాలనీలో కాలువలు లేక రహదారులు మురుగుకూపంగా మారుతున్నాయి. కాలువలు లేని కారణంగా దోమల తాకిడి ఎక్కువగా ఉంది.?

- పురుషోత్తమనగర్ కాలనీ వాసులు

పరిష్కారం: పంచాయతీకి చెందిన 14వ ఆర్థిక సంఘం నిధులతో కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం.

-గొద్దు చిట్టిబాబు, సర్పంచి

సమస్య:. సారవకోట మండలం సింగమవలసలో డ్రైనేజీ సదుపాయం లేదు. పాఠశాల, సీసీ రహదార్లు కూడా లేవు. గ్రామంలో అన్నీ సమస్యలే. వాటిని పరిష్కరించండి.?

-సిహెచ్.లక్ష్మీనారాయణ, సింగమవలస

పరిష్కారం: ఉపాధిహామీ పథకం నిధుల నుంచి గ్రామానికి నిధులు సమకూర్చాం.

- సత్యనారాయణ, మండల ఇంజినీరింగ్ అధికారి

సమస్య: నరసన్నపేట మండలం ఉర్లాం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలోనే డంపింగ్‌యార్డును నిర్మించడం అన్యాయం. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రీడాస్థలిలో డంపింగ్‌యార్డును ఏర్పాటుతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. డంపింగ్‌యార్డును మరొక ప్రాంతానికి తరలించండి.? **-పాఠశాల విద్యార్థులు**

పరిష్కారం: పాఠశాలకు కొద్ది దూరంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాని డంపింగ్‌యార్డు కాదు. అపోహలకు తావులేదు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి ప్రహరీ నిర్మాణానికి గ్రామ పంచాయతీకి సూచిస్తాం. **-విద్యాసాగర్, ఎంపీడీవో**

సమస్య: నరసన్నపేట మండలం యారబాడు పంచాయతీ కొటారుపల్లి గ్రామంలో కొందరు దారిలోనే ఇళ్లు నిర్మిస్తున్నారు. ఆక్రమణలకు పాల్పడి ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్నారు. ?

-కె.సింహాచలం.

లబ్బ ఆదినారాయణ, కొటారుపల్లి

పరిష్కారం: అక్కడ జిరాయితీ స్థలంలో నిర్మాణాలు ఉన్నాయి. ఇప్పటికే రెవెన్యూ, పోలీసు శాఖలు ఈ సమస్యపై చర్చించి పరిష్కారం చూపారు. ఆక్రమణలకు తావులేదు. **-రెవెన్యూ అధికారులు**

సమస్య: నరసన్నపేట పట్టణంలోని సౌభాగ్యలక్ష్మి కల్యాణ మండపం సమీప ప్రాంతం చెత్తతో నిండిపోయింది. సమస్య పరిష్కరించండి.? **- సుగుణ, నరసన్నపేట**

పరిష్కారం: చెత్తను తొలగించి సమస్య పరిష్కరిస్తాం.

- గొద్దు చిట్టిబాబు, సర్పంచి

సమస్య: నరసన్నపేట మండలం ముషిడిగట్టు పంచాయతీ ఉప్పరపేట గ్రామానికి ఇప్పటి వరకు రహదారి సౌకర్యం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కనీసం 108 వాహనం కూడా రాలేని పరిస్థితి ఉంది. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారు. తాగునీటి సమస్య నెలకొంది. కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించండి.?

- గిరిధర్, గోసెట్టి ప్రసాద్, గుర్రం ఆనందకుమార్, దిలీప్‌కుమార్, రాంజీ, గౌరి, దూసి రవికుమార్, ఉప్పరపేట

పరిష్కారం: ఉప్పరపేట గ్రామానికి రహదారిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. గతంలో కూడా తాను జడ్పీటీసీసభ్యునిగా చేసిన సమయంలో ఈ గ్రామానికి రహదారిని నిర్మించాను. అలాగే ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తరువాత కూడా జన్మభూమి నిధులతో రహదారిని అభివృద్ధి చేశాం. త్వరలో గ్రామ రహదారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే**



పరిష్కారం: రాళ్లగోదాయివలస రహదారి రహదారి అభివృద్ధికి నిధులు ఉన్నాయి. సాంకేతిక సమస్యలు పరిష్కరించి రహదారి నిర్మాణం పూర్తవుతుంది.

- బగ్గు రమణమూర్తి , ఎమ్మెల్యే

సమస్య: పోలాకి మండలం రాజారాంపురం గ్రామంలో మాకు పీఎంజేవై పథకం ద్వారా ఇల్లు మంజూరు చేశారు. కాని బిల్లులు చెల్లించడం లేదు. సమస్య పరిష్కరించండి.? **-మైలపల్లి ఆదినారాయణ, రాజారాంపురం**

సమస్య: పోలాకి మండలం గాతలవలస బీసీ కాలనీ, పలు చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. వాటిపై పరిశీలించి చర్యలు తీసుకోండి.? **- గాతలవలస గ్రామస్థులు**

పరిష్కారం: ఆక్రమణలు తొలగించేందుకు రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశించాం.

- బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే

సమస్య: మా ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మించాం. ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదు.?

-లింగుబేరి ఎర్రయ్య, ప్రియాగ్రహారం

పరిష్కారం: ఇంకుడుగుంతలకు బిల్లుల చెల్లింపుల బకాయిలు లేవు. ఒక వేళ చెల్లించకుంటే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం. **-కె.సీతారాం, ఏపీవో**

సమస్య: నరసన్నపేట కళాశాల మైదానంలో ట్రాక్ వేసినా మధ్యలో నీరు చేరుతోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా చెరువు డంపింగ్‌యార్డులు మార్చారు. పలు వీధుల్లో రహదార్లు నిర్మించినా తక్కువ వెడల్పుగా నిర్మించారు.? **-స్థానికులు**

పరిష్కారం: ట్రాక్ నిర్మాణం తదుపరి ఇంకా పనులు చేయాల్సి ఉంది. నరసన్న చెరువులో పలు ప్రభుత్వ నిర్మాణాలకు ప్రభుత్వం నిర్దేశించింది. ఇకపై చెరువులో చెత్తవేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

-గొద్దు చిట్టిబాబు, సర్పంచి

సమస్య: నరసన్నపేట మేజర్ పంచాయతీలోని శ్రీరాంనగర్ ప్రధాన రహదారి చాలా దారుణంగా ఉంది. రహదారిని నిర్మించండి.? **- బాలగంగాధర్, ఎల్ఐసీ డీవో**

పరిష్కారం: శ్రీరాంనగర్ వీధిలో రహదారి పరిస్థితి దృష్ట్యా నిధులు ఎక్కువగా కేటాయించాం. త్వరలో సమస్య పరిష్కారమవుతుంది. **-గొద్దు చిట్టిబాబు, సర్పంచి**

సమస్య: నరసన్నపేట సమీపంలో గొట్టిపల్లి వెళ్లే మార్గంలో శ్మశాన వాటికకు వెళ్లేందుకు మార్గం లేదు. దహన సంస్కారాలు చేసేందుకు వీలుగా పక్కా భవనం నిర్మించాలి. ? **-వి.వి.కృష్ణంరాజు, శ్రీరాంనగర్**

పరిష్కారం: ఉపాధిహామీ పథకం నిధుల నుంచి శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. **-రవి, ఏపీవో**

సమస్య: పోలాకి మండలం పిరువాడ, రాళ్ల గోదాయవలస రహదారి ధారుణంగా ఉంది. రాళ్లు తేలిపోయి ప్రయాణం భారంగా ఉంది. రహదారి సమస్య పరిష్కరించండి. ?

-కె.హరగోపాల్, రాళ్లగోదాయవలస

పరిష్కారం: బిల్లులు చెల్లింపుల ప్రక్రియ నిలిచిపోలేదు. రికార్డులు పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.

-గృహనిర్మాణ శాఖ అధికారులు

సమస్య: నరసన్నపేట కంబకాయ కూడలి వద్ద పందుల స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.?

-జి.పురుషోత్తం, కంబకాయ కూడలి

పరిష్కారం: పందుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. నెల్లూరు నుంచి నిపుణులను రప్పించి పందుల నివారణ చర్యలు తీసుకుంటాం. **-గొద్దు చిట్టిబాబు, సర్పంచి**

సమస్య: జలుమూరు మండలం రామకృష్ణాపురం గ్రామానికి వంట గ్యాస్ రావడం లేదు. దీపం పథకం ద్వారా మాకు గ్యాస్ సరఫరా చేయాల్సి ఉండగా, గ్రామానికి గ్యాస్ తరలించడం లేదు చాలా ఇబ్బంది పడుతున్నాం.?

- బొంతు రాంబాబు, రామకృష్ణాపురం.

పరిష్కారం: గ్రామానికి గ్యాస్ సరఫరా అయ్యేలా ఏజెన్సీకి సూచిస్తాం. జిల్లా సంయుక్త కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరుగుతుంది.

-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే

సమస్య: జలుమూరు మండలం మర్రివలస గ్రామంలో పలు చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగించండి. ?

-జెజె నాయుడు, జలుమూరు

పరిష్కారం: చెరువులు ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించాల్సిన అవసరం ఉంది. ఆక్రమణల తొలగింపుపై చర్యలు చేపడతాం. **-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే**

సమస్య: నరసన్నపేట ఎస్బీఐ సమీపంలో డ్రైనేజీ దయనీయంగా ఉంది. దోమలు, పందులు తాకిడి ఎక్కువగా ఉంది. గ్రామ పంచాయతీ పట్టించుకోవడం లేదు.?

-తంగుడు విశ్వనాథం, విశ్రాంత ఈఈ. ఎస్‌బీఐ వీధి

పరిష్కారం: ఈప్రాంతంలో డ్రయినేజిలపైనే ఆక్రమణలు ఉన్నాయి. దీంతో కాలువలు పరిశుభ్రం చేయడం పంచాయతీ సిబ్బందికి కష్టంగా ఉంది. ఆక్రమణలు తొలగించి సమస్య పరిష్కరిస్తాం. **-గొద్దు చిట్టిబాబు, సర్పంచి**

సమస్య: నరసన్నపేట పట్టణంలోని సూరజ్‌నగర్‌కు తాగునీటి సదుపాయం లేదు. దూర ప్రాంతాల నుంచి తాగునీటిని తీసుకొస్తున్నాం. ఈ సమస్య పరిష్కారంపై దృష్టిసారించండి. ? **-వాగ్దేవి, సూరజ్‌నగర్**

పరిష్కారం: సూరజ్‌నగర్‌కు పంపిణీ లైను లేనందున తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. త్వరలో ప్రత్యేకంగా పైపులైను నిర్మించి నీటి సమస్యను తీరుస్తాం.

-గొద్దు చిట్టిబాబు, సర్పంచి

సమస్య: నరసన్నపేట పట్టణంలోని శివనగర్ కాలనీకి చెందిన ప్రకాశరావు మృతి చెందారు. ఇప్పటి వరకు చంద్రన్నబీమా ఇవ్వలేదు.?

- సిహెచ్ హిమకుమార్.శివనగర్ కాలనీ

పరిష్కారం: సాధికార సర్వేలో చేరినట్లయితే సమస్య పరిష్కారం చేస్తాం. **-మల్లేశ్వరరావు, ఏపీఎం**

సమస్య: నరసన్నపేట సంతపేట సమీపంలో పదేళ్ల కిందట నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ నిధులు ఖర్చుచేసినా పంచాయతీ ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకురాలేదు. కారణాలేంటో గుర్తించి సమస్య పరిష్కరించగలరు. ?

-బండి దాలెప్పన్న, వార్డు సభ్యుడు

పరిష్కారం: చాలా రోజులుగా ఈ సమస్య ఉంది. సులభ్ కాంప్లెక్స్ పునరుద్ధరణకు మరికొంత మేరకు నిధులు కేటాయించి వినియోగంలోకి తీసుకొస్తాం. **-గొద్దు చిట్టిబాబు, సర్పంచి**

సమస్య: పోలాకి మండలం గవరమ్మపేటకు రహదారి సదుపాయం కల్పించాలి.? **-టి.అప్పారావు, గవరమ్మపేట**

పరిష్కారం: ఉపాధి పథకం ద్వారా ఈ గ్రామానికి రహదారి నిర్మాణం పనులు చేపడతాం **-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే**

సమస్య: నరసన్నపేటలో కూరగాయల మార్కెట్‌ను ఒకే చోట నిర్వహించాలి.?

- టంకాల రామారావు, నరసన్నపేట

పరిష్కారం: విశ్వేశ్వరయ్య కూరగాయల మార్కెట్ సమస్య కారణంగా రహదారులపై కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. ఒకే ప్రాంతంలో కూరగాయల విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. **-గొద్దు చిట్టిబాబు, సర్పంచి**

సమస్య: నరసన్నపేట మేజరు పంచాయతీ మారుతీనగర్ కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. ఆటోలు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ?

-జామి వాసు, మారుతీనగర్

పరిష్కారం: మారుతీనగర్‌తో పాటు పలు కూడలి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఉన్న విషయం తన దృష్టికి వచ్చింది. పోలీసు సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టేలా ఆదేశిస్తాం. **-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే**



సమస్య: నరసన్నపేట వీరన్నాయుడు కాలనీ సమీపంలో నిత్యం పందులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. చీకటి సమయాల్లో పందులు దాడులు చేసే ప్రమాదం పొంచి ఉంది. సమస్య పరిష్కరించండి.?

-ఎస్.రాజేశ్వరి, వీరన్నాయుడు కాలనీ.

పరిహారం: పందుల బెడద నుంచి త్వరలో విముక్తి కలుగుతుంది. పంచాయతీ ఈ సమస్యపై దృష్టి సారించడం జరిగింది. **-గొద్దు చిట్టిబాబు, సర్పంచి**

సమస్య: నరసన్నపేట వీఎస్ఆర్ అపార్టుమెంటుకు రహదారి సదుపాయం కల్పించాలి. ?

-సూర్యనారాయణ, వీఎస్ఆర్ కాంప్లెక్స్.

పరిష్కారం: అపార్టుమెంటు యాజమాన్యాలపై మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ఉంది. త్వరలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రహదారి నిర్మాణంపై దృష్టి సారిస్తుంది. **-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే**

సమస్య: రాజులచెరువులో ఆక్రమణలు పేరుకుపోయాయి. వాటిని తొలగించి చెరువును అభివృద్ధి చేయండి. ?

-గడ్డిపెంటయ్య, బండివీధి

పరిష్కారం: రాజుల చెరువు అభివృద్ధికి రూ.50 లక్షలతో నిధులు సమకూర్చడం జరిగింది. త్వరలో టెండర్లు పూర్తి చేసుకుని పనులు ప్రారంభించడం జరుగు తుంది. అలాగే ఆక్రమణలు కూడా సంక్రాంతి తరువాత తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. **- బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే**

సమస్య: నరసన్నపేట పట్టణంలోని ఆదివరపుపేట-బొంతలవీధి నడుమ డ్రైనేజీ నిర్మాణం లేక ఇబ్బందులు పడుతున్నాం.? **-తాళాభక్తుల శ్రీనివాసరావు, ఆదివరపుపేట**

పరిస్కారం: గ్రామ పంచాయతీ సాధారణ నిధులు కేటాయించి సమస్య పరిష్కరిస్తాం. **-గొద్దు చిట్టిబాబు, సర్పంచి**

పాలకొండ

4న మెగా వైద్యశిబిరం

కత్తులకవిటి, (వీరఘట్టం గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని కత్తులకవిటి గ్రామంలో సత్యసాయి దశమవార్షికోత్సవంలో భాగంగా 4వ తేదీన మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసినట్లు సర్పంచి రౌతు దామోదరరావు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని ఆయన కోరుతున్నారు.


వీధిదీపాల సమస్యా....ఫిర్యాదు చేయండి

పాలకొండ, న్యూస్‌టుడే : నగరపంచాయతీ పరిధిలో వీధిదీపాల సమస్యలు ఉంటే నగరపంచాయతీ ఏఈ సురేష్‌కు ఫిర్యాదు చేయవచ్చు. 9959226806 నెంబరుకు సమస్యను వివరించవచ్చు. నగరపంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో ఎక్కడైనా వీధిదీపాల సమస్య ఉంటే ఏ సమయంలోనైనా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రయోజనం కలిగించే ప్రణాళిక

'న్యూస్‌టుడే'తో వ్యవసాయశాఖ ఏడీ రాజగోపాల్ ముఖాముఖి

ముఖాముఖి



న్యూస్‌టుడే, వీరఘట్టం గ్రామీణం: రైతులకు ప్రయోజనం కలిగేవిధంగా వ్యవసాయశాఖ కార్యాచరణ చేస్తుంది. ప్రకృతి వ్యవసాయ విధానం, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల వినియోగం వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, రబీసీజన్లో ఆరుతడి పంటలువేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నామని పాలకొండ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బి. రాజగోపాల్ పేర్కొన్నారు. ఆయన 'న్యూస్‌టుడే'తో ముఖాముఖి మాట్లాడారు.

న్యూస్‌టుడే: రసాయనిక ఎరువుల వినియోగం వలన భూసారం దెబ్బతింటుంది, భూసార పరీక్షలకు సంబంధించి మీరు ఎలాలంటి చర్యలు తీసుకున్నారు?

ఏడీ: భూసారాన్ని రక్షించేందుకు భూసార పరీక్షలు నిర్వహించాం. ఇందుకు సంబంధించిన మట్టినమూనాల పరీక్షల ఫలితాలను రైతులకు తెలియజేశాం. ఈమేరకు వారికి తగు వ్యవసాయ సూచనలుకూడా చేశాం. దీంతో ఇప్పటికే కొంతమంది రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించారు.

న్యూ : రబీపంటకు సంబంధించి సాగునీరు సమస్య ఏమైనా ఉంటుందా?

ఏడీ : తోటపల్లి ఎడమ కాలువ నుంచి ఇటీవల రబీ పంటకు సాగునీరు విడుదలచేశారు. ప్రధానంగా ఆరుతడి పంటలు వేయాలని రైతులకు అవగాహన కల్పించాం. వరిపంటవేస్తే నిరాటంకంగా సాగునీరు అందే అవకాశం ఉండదు. పెసలు, మినుములు, వేరుసెనగ, మొక్కజొన్న పంటలకు ప్రస్తుతం విడుదలచేస్తున్న సాగునీరు అనుకూలంగా ఉంటుంది. ఈమేరకు రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

న్యూ : భూసార ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించే పరిస్థితి కనిపించలేదు? దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

ఏడీ : ఇప్పటికే రైతులకు భూమిలో ఉన్న లోపాలను గుర్తించి ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాం. భూసారం ఆధారంగా ఎరువుల సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉంది. ఎరువుల వినియోగం మోతాదుకు మించి ఉంటే పంటలపై ప్రభావం చూపుతుంది.

న్యూ : యాంత్రీకరణ పరికరాలపై రైతులకు అంతగా అవగాహన ఉండడం లేదు?

ఏడీ : మా సిబ్బంది గ్రామాలకు వెళ్లిన సమయంలో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీని అవసరం తెలుసుకున్న కొంతమంది రైతులు ట్రాక్టర్లు, మినీట్రాక్టర్లు, పవర్‌స్ప్రేయర్లు, టైరబళ్లు ఇలా అవసరమైనవాటిని సబ్సిడీతో పొంది వినియోగించుకుంటున్నారు. రానున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ప్రధానంగా ప్రకృతి వ్యవసాయ విధానం, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

న్యూ : వీరఘట్టం వ్యవసాయశాఖ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇది చాలా ప్రమాదకరంగా ఉంది. నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారా?

ఏడీ : వీరఘట్టం వ్యవసాయశాఖ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచాం. ఇందుకు సంబంధించి నిధులు మంజూరు కావాల్సి ఉంది. మరోసారి ఉన్నతాధికారులకు ఈవిషయాన్ని తెలియజేస్తాం.

అన్నీ శుభ శకునములే!

● పాలకొండ అభివృద్ధికి నిధులు ● సమకూరనున్న సౌకర్యాలు



కోటదుర్గ ఆలయం ఆనుకుని నిర్మించనున్న మరుగు, స్నానపుగదులు

న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

నూతన ఏడాది పాలకొండ పట్టణానికి శుభశకునాలు తెచ్చిపెట్టింది. ఈ ఏడాది పట్టణ అభివృద్ధికి పాలకవర్గం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేసుకుని పట్టణాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీంతో రానున్న రోజుల్లో నగర పంచాయతీ ప్రజలకు మనికొన్ని సౌకర్యాలు సమకూరనున్నాయి.

రూ.కోటితో రహదారులు : ఆర్థికసంఘ నిధులు రూ. కోటి ప్రభుత్వం పాలకొండకు సమకూర్చింది. ఈ నిధులుతో తొలివిడతలో రూ.50లక్షలతో పది వీధులకు రహదారి, పక్కాకాలువల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. రెండోవిడతలో మిగిలిన నిధులతో మరో పదిచోట్ల అభివృద్ధి పనులకు నిర్ణయించారు. కాపువీధుల సమీపాన ఉన్న సీమలవీధివద్ద ఉన్న పోతులగెడ్డకాలువ వంతెన గత నెలలో పూర్తిగా శిథిలమైంది. దీంతో పదివీధులుకు రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. రూ.లక్షతో త్వరతిగతిన వంతెనకు మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించనున్నారు.

రెండుచోట్ల మరుగు, స్నానపుగదులు నిర్మాణం

కొత్తఏడాదిలో అధునాతన మరుగుదొడ్లు, స్నానపుగదులు నిర్మాణం చేపట్టనున్నారు. తెలంగాణా రాష్ట్రానికి చెందిన ఓ ప్రైవేటు సంస్థ 30 ఏళ్లుపాటు నిర్వహించేందుకు నగరపంచాయతీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆరుబయట మలవిసర్జన నిర్మూలనకు ఇవి ఉపకరించనున్నాయి. స్థానిక వీరఘట్టం కూడలిలో ఆటోనిలయం ఆనుకొని నిర్మించనున్నారు. కోటదుర్గ ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రయోజనకరంగా ఉండేందుకు, బజారుకు వచ్చేవారి సౌలభ్యం కోసం పట్టణ ప్రధాన రహదారిలో కోటదుర్గదేవస్థానం ఆనుకుని ఉన్న భాసూరువారివీధి పాత శిథిలమైన పాఠశాల భవనాల స్థలంలో నిర్మించేందుకు నిర్ణయించారు. కొద్దిరోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి.

రూ.37కోట్లతో సమీకృతరక్షిత పథకం

ప్రజలకు మంచినీటి సదుపాయం కల్పించేందుకు పాలకొండకు రూ.37కోట్లతో సమీకృత రక్షితపథకం నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి మార్చినెలలో టెండర్లప్రక్రియ ఖరారుకానుంది. ఇందుకు సంబంధించి సర్వేను ఇప్పటికే అధికారులు పూర్తిచేశారు.



శిథిలమైన వంతెన

అభివృద్ధికి ప్రణాళికలు

పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధిచేసేందుకు నిర్ణయించాం. ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేసుకుని ప్రజలకు సౌకర్యాలు కల్పించనున్నాం.

-పల్లా విజయనిర్మల, నగర పంచాయతీ అధ్యక్షురాలు

కాలమానిని ఆవిష్కరణ

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ డివిజన్ ఎన్‌జీవో సంఘ కాలమనిని సోమవారం ఆర్డీవో రెడ్డి గున్నయ్య ఆవిష్కరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జనవరి 1ను పురస్కరించుకుని కాలనిర్ణయపట్టికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘ డివిజన్ అధ్యక్షులు లిల్లీపుష్పనాథం, పరిపాలనాధికారి వీర్రాజు, డివిజనల్ సీఎస్‌డీటీ ఐటీకుమార్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

పాలకొండ, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి శిల్లా ఆంజనేయ గుప్త పట్టణంలోని నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. సోమవారం స్థానిక కోటదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వంద మంది నిరుపేదలకు దుప్పట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ ఎన్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆంజనేయగుప్త

ఆధునికీరణకు ఎదురుచూపులు!



తోటపల్లి ప్రధాన కాలువ దుస్థితి

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ మండల రైతులు తోటపల్లి కాలువల ఆధునికీకరణకు ఎదురుచూస్తున్నారు. రిజర్వాయరుకు శివారున ఉండడంతో రైతులకు ఏటా సాగునీటి సమస్య ఎదురవుతోంది. ప్రాజెక్టు నుంచి 32 కిలోమీటర్ల దూరంలో పాలకొండ మండలం ఉండడంతో సాగునీరు పూర్తిస్థాయిలో చేరడంలేదు. 2010లో కాలువలు ఆధునికీకరణకు అప్పటి ప్రభుత్వం శంకుస్థాపన చేసినా కార్యరూపం దాల్చలేదు. ఇటీవల వీరఘట్టం మండలం తెట్టంగి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాలువలు ఆధునికీకరణ చేస్తామని సభలో ప్రకటించి రెండు నెలలు గడిచినా ప్రతిపాదన మాత్రం ముందుకు కదలడంలేదు. పాలకొండ మండలంలో 15వేల ఎకరాలకు తోటపల్లి ఎడమ కాలువ ద్వారా సాగునీటితోనే పంటలు సాగవుతున్నాయి. ఇప్పటికైనా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఆధునికీకరణ జరిగేలా కృషి చేయాలని వేడుకుంటున్నారు. లేనిపక్షంలో సాగు భూములు బీళ్లుగా విడిచిపెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జన్మభూమి గ్రామసభల్లో తోటపల్లి తీర్మానం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే : జన్మభూమి గ్రామసభల్లో తోటపల్లి ఆధునికీకరణ చేపట్టాలంటూ తీర్మానాలు చేసేందుకు అంతాసమాయత్తం కావాలని తోటపల్లి కాలువల ఆధునికీకరణ సాధనాసమితి బాధ్యులు బుడితి అప్పలనాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆసంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రైతుల ప్రయోజనార్థం పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికితీసుకువెళ్లి రైతులకు సత్వర న్యాయం జరగాలంటే ఇదొక్కటే సరైన మార్గమన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. ఆ సంఘ నాయకులు లక్ష్మినారాయణ, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ ఆలయ సమాచారం

★ ఉదయం అయిదు గంటలకు సుప్రభాతసేవ, అలంకరణ, అర్చన. ★ 5.30 మంగళహారతి. ★ ఆరు గంటలకు ఉత్సవ ఆరాధన. ★ ఆరుగంటల నుంచి 11 గంటల వరకు కుంకుమార్చనలు ★ ఆరు నుంచి ఒంటి గంట వరకు ఘటోత్సవాలు ★ 12.00 గంటలకు మహారాజభోగం. దర్శనాలు నిలుపుదల. ★ 12.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలు ★ సాయంత్రం 6.15 గంటలకు అర్చన, ధూపం, మంగళహారతి. ★ 6.30 గంటలకు ప్రత్యేక పూజలు ★ రాత్రి ఎనిమిది గంటలకు మంగళహారతి. ★ రాత్రి తొమ్మిది గంటలకు పవళింపుసేవ. –న్యూస్‌టుడే, పాలకొండ

పెట్రోల్ ధరలు

పాలకొండ నగరపంచాయతీ పరిధిలో మంగళవారం లీటరు పెట్రోల్ రూ.75.95, డీజిల్ రూ.66.87గా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ధరలు మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి అమల్లోకి వస్తాయి.

– న్యూస్‌టుడే, పాలకొండ

వెండి కిరీటం బహుకరణ

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక నక్కలపేటలోని షిర్డీసాయిబాబా విగ్రహానికి సోమవారం వెండికిరీటం అలంకరించారు. స్థానిక షిర్డీసాయినగర్‌కు చెందిన బాబా భక్తులు బీవీ సుబ్రహ్మణ్యం, ఉషారాణి, వీవీ గిరి, శ్రీదేవి దంపతులు రూ.52వేలు విలువ చేసే కిలో వెండితో తయారుచేసిన కిరీటాన్ని ఆలయ అభివృద్ధిసంఘ ప్రతినిదులు పల్లా కొండలరావు, కాంద్రేగుల శ్రీనులకు అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం కిరీటాన్ని అలంకరించారు.



వెండికిరీటం బహుకరిస్తున్న దృశ్యం

పాలకొండ



నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పన

పాతపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని నిరుద్యోగ గిరిజన మహిళలకు ఉపాధి కల్పనకు ఈ నెల 4వ తేదీన పాతపట్నం వైటీసీలో ఎంపికలను చేపడుతున్నట్లు శ్రీలక్ష్మి టెక్స్‌టైల్స్ సంస్థ సభ్యులు భాస్కరరావు తెలిపారు. ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో చేపట్టే ఈ ఎంపికలకు పాతపట్నం మండలానికి చెందిన మహిళలు మాత్రమే హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



పాలకొండలో కేకు కత్తిరిస్తున్న నగర పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కౌన్సిలర్లు

పాలకొండ గ్రామీణం, పాలకొండ, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలు పాలకొండలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నక్కలపేటలో జరిగిన వేడుకల్లో నగర పంచాయతీ అధ్యక్షురాలు పల్లా విజయ నిర్మల, కొండలరావు దంపతులు కేకుకత్తిరించి పంచిపెట్టారు. ఉపాధ్యక్షురాలు చూడామణి తదితరులు పాల్గొన్నారు. జడ్పీటీసీ సభ్యులు సామంతుల దామోదరరావు, ఎంపీపీ వారాడ లక్ష్మీసుమంత్, మార్కెట్‌కమిటీ అధ్యక్షులు చింతసంగన్నాయుడు, తెదేపా రాష్ట్రకార్యదర్శి కర్నేన అప్పలనాయుడులకు పలువురు అధికారులు, ఉద్యోగులు, పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ జిల్లాపరిషత్తు అధ్యక్షులు పాలవలస రాజశేఖరంను పలువురు పార్టీనాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వీరఘట్టం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో సోమవారం ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అధికారులు ఉన్నతాధికారులను, వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు ప్రజాప్రతినిధులను, విద్యార్థులు ఉపాధ్యాయులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం అర్ధరాత్రి కేక్‌లను కత్తిరించి నూతన ఆంగ్లసంవత్సరానికి ఆహ్వానం పలికారు. బంధుమిత్రులు తమ ఆత్మీయులకు సోమవారం అర్ధరాత్రి దాటిన నుంచి వాట్సప్, ఫేస్‌బుక్‌లతోపాటు చరవాణిల సూక్ష్మసందేశాల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

సీతంపేట, న్యూస్‌టుడే : సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ కేక్ కట్ చేశారు. ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి ఎల్.ఆనందరావు, ఏపీడీలు డి.లక్ష్మి, గార రమణమ్మ, మేనేజర్ నాగేశ్వరరావు, పీఏవో భవానీశంకర్, డిప్యూటీ డీఈవో గున్ను రామ్మోహనరావు, డీఈఈ నాగేశ్వరి, తదితరులు ఉన్నారు.

భామిని, న్యూస్‌టుడే: భామిని మండల పరిషత్తుకార్యాలయంలో సోమవారం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దండు ప్రకాషరావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవోకు, ఎంఈవో శ్రీనివాసరావుకు యూటీఎఫ్ నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సార్తి మహేష్, వై.గౌరినాయుడు, ఎస్ రత్నకుమార్, నాగయ్య, జనార్ధన్, గణపతి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు మీసాల ప్రఫుల్‌కుమార్ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ నాయకులు సోమవారం ఎంఈవో శ్రీనివాసరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనను సన్మానించిన తరువాత క్యాలెండర్, డైరీలు పంచి పెట్టారు. బోగి శ్రీనివాసరావు, కె.నారాయణరావు, జి.శివకృష్ణ, పాల్గొన్నారు.



భామిని: ఎంపీడీవో, ఎంఈవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

పరీక్ష రుసుము చెల్లించండి

బాలేరు(భామిని), న్యూస్‌టుడే : 2018 సంవత్సరానికి సార్వత్రిక పాఠశాల(ఓపెన్ పాఠశాల) పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష రుసుము చెల్లించాలని ప్రధానోపాధ్యాయులు పి.రవివర్మ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో జరగబోయే సార్వత్రిక పరీక్షలకు ఈ నెల 9వ తేదీ నుంచి పరీక్ష రుసుము చెల్లించాలని ఆయన కోరారు.

ఘనంగా రుద్రాభిషేకాలు

వీరఘట్టం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని విక్రమపురం, నడిమికెల్ల, కుంబిడి ఇచ్చాపురం శివాలయాల్లో సోమవారం ఘనంగా క్షీరాభిషేకాలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు.

తాగునీటి సరఫరా వేళలు

పాలకొండ, న్యూస్‌టుడే : వెంకంపేట రక్షిత పథకం ద్వారా, నగరపంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న రక్షిత పథకం ద్వారా 6.30 తాగునీరు సరఫరా చేస్తారు. వడమ, ఎన్‌కేరాజపురం గ్రామాల్లోని రక్షిత పథకాల ద్వారా సాయంత్రం అయిదు గంటలకు తాగునీటిని సరఫరా చేస్తారు. నాలుగు రక్షిత పథకాలు ద్వారా అర్ధగంట సమయం పాటు సరఫరా ఉంటుంది.

పూర్తి మొత్తం వెచ్చించండి...

కంబరవలస, (వీరఘట్టం గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని కంబరవలస జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని ప్రధానోపాధ్యాయుడు జి.రవిప్రసాద్ కోరుతున్నారు. ఉపాధిహామీలో ఇందుకు సంబంధించి రూ. 5లక్షలు నిధులు వెచ్చించాల్సి ఉన్నప్పటికి రూ.2.5 లక్షలతో అధికారులు అంచనాలు తయారుచేశారని తెలిపారు. ఈమొత్తంతో క్రీడాప్రాంగణం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం సాధ్యంకాదని, ఇప్పటికైన అధికారులు పూర్తి మొత్తాన్ని వెచ్చించి ఆటస్థలాన్ని అభివృద్ధి చేయాలని ఆయన కోరుతున్నారు.

నేటి నుంచి జన్మభూమి- మాఊరు కార్యక్రమం

భామిని, న్యూస్‌టుడే: 5వ విడత జన్మభూమి-మాఊరు కార్యాక్రమాన్ని ఈ నెల 2వ తేదీ నుంచి జనవరి 11వ తేది వరకు నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో సిహెచ్ మల్లేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన కార్యక్రమ షెడ్యూల్‌ను విడుదల చేశారు. జనవరి 2న చిన్నదిమిలి, పెద్దదిమిలి, మనుమకొండ, బత్తిలిలో అధికారులు రెండు బృందాలు వెళ్లి జన్మ భూమి- మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

మాకవరం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

మాకవరం (కొత్తూరు), న్యూస్‌టుడే : మండలంలోని మాకవరం పంచాయతీని మరింత అభివృద్ధి చేస్తామని పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకటరమణ హామీ ఇచ్చారు. మండలంలోని మాకవరం గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన సామాజిక భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తాగునీరు, రహదారులు, ఇతర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మండల తెదేపా అధ్యక్షులు మాతల గాంధీ, ఆసుపత్రి కమిటీ అధ్యక్షులు పి.మోహనరావు, సర్పంచి, ఎంపీటీసీలు పాత్రకొండ శ్రీలత, ముగితి జ్యోతి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేజరు పంచాయతీ కార్యాలయం మార్పు

హిరమండలం, న్యూస్‌టుడే : హిరమండలం మేజరు పంచాయతీ కార్యాలయం మార్పు చేసినట్లు (వేరేచోటకు తరలించినట్లు) పంచాయతీ ఈవో కె.సత్యం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వంశధార జలాశయం భూసేకరణలో కార్యాలయం భవనం తొలగించడంతో తాత్కాలికంగా పాతహిరమండలం ఎంపీపీఎస్-1 పాఠశాల ఆవరణలో (అలికాం-బత్తిలి రహదారి పక్కన) ఒక భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీ ప్రజలు ఈమార్పును గమనించాలని కోరారు.

మరుగుదొడ్ల వినియోగంపై ఆరా



పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ నగరపంచాయతీలో సోమవారం స్వచ్ఛభారత్ పరిశీలకులు టి.హుస్సేన్ పర్యటించారు. పట్టణంలోని పెదకాపువీధి, కస్పావీధి, గొల్లవీధి, ఇందిరానగర్‌కాలనీ, వెంకటరాయుని కోనేరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రజలతో ఆయన మాట్లాడారు. మరుగుదొడ్ల వినియోగంపై ఆరా తీశారు. ఆయన వెంట కమిషనర్ పి.బాలాజీప్రసాద్, టీపీవో వరప్రసాద్, ఏఈ నాయుడుతోపాటు 17వ వార్డు కౌన్సిలర్ గుమ్మిడి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటిస్తున్న పరిశీలకులు హుస్సేన్

విశ్రాంతి భవనంలో నివాసం

చిట్టపుడివలస, (వీరఘట్టం గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని చిట్టపుడివలస కూడలి వద్ద నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి భవనంలో చెరుకు కొట్టే కార్మికులు నివాసం ఉంటున్నారు. కొన్ని రోజులుగా వీరు ఇక్కడే బసచేశారు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం ఆరుబయట వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. విశ్రాంతి భవనం ఇలా మారడంతో పలువురు విమర్శిస్తున్నారు.



నివాస గృహంగా మారిన ప్రయాణికుల విశ్రాంతిభవనం

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు సత్కారం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే : స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేసి పదవి విరమణ పొందిన ఉద్యోగులు, కార్మికులుకు సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఏడీసీ ఎ.కృష్ణ, కార్మికులు రామారావు, బ్రహ్మానందం, కేవీ రమణ, జి.రామారావు, బీఎన్‌రావుల సేవలను ఈయూ ప్రాంతీయకార్యదర్శి బీకేమూర్తి, ట్రాఫిక్‌విభాగం ఏఎం మూర్తిలు కొనియాడారు.

కాలమానిని ఆవిష్కరణ



సీతంపేటలో ఎన్‌జీవో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో శివశంకర్

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఎన్‌జీవో అసోసియేషన్(పాలకొండ) వార్షిక క్యాలెండర్‌ను ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందడంలో ఉద్యోగులు కీలక పాత్ర వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో పాలకొండ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.రంగాచారి, డీడీ పి.సీతారామయ్య, డిప్యూటీ డీఈవో గున్ను రామ్మోహనరావు, ఏపీడీ డి.లక్ష్మి, ఏటీడబ్ల్యూవోలు ఎల్.రజని, మల్లిఖార్జునరావు, వెంకటరమణ, ఈఈ అశోక్, గురుకులం సెల్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు, డీడీ కార్యాలయం సూపరింటెండెంట్ నీలకంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కవోని దీక్ష



కేజీబీవీ పాఠశాల వద్ద కూరగాయల మొక్కలకు నీరుపోస్తున్న బాలికలు

రేగులపాడు(వీరఘట్టం గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని రేగులపాడు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ఆవరణలో కూరగాయల మొక్కలకు నీరును పోస్తు బాలికలు రక్షించుకుంటున్నారు. పోషకవిలువల గల కూరగాయలు పండించుకునేందుకు వీరంతా శ్రద్ధ చూపుతున్నారు. కూరగాయల విత్తనాలు మొక్కలుగా ఎదిగాయి. వీటిని రక్షించుకుంటూ వీరు ఇతర పాఠశాలల విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీస్థలాల్లో ఇలా కూరగాయలు పండిస్తే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పోషక విలువలు కలిగిన కూరలు వండి పెట్టొచ్చు.

శునకాలతో భయం..భయం..

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ వద్ద, ఇతర ప్రాంతాల్లో గుంపుగుంపులుగా తిరుగుతున్న శునకాలతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణం, సోమగండి, ఐటీడీఏ కూడలి వద్ద ఇవి గుంపుగా తిరుగుతుండడంతో ఎవరిపై ఎప్పుడు దాడి చేస్తాయో అనే భయంతో కాలం గడుపుతున్నారు. సీతంపేటలో ఇటీవల పలువురిపై శునకాలు దాడి చేసిన విషయం తెలిసిందే. అదే పరిస్థితి ఐటీడీఏ ప్రాంగణంలో కనిపిస్తోందని అంటున్నారు. గతంలా కాకుండా ఏమాత్రం భయపడకుండా మనుషులపైకి వస్తున్నాయని అంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఐటీడీఏకు పనిమీద వచ్చిన గిరిజనులు, ఇతరులు వీటిని చూసి భయపడుతున్నారు. కుక్కల బారి నుంచి కాపాడాలన్నారు.



సీతంపేట ఐటీడీఏ వద్ద గుంపుగా తిరుగుతున్న శునకాలు

చంద్రన్న బీమా సాయం పంపిణీ

బైపల్లి (వజ్రపుకొత్తూరు), న్యూస్‌టుడే: బైపల్లిలో కిడ్నీ వ్యాధితో కోనేరు ప్రసాదు మృతి చెందగా.. సోమవారం భార్య పద్మావతికి చంద్రన్న బీమా తక్షణ సాయం కింద రూ.5 వేలు అందజేశారు. త్వరలో మరో రూ.1.95 లక్షల అందజేయనున్నట్లు బీమామిత్ర తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పాపా రావు, కామేశ్, వెలుగు, గ్రామైక్య సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలాస

3 నుంచి కిడ్నీవ్యాధిగ్రస్థులకు ఉచితంగా మందుల పంపిణీ

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ఉద్దానం ప్రాంతంలో కిడ్నీవ్యాధిగ్రస్థులకు మిషన్ ఉద్దానం అమెరికా స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ నెల 3వ తేదీ నుంచి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు సంస్థ ప్రతినిధి డాక్టరు దుర్గారావు తెలిపారు. ఉద్దానంలోని 20 గ్రామాల్లో 500 మందికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. 3న అక్కుపల్లి, పల్లిసారధి గ్రామాల్లో మందులు పంపిణీ చేయ నున్నట్లు ఆయన తెలిపారు.



మందసలో మాజీ ఎమ్మెల్సీ మజ్జి శారదకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు

నవ వత్సర వేళ.. శుభాకాంక్షల వెల్లువ..

పలాస, కాశీబుగ్గ, మందస– న్యూస్‌టుడే

పలాస - కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు పలాస నియోజకవర్గంలో సోమవారం ప్రముఖులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పలాస తెదేపా కార్యాలయం వద్ద ఎమ్మెల్యే శివాజీ, తెదేపా జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీషలకు శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్దసంఖ్యలో తరలిరావటంతో పోలీసులు క్యూలైన్ల ద్వారా పంపించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్యాలయం సందడిగా మారింది. కాశీబుగ్గలో పురపాలక సంఘం అధ్యక్షుడు కోత పూర్ణచంద్రరావు, పలాసలో మాజీ ఎంపీ, భాజపా నాయకులు డాక్టర్ కె.విశ్వనాథం, పురపాలక సంఘం మాజీ ఛైర్మన్ వజ్జ బాబురావులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మందసలో మాజీ ఎమ్మెల్సీ మజ్జి శారదకు పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. హరిపురంలో మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వెంకటవరదరాజపురంలో మాజీ ఎంపీపీ కొర్ల కవితకన్నారావుకు రాజకీయాలకు అతీతంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. కాశీబుగ్గలో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త డా.ఎస్.అప్పలరాజు ఇంటి వద్ద శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వారితో సందడి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ డా.వాసుదేవ్‌కు పలువురు శుభాఖాంక్షలు తెలిపారు. డీఎస్పీ, ఎక్సైజ్, మండల పరిషత్తు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద సైతం సందడి వాతావరణం నెలకొంది.

పల్లిసారధి, (వజ్రపుకొత్తూరు), న్యూస్‌టుడే : మండలంలోని పల్లిసారధిలోని జడ్పీటీసీ సభ్యురాలు ఉప్పరపల్లి నీలవేణి స్వగృహం వద్ద సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యురాలు కొత్త సంవత్సర కేక్‌ను కోశారు. జడ్పీటీసీ సభ్యురాలుకి మండలం నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంపీడీవో తిరుమలరావు, తహసీల్దార్ రమణయ్య, ప్రజా ప్రతినిధులు హేమంత్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ఉషా రాణి, నాగార్జున, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, డీలర్లు, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలాస, న్యూస్‌టుడే: పలాస -కాశీబుగ్గ జంటపట్టణాలకు చెందిన విద్యార్థులు గీతాలతో అలరించారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం రాత్రి కాశీబుగ్గలోని ఓ కల్యాణ మండపంలో శుభ త్యాగరాజ సంగీత విభావరి ఆధ్వర్యంలో అన్నమయ్య, త్యాగరాజు, సినీ భక్తిగీతాలతో అలరించారు. కార్యక్రమంలో వైద్యులు రామినాయుడు, కె.వి.గోపాల్, సంగీత శిక్షకురాలు బి.హేమసుధ పట్నాయక్, వై.పద్మజ, ఎం.రామేశ్వరరావు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్నొన్నారు.

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాల్లో యువత కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సినీ గీతాలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పన్నెండు గంటలకు కేక్‌ను కత్తిరించి శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ యువకులు ఆనందంగా గడిపారు.

పూండి(వజ్రపుకొత్తూరు గ్రామీణం), న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం పూండిలో సోమవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. ఈ పోటీల్లో 40 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. స్థానిక సాయిరాం వీధిలోని రహదారి ముగ్గులతో ఆహ్లాదకరంగా మారింది. ఈ పోటీల్లో విజేతగా బి.లీలావతి నిలవగా, ద్వితీయ, తృతీయ స్థానాలను జె.గౌతమి, సీ.హెచ్.ప్రవళిక దక్కించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచి శ్రావణి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ రూరల్ ఏరియా మేనేజరు సూర్యనారాయణ, జేఎస్‌వో శ్రీనివాస్, ఎం.లక్ష్మణ్ పాల్గొన్నారు.



పూండిలో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచి శ్రావణి



వజ్రపుకొత్తూరులో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



కాశీబుగ్గలో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త డా.అప్పలరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు



కాశీబుగ్గలో గీతాలాపన చేస్తున్న చిన్నారులు



కేక్‌ను తినిపిస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు నీలవేణి



కాశీబుగ్గలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డా.డి.వాసుదేవ్‌కు శుభాకాంక్షలు తెలుతున్న అభిమానులు

అన్ని వీధుల్లో సీసీ రహదారులు



రహదారి పనులు చేపడుతున్న దృశ్యం

అమలపాడు(వజ్రపుకొత్తూరు గ్రామీణం), న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు పంచాయతీలో అన్ని గ్రామాల్లోనూ పక్కా సీసీ రహదారులు నిర్మిస్తున్నట్లు సర్పంచి తులసీ చెప్పారు. సోమవారం స్థానిక కొత్తవీధిలో రూ.5 లక్షలతో సీసీ రహదారి పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. వీటి పనులను పీఆర్ జేఈ రవిబాబు పరిశీలించారు. అమలపాడులో ప్రస్తుతం తెదేపా ప్రభుత్వంలో ఇప్పటికే 50 లక్షలకు పైగా నిధులతో సీసీ రహదారులు, డ్రైనేజీల అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న ఎడాదిన్నర కాలంలో అన్ని వీధుల్లోను పక్కా రహదారులు నిర్మిస్తామన్నారు. ప్రజల సహకారంతో ప్రస్తుతం పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆమె చెప్పారు.

ప్రతిభావంతులను స్ఫూర్తిగా తీసుకోవాలి

నగరంపల్లి (వజ్రపుకొత్తూరు), న్యూస్‌టుడే : విద్యార్థులు, ప్రతిభావంతులు, మేధావులను స్ఫూర్తిగా తీసుకోవాలని, అప్పుడే ఉన్నతి స్థాయికి ఎదగలరని ఉప సర్పంచి సనపల చక్రవర్తి పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో వినియోగ దారుల హక్కుల పరిరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలగా నిలవడంతో సోమవారం నగరంపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీర్రాజు ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రశంసించారు. మరిన్ని విజయాలను సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రతిష్ఠతను తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం క్లబ్ ఛైర్మన్ రమేష్, శోభనబాబు, కేశవరావు, సూర్యనారాయణ, చంద్రశేఖర్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నగరంపల్లిలో విజేతలను అభినందిస్తున్న దృశ్యం



ఆపస్ క్యాలెండరును ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆపస్‌ను ఆదరించాలి

జీ.ఆర్.పురం (మందస), న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాన్ని ఉపాధ్యాయులు ఆదరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తమ్మినేని చందనరావు కోరారు. మందస మండలం గుడారిరాజమణిపురం ఉన్నత పాఠశాలలో సోమవారం సంఘం క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చందనరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచడం, ఉపాధ్యాయ సమస్యలపై స్పందించి పరిష్కారం కోసం పోరాడే సంఘం ఆపస్ అని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు మాట్లాడుతూ విద్యారంగాన్ని పరిరక్షించే బాధ్యత ఉపాధ్యాయ సంఘాలపై ఉందన్నారు. ఉపాధ్యాయయులు తదితరులు పాల్గొన్నారు.

స్థలదాతకు సన్మానం

మందస, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్థలాలు కబ్జా అవుతున్న ప్రస్తుత రోజుల్లో.. మండల కేంద్రమైన మందస నడిబొడ్డున ప్రభుత్వ పథకం కోసం సరిపడా స్థలం దానం చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ మజ్జి శారద అన్నారు. మందస కరణం వీధి ప్రజల దాహార్తి తీర్చడం కోసం రూ. 4 లక్షలతో ఇటీవల మినీ రక్షిత మంచినీటి పథకం మంజూరు చేశారు. అందుకు అవసరమైన స్థలాన్ని దానం చేసిన సరస్వతి పట్నాయక్‌ను ఆమె సోమవారం సన్మానించారు. మంచినీటి పథకానికి తన భర్త దివంగత సూర్యనారాయణ పట్నాయక్ నామకరణం చేయాలని సరస్వతి కోరారు.



స్థల దాత సరస్వతి పట్నాయక్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ మజ్జి శారద

తెరపై సినిమాలు

అన్నపూర్ణ - 2 కంట్రీస్, **హరిశంకర్** - ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి), **రవిశంకర్** - ఒక్క క్షణం, **భాస్కరరామా** - ఇంద్రసేన, **వెంకటేశ్వర** (ఎస్.వి మ్యాక్స్)- హలో -న్యూస్‌టుడే, పలాస

నాలుగు చోట్ల జన్మభూమి కార్యక్రమం

మందస, న్యూస్‌టుడే :మందస మండలంలో మంగళవారం నుంచి 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమం జరుగుతుందనిఎంపీడీఓ పి. చంద్రకుమారి తెలిపారు. మొదటి రోజు తహసీల్దారు పి. వి. శ్యామసుందరరావు బృందం తాళ్లగురంటి, చీపి, ఎంపీడీఓ బృందం బుడార్శింగి, భోగాపురం పంచాయతీల్లో గ్రామసభలు చేపడతారని చెప్పారు.

పలాస

ఆశలే శ్వాసగా.. సంక్షేమం ధ్యాసగా..!

- దరఖాస్తులకు మోక్షం లభించేనా?
- నేటినుంచి 'జన్మభూమి - మా ఊరు'

సార్! పింఛను ఎప్పుడొస్తుంది?
జనవరి కల్లా వస్తుందమ్మా.
సార్! రేషన్‌కార్డు ఎప్పుడిస్తారు?
జన్మభూమి - మా ఊరులో ఇస్తారమ్మా.
ప్రజల ప్రశ్నలకు ఇదీ ప్రతినిధుల సమాధానాలు. ఎట్టకేలకు ఆ జన్మభూమి రానేవచ్చేసింది. ప్రజల ఎదురుచూపులు ఫలించే అవకాశం కలిగింది.



పలాస -కాశీబుగ్గ పురపాలక సంఘంలో ప్రధాన సమస్యగా ఉన్న చెత్త

పలాస, న్యూస్‌టుడే

పలాస -కాశీబుగ్గ పురపాలక సంఘంతో పాటు పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో మంగళవారం నుంచి నిర్వహించే జన్మభూమి -మా ఊరు కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం కావటంతో లబ్ధిదారులంతా కళ్లల్లో ఒత్తులు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. పలాస -కాశీబుగ్గ పురపాలక సంఘంలో 2 నుంచి 10 వరకు 25 వార్డుల పరిదిలో కార్యక్రమం నిర్వహించనున్నారు. పురపాలక సంఘంలో అధికమంది వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లతో పాటు రేషన్ కార్డులు, ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిరుడు పురపాలక సంఘంలో జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో 314 మంది దరఖాస్తు చేసుకున్నారు. పింఛన్ల కోసం 115, మరుగుదొడ్లకు 9, రేషన్‌కార్డులకు 28, ఇళ్ల పట్టాలకు 98, ఇళ్ల రుణాలకు 42, దీపం కనెక్షన్ కోసం 1, రోడ్లు, కాలువల సమస్యలకు 18, ఇతర అంశాలపై 3 దరఖాస్తులు వచ్చాయి. తాజాగా పురపాలక సంఘంలో ఇళ్ల కోసం సుమారు 1200కు పైగా దరఖాస్తులు రాగా, రేషన్ కార్డులకు వందల సంఖ్యలో దరఖాస్తులు చేయటం అధికారులకు తలనొప్పిగా తయారవుతోంది. పురపాలక సంఘంలో జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో అర్హులు ఉంటే అధికారులు అక్కడికక్కడే పరిశీలించి.. సంక్షేమ పథకాలు అందించాల్సిఉంది. ప్రస్తుతం రేషన్ కార్డుల్లో పేర్ల నమోదు, తొలగింపులో అడ్డంకులు ఎదురవటంతో సగంమందికి పైగా రేషన్‌లో కోత పడుతోంది. ఉమ్మడి కుటుంబంలో ఉన్న సభ్యులు సొంత కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నవి, కొత్తగా కాపురాలు పెట్టే జంటల దరఖాస్తులు నేటివరకు ఖరారు కాకపోవటంతో మంగళవారం నుంచి జరిగే జన్మభూమిలో పెద్ద సమస్యగా తయారయ్యే పరిస్థితి కనబడుతోంది. రుణమాఫీలో సైతం మూడో విడత జమ కాకపోవటం, వార్డుల వారీగా పింఛన్లు ఎంతమందికి మంజూరు అయ్యాయో తెలియకపోవడంతో జన్మభూమిలో దరఖాస్తులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.



కాశీబుగ్గ నిత్యానంద్‌నగర్‌లో కాలువ దుస్థితి ఇలా



కాశీబుగ్గ టెలికాం ఎక్స్ఛేంజీ పక్కన అధ్వానంగా ఉన్న రోడ్డు

సమస్యలు ఎక్కడికక్కడే

పురపాలక సంఘంలో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. ప్రధాన రహదారి కె.టి. రోడ్‌తో పాటు 25 వార్డుల పరిధిలో చెత్త సమస్య ప్రధానంగా కనిపిస్తోంది. ఏ వార్డుకు వెళ్లినా చెత్త నిల్వలు, కాలువల్లో పూడిక నిండిపోవడం, కొన్ని ప్రాంతాల్లో రోడ్ల సౌకర్యం లేకపోవటం వంటి అంశాలపై ప్రజల నుంచి నిరసన వ్యక్తం అవుతోంది. పారిశుద్ధ్య సేవలకు ప్రత్యేక చర్యలు లేకపోవటం, వాహనాల కొరతతో శత శాతం చెత్త తరలించే అవకాశం లేకుండా పోతోంది.

నాలుగు వార్డుల్లో నేడు

పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘంలో బుధవారం ఉదయం 20, 21 వార్డుల పరిధిలో ఉదయం 9 గంటలకు ఎంపీయూపీ పాఠశాల, ఉదయపురంలో, 18, 19 వార్డుల పరిధిలో మధ్యాహ్నం అన్నపూర్ణ ఆశ్రమం వద్ద 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమం ప్రారంభిస్తారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం



చంద్రన్న సంక్రాంతి కానుకలు అందజేస్తున్న దృశ్యం

గుణుపల్లి (వజ్రపుకొత్తూరు), న్యూస్‌టుడే : తెలుగుదేశం ప్రభుత్వం పేదల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తోందని సర్పంచి జోగి తరుణీబాయి, ఎంపీటీసీ సభ్యురాలు చొక్కర దేవాకమ్మ అన్నారు. సోమవారం గుణుపల్లిలో చంద్రన్న సంక్రాంతి కానుకలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల పక్షపాతి తెదేపా అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కోడ సరస్వతి, గ్రామాభివృద్ధి సంఘం ప్రతినిధులు రామన్న, మోహనరావు, రవి, మహిళ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత గరుడభద్ర

గరుడభద్ర (వజ్రపుకొత్తూరు), న్యూస్‌టుడే: గరుడభద్రలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి షైనింగ్ స్టార్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గరుడభద్ర జట్టు విజేతగా నిలవగా.. ద్వితీయ స్థానం మర్రిపాడు జట్టు కైవసం చేసుకుంది. సోమవారం విజేత జట్లకు సర్పంచి సరోజని, గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు ధర్మారావు, యువజన సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు చేతుల మీదగా జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ పనులు చేపడుతున్న దృశ్యం

అమలపాడులో పారిశుద్ధ్య పనులు

అమలపాడు(వజ్రపుకొత్తూరు గ్రామీణం), న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం అమలపాడులో సోమవారం పెద్ద ఎత్తున పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇక్కడున్న 8 వీధుల్లోని కాలువల్లో పేరుకుపోయిన చెత్త తొలగించారు. ఇందులో సర్పంచి తులసీ, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షన్ముఖరావు పాల్గొన్నారు. స్థానికులు సహకరించాలని ఎవరి ఇంటి ముందు వారు చెత్త వేయకుండా ఊరికి దూరంగా వేయలని కోరారు.

జంట పట్టణాల్లో ఓడీఎఫ్‌పై పరిశీలన

పలాస, న్యూస్‌టుడే: పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఆరుబయట మలమూత్ర విసర్జన నిషేధం శత శాతం అమలే తీరును ఓడీఎఫ్ పర్యవేక్షకుడు సుధాకర్ పరిశీలించారు. మంగళవారం పురపాలక సంఘంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో ఓడీఎఫ్ తీరు నివేదిక తయారు చేశారు. ఆయన వెంట పారిశుద్ధ్య అధికారి మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.



కాశీబుగ్గలో పరిశీలన చేస్తున్న ఓడీఎఫ్ పర్యవేక్షణ సభ్యుడు సుధాకర్

బానిసత్వంపై ఆత్మగౌరవ విజయోత్సవ దినం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: దళిత, బహుజనులు ఏటా జనవరి ఒకటో తేదీని మహర్‌ల శౌర్య దినంగా జరుపుకోవాలని దళిత ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా రామారావు పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో సోమవారం బీమా కోరే గావ్ విజయోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహర్‌లు బానిసత్వ విముక్తి కోసం సామాజిక గౌరవం కోసం పీష్వాలతో యుద్ధం చేశారన్నారు. మహర్‌ల వీరోచిత గాథ జరిగి 200 ఏళ్లు దాటిందన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన మహర్‌లకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో దివ్వల ఎర్రన్నాయుడు, కేఎన్‌పీఎస్ నాయకులు బెలమర ప్రభాకరరావు, మురళి, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

అపరాలకు మబ్బుల దెబ్బ

నందిగాం, న్యూస్‌టుడే: ఆకాశంలో గత మూడు రోజులుగా కమ్ముకున్న మబ్బులతో అపరాల పంటలైన పెసర, మినుము పంటలు మాడిపోతున్నాయి. పేనుబంక, నల్లి పురుగులు అపరాల పంటలను ఆశించి మొక్కల ఆకులు ముడుచుకుపోతున్నాయి. మండలంలో అపరాలు సుమారు 5.900 ఎకరాల్లో సాగు చేశారు. మబ్బుల కారణంగా తెగుళ్లు వ్యాపించాయి. చలిగాలులతోపాటు మబ్బులు పట్టడంతో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. పేనుబంక, నల్లి పురుగులకు ఆస్ట్రోపిడ్ ఎకరాకు 80 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఏవో సురేష్ తెలిపారు. వేరేగా మోనోక్రోటోపాస్ ఎకరాకు 250 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని ఆయన సూచించారు.

రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు పలువురి ఎంపిక

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 5, 6, 7వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జరగనున్న మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు సీతాపురం జడ్పీ బాలికోన్నత పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయినులు ఎంపికయ్యారు. 35 ఏళ్ల వయోవిభాగంలో వ్యాయామోపాధ్యాయిని విజయలక్ష్మి జావెలిన్, డిస్క్‌త్రో, హేమర్ త్రో విభాగాలకు ఎంపిక కాగా, 45 ఏళ్ల వయోవిభాగంలో హిందీ ఉపాధ్యాయిని కోళ్ల చంద్రిక డిస్క్, జావెలిన్, షాట్‌పుట్ విభాగాలకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్తారు వేణీకుమారితో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పేదలకు దుస్తుల పంపిణీ

నారాయణపురం(వజ్రపుకొత్తూరు గ్రామీణం), న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం నారాయణపురం మృత్యుంజయ ఆలయ సన్నిధిలో సోమవారం స్థానిక ఓంనమశ్శివాయ చేయూత సంఘం నేతృత్వంలో పేదలకు దుస్తులు , బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సుమారు 50 మంది పేదలకు వీటిని పంపిణీ చేసినట్లు సంఘ అధ్యక్షుడు ఎం. రాంబాబు చెప్పారు. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



నారాయణపురంలో పేదలకు వస్త్రాలు, బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

బహిరంగ ప్రకటన

నా క్లయింటైన దేబదలా గ్రామము, గజపతి జిల్లా, ఒడిస్సా కా. కొండంగి లేటు కమల లోచన గారి భార్య విజయలక్ష్మీ వారు యిచ్చిన భోగట్టా ప్రకారము

యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి నా క్లయింటు భర్త కొండంగి కమల లోచన గారి ఆస్తియై యున్నది. సదరు కొండంగి కమల లోచన గారు షెడ్యూల్ దాఖలా ఇంటిలో నివసిస్తూ 2015వ సంవత్సరములో కాలము చేసినారు, దర్మిలా షెడ్యూల్ దాఖలా ఆస్తి నాక్లయింటుకు మరియు వారి సంతానమునకు దఖలు పడినది. సదరు షెడ్యూల్ దాఖలా ఆస్తికి సంబంధించి వరలక్ష్మి అను ఆమె నా క్లయింటుకు మరియు వారి సంతానముకు నష్టము కలిగించే ఉద్దేశ్యముతో కొన్ని క్రియచీటీలు మరియు యితర డాక్యుమెంట్లు తయారుచేయుటకు ప్రయత్నము చేయుచున్నారని మా క్లయింటుకు తెలియవచ్చినది. సదురు వరలక్ష్మీకి షెడ్యూలు దాఖలా ఆస్తి పై ఎటువంటి హక్కులు లేవని యిందుమూలంగా తెలియజేయడమైనది. సదరు వరలక్ష్మి గాని లేక ఇతరులు గాని ఎటువంటి డాక్యుమెంట్లు తయారు చేసిననూ, అవి నా క్లయింటుకు మరియు వారి సంతానమునకు వర్తించవు. సదరు నా క్లయింటుకు సంబంధించిన, షెడ్యూలు దాఖలా ఆస్తిపై వరలక్ష్మీ గాని మరియు యితరులలెవరైననూ ఎటువంటి క్రయ విక్రయాలు, తనఖాలు వగైరా చేసినచో నా క్లయింట్ జరిపే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, మందస మండలం, మందస గ్రామములో, 2వ వార్డు సాహుబ్రహ్మణ వీధి, దక్షిణ శ్రేణిలో గల సర్వే నెం. 168 తూ.ప 9 అడుగుల 8 ఇంచీల ఉ.ద. 83 అడుగులు విస్తీర్ణము గల స్థలంలో నిర్మించిన డాబా ఇంటికి హద్దులు

తూ. కామిని మహంతి గారి ఇల్లు. ప. సవర దండాసి గారి ఇల్లు
ఉ. వీధి (రాజమార్గం) ద. సాసుమాన వెంకటరావు వగైరాలు తా. యింటి పెరడ్లు

వంకాయల ధర్మారావు
న్యాయవాది,
తెలగ వీధి, సోంపేట-532 284, శ్రీకాకుళం జిల్లా

సోంపేట
తే. 1-1-2018

పాతపట్నం

దైనందిని ఆవిష్కరణ

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: మండలంలో యుటీఎఫ్, ఎపీటీఎఫ్(257) ఉపాధ్యాయ సంక్షేమ సంఘాలకు సంబదించి వార్షిక డైరీలు, క్యాలెండర్లను మండల విద్యాశాఖాధికారి ఎస్.దేవేంద్రరావు ఆవిష్కరించారు. సోమవారం ఆయా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆధ్వర్యంలో కార్యక్రమము చేపట్టారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పన

పాతపట్నం, న్యూస్‌టుడే : మండలంలోని నిరుద్యోగ గిరిజన మహిళలకు ఉపాధి కల్పనకు ఈ నెల 4వ తేదీన పాతపట్నం వైటీసీలో ఎంపికలను చేపడుతున్నట్లు శ్రీలక్ష్మి టెక్స్‌టైల్స్ సంస్థ సభ్యులు భాస్కరరావు తెలిపారు. ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో చేపట్టే ఈ ఎంపికలకు పాతపట్నం మండలానికి చెందిన మహిళలు మాత్రమే హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



పాతపట్నం : కొరసవాడ పాఠశాలలో ముగ్గుల పోటీలు



మెళియాపుట్టి : నాయకులకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు..



హిరమండలం ప్రభుత్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో కేకు కత్తిరిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలోనూ, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర ప్రారంభోత్సవ వేడుకలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, యువతీ, యువకులు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సందడిగా చేశారు.

ప్రభుత్వ కార్యాలయంలో..: డీసీసీబీ డైరెక్టర్ ఎం.శ్యాంసుందరరావు పాతపట్నం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తెదేపా నాయకులు పాల్గొని కేక్‌ను కత్తిరించి, శుభాకాంక్షలు తెలిపారు. పాతపట్నం పంచాయతీ కార్యాలయంలో పట్టణ కమిటీ అధ్యక్షులు పైల బాబ్జి ఆధ్వర్యంలో, తామర గ్రామంలో తెదేపా నాయకుడు మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఇందులో పలువురు యువకులకు వాలీబాల్ కిట్లు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సామాజిక ఆసుపత్రి సీహెచ్‌సీ ఛైర్‌పర్సన్ నల్లి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎల్ఎన్‌పేటలో ఎంపీడీవో సీహెచ్. మోహన్‌ప్రసాద్, తహసీల్దార్ బి.వెంకటరావులకు ఆయా కార్యాలయం ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలల్లో ... పాతపట్నంలోని కొరసవాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. నూతన సంవత్సర అక్షరాలతో వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. రొంపివలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పలు సినీ గేయాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. హిరమండలం ప్రభుత్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో కె.రాంబాబు, ప్రధానోపాధ్యాయులు కె.సింహాచలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కేకు కత్తిరించి వేడుకలు నిర్వహించారు. కిట్టాలపాడు ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయులు కేకుకత్తిరించి నూతన సంవత్సర వేడుకలు జరిపారు. ఎల్ఎన్‌పేటలో ఎంఈవో శ్రీనివాసరావుకు యూటీఎఫ్, పీఆర్టీయూ, ఎస్టీయూ తదితర సంఘాల ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

శుభాకాంక్షల సందడి : తెదేపా నాయకులు బూర్లె శ్రీనివాసరావు, సర్పంచి టి. కృష్ణమోహన్‌ల ఆధ్వర్యంలో కొత్తూరు మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన నిర్వాసితులు జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ కూన రవికుమార్, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే కలమట వెంకటరమణల్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పాతపట్నం శాసనసభ్యులు కలమట వెంకటరమణమూర్తి, మంత్రి అచ్చెన్నాయుడుకు పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. మెళియాపుట్టిలో మండల పరిషత్తు అధ్యక్షులు సలాన రాజశ్వేరీ, మోహనరావు, తెదేపా మండల పార్టీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మాడుగుల రామారావు ఇంట సందడి నెలకొంది. కేక్‌లు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఎల్ఎన్‌పేటలో ఎంపీపీ ఒమ్మి కృష్ణవేణి, జడ్పీటీసీ సభ్యురాలు వెలమల సుగుణతోపాటు మండల పార్టీ అధ్యక్షులు శివ్వాల కిషోర్‌బాబుతోపాటు సర్పంచులు, మాజీ సర్పంచులు పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మాతలలో...2018 సంవత్సరంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని మాతల గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. నియోజకవవర్గంలోని కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లోని నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, అధికారులు మాతలకు తరలి వచ్చి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

: మండల కేంద్రమైన కొత్తూరుతోపాటు, పారాపురం, కర్లెమ్మ, నివగాం, బలద, మాకవరం, మెట్టూరు, లబ్బ, దిమిలి గ్రామాల్లో క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ఆంగ్ల సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నివగాం పాదర్లు రాధారాణి, శంకరరావుల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



మాతలలో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు



ఎల్ఎన్‌పేట: జడ్పీటీసీ వెలమల సుగుణకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజలు



కొత్తూరు : నివగాం చర్చిలో ప్రార్థనలు

పంచాయతీ కార్యాలయం మార్పు

హిరమండలం, న్యూస్‌టుడే : హిరమండలం మేజరు పంచాయతీ కార్యాలయం మార్పు చేసినట్లు (వేరేచోటకు తరలించినట్లు) పంచాయతీ ఈవో కె.సత్యం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వంశధార జలాశయం భూసేకరణలో కార్యాలయం భవనం తొలగించడంతో తాత్కాలికంగా పాతహిరమండలం ఎంపీపీఎస్-1 పాఠశాల ఆవరణలో (అలికాం-బత్తిలి రహదారి పక్కన) ఒక భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీ ప్రజలు ఈమార్పును గమనించాలని కోరారు.

కూరగాయల ధరలు

పాతపట్నం, న్యూస్‌టుడే : పాతపట్నం పట్టణ కేంద్రంలో కూరగాయల ధరలు విడి అమ్మకాలు నిన్నటికి కేజీ రూపాయల్లో ఇలా ఉన్నాయి. క్యాబేజి 25, వంకాయ 30, టమాట 15, దొండ 25, ఉల్లి 45, బంగాళదుంపలు 10, పచ్చిమిర్చి 40, అల్లం 50, తెల్ల ఉల్లి 50, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యారట్ 50, ఆనప 15, అరటి కాయలు (3 పెద్దవి) 20, కాకరకాయలు 40, బెండ 40, క్యాప్సికం 60, ముల్లంగి 20, మునగ 100, గోరు చిక్కుడు 40, పందిరిచిక్కుడు 50, బీన్స్ పిక్కలు 60.

తెరపై ఈనాడు

- **పాతపట్నం :** ఉమామహల్ : **ఒక్క క్షణం**
- **హిరమండలం :** వరలక్ష్మి : **హలో**

కొత్త పంచాయతీలకు గిరిజనుల డిమాండు..

హిరమండలం, న్యూస్‌టుడే : నిర్వాసిత గ్రామ పంచాయతీలకు అనుబంధ గ్రామాలుగా ఉన్న కొన్ని గిరిజన గ్రామాలు జలాశయానికి దూరంగా ఉండడంతో భూసేకరణ జరగలేదు. గార్లపాడు పంచాయతీలో మర్రిగూడ, పుట్టిగాం, జిలకర్రగూడ, అంతిలితో పాటు మొత్తం 9 గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఇదే విధంగా పాడలి పంచాయతీలో కొండూరు ముఠా పేరుతో పిలవబడే 11గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల వారు తమకు ప్రత్యేక గిరిజన పంచాయతీలుగా గుర్తించాలని కొన్నేళ్లుగా అధికారులను కోరుతున్నారు. పంచాయతీ ఏర్పాటు విషయమై కోర్టును కూడా ఆశ్రయించారు.పాడలి పంచాయతీలోని మరో గిరిజన గ్రామం దబ్బగూడకు చెందిన గిరిజనులు తమను మర్రిగూడ పంచాయతీగా ఏర్పాటు చేసి ఆపంచాయతీలో కలపాలని లేదా తమను నిర్వాసిత గ్రామంగా గుర్తించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రహదారి అభివృద్ధితో తీరిన కష్టాలు



చొర్లంగి వద్ద నిర్మిస్తున్న కల్వర్టు



నవతల వద్ద వెడల్పు పెరిగిన రహదారి

పాతపట్నం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ప్రధానమైన హిరమండలం నవతల రహదారి అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఈ రహదారిపై విపరీతంగా రద్దీ పెరిగింది. శివారు మండలాల ప్రజలు డివిజన్ కేంద్రానికి వెళ్లేందుకు ఇదే మార్గం. అలాగే పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట, హిరమండలం మండలాలకు చెందిన ప్రజలు ఈ రహదారిని విరివిగా వినియోగిస్తారు. సింగిల్ రహదారి కావడంతో భారీ వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఉంది. ఇటీవల గొట్ట నుంచి నవతల గ్రామం వరకు వెడల్పు పనులు చేపట్టారు.

నేడు హిరమండలంలో గ్రామ సభ

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం మేజరు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు సర్పంచి అందవరం సూర్యకుమారి అధ్యక్షతన చట్టబద్ధమైన గ్రామ సభ నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో కె.సత్యం తెలిపారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రజలు హాజరు కావాలన్నారు.

పేద కుటుంబాలకు జనసేన సాయం

పారాపురం (కొత్తూరు), న్యూస్‌టుడే : జనసేన పార్టీ సేవాదళ్ సమన్వయకర్త పేడాడ రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో కార్యకర్తలు సోమవారం పారాపురం గ్రామానికి చెందిన బాధితురాలు యండ పారమ్మ, పేద మహిళ ఎండ ముత్యాలమ్మలకు 25 కిలోలు చొప్పున బియ్యం, నిత్యవసర సరకులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎ. అశోక్, పి. చక్రధర్, జితేంద్ర, నరిసింహ తదితరులు పాల్గొన్నారు.



పారాపురంలో బియ్యం అందిస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

చంద్రన్న సంచార వైద్య సమాచారం

కొత్తూరు, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట మండలంలోని కరకవలస, కొమ్ముపలస గ్రామాల్లో, పాతపట్నం మండలంలోని లాబర, సింగుపురం గ్రామాల్లో మంగళవారం చంద్రన్న సంచార వైద్య వాహనం అందుబాటులో ఉంటుంది. గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

పాతపట్నం



ప్రజా సమస్యలకు పెద్దపీట

గ్రామీణుల్లో అవగాహన కోసం నేటి నుంచి జన్మభూమి



కొత్తూరు మండలంలో జన్మభూమి గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం(దాచిన చిత్రం)

కొత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఐదో విడత జన్మభూమి -మాఊరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 2వ తేదీ మంగళవారం నుంచి 11వ తేదీ వరకూ అధికారులు గ్రామాల్లో తిరిగి వారి సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయనున్నారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నియోజకవర్గ బాధ్యులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోనికి బలంగా తీసుకువెళ్లాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇంకా గ్రామాల్లో అర్హత ఉండి పింఛన్లు, రేషనుకార్డులు, ఇళ్లు ఇలా వ్యక్తిగత అవసరాలన్నింటినీ పరిష్కరించేందుకు జన్మభూమిని చక్కటి వేదికగా ఉపయోగించుకోవచ్చు. మండల కేంద్రాలకు వెళ్లి అధికారుల కోసం నిరీక్షించాల్సిన పనిలేకుండా అధికారులే గ్రామానికి వచ్చి సమస్యలు తెలుసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి హామీ వేతనదాలు, ఇంకుడు గుంతుల, వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు కొంత వరకూ పరిష్కారం జరిగినా ఇంకా ప్రజల నుంచి వినతులు అందే అవకాశం ఉంది. గ్రామసభలు సజావుగా జరిగేందుకు ఐదు మండలాల్లో అన్ని ఏర్పాట్లును పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

వీటిపై చర్చ

గ్రామపంచాయతీల్లో జరగనున్న జన్మభూమి గ్రామసభల్లో చర్చించాల్సిన అంశాలను అధికారులు నిర్ణయించారు.

★ చంద్రన్న బాట ★ గ్రామీణ రహదారులు
★ త్రాగునీరు ★ మురుగునీటి పారుదలవ్యవస్థ
★ ఎల్ఈడీ దీపాలు: చంద్రకాంతులు
★ చెత్తనుంచి సంపద కేంద్రాలు
★ స్వర్గధామాలకు రహదారులు ★ నీటిబడ్జెట్
★ నీటిసంరక్షణ నిర్మాణాలు ★ పంటసంజీవిని
★ నీటి ఎద్దడిలేని గ్రామాలుగా మార్చడం
★ గ్రీనింగ్ హిల్స్ ★ పండ్లతోటల పెంపకం
★ గ్రామపంచాయతీ భవననిర్మాణాలు, నూతన అంగన్‌వాడీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు మరుగుదొడ్లు, పాఠశాలల్లో క్రీడామైదానాలు, ఊరూరా ఉద్యానవనాలు-విలేజిపార్కు, చెరువులు మరమ్మతులు, పూడికతీతలుతీయడం, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు గిడ్డంగులను నిర్మించుకోవడం.

ప్రగతికి పది నక్షత్రాలు

పల్లెప్రగతికి పది నక్షత్రాలు పేరిట ప్రభుత్వం గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలికసదుపాయాల కల్పనకు చర్యలను జన్మభూమి గ్రామసభల్లో చర్చించనున్నారు. పదిలో గ్రామపంచాయతీలు సాధించిన వాటికి మార్కులు కేటాయిస్తారు.

★ ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి
★ ప్రతీ ఇంటికి విద్యుత్తు కనెక్షన్
★ ప్రతీ ఇంటికీ గ్యాస్ కనెక్షన్
★ ప్రతీ ఇంటికీ ప్రైవేటు కుళాయి కనెక్షన్
★ చెత్త నుంచి సంపద కేంద్రం
★ రహదారి సౌకర్యం
★ ఫైబర్ నెట్ కనెక్షన్
★ ప్రతీ కుటుంబానికిరూ. పదివేలు ఆదాయం
★ అందరికీ విద్య
★ అందరికీ ఆరోగ్యం

నేటి జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు..

కొత్తూరు, న్యూస్‌టుడే : మండలంలోని బలద, కడుము, మెట్టూరు గ్రామాల్లో సోమవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.


మెళియాపుట్టి, న్యూస్‌టుడే : మండలంలోని గొప్పిలి, గోకర్ణపురం, కరజాడ, సంతలక్ష్మీపురం గ్రామ పంచాయతీలలో మంగళవారం ఎంపీడీవో, తహసీల్దార్ బృందాల ఆధ్వర్యంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో (ఇన్‌ఛార్జి) నర్సింహ ప్రసాద్ పండా పేర్కొన్నారు. పంచాయతీలలో సమస్య పరిష్కరించేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని కరకవలస, పెద్దకొల్లివలస గ్రామాల్లో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్. మోహన్‌ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఇదీ పరిస్థితి

అన్ని పంచాయతీలను చుట్టేలా అధికారులు ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రతి మండలానికి ప్రత్యేకాధికారిణి ప్రభుత్వం నియమించింది. వీరి ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీవోలు బృందాలకు నేతృత్వం వహిస్తూ గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వం జనాభా ప్రతిపదికన పింఛన్లు, రేషనుకార్డులు, ఇళ్లు మంజూరు చేసింది. గతంలో వివిధ సందర్భాల్లో ఇచ్చిన వినతులను క్రోడీకరించి మంజూరులు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు మేరకు సంక్రాంతికి ముందు పండగలా జన్మభూమిని నిర్వహించాలని, ప్రతి గ్రామంలో పది రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో తొలిరోజు మంగళవారం ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పాల్గొంటారు.

అన్ని ఏర్పాటు పూర్తి



మండలంలో ఐదో విడత జన్మభూమి గ్రామసభలు నిర్వహణలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తాను, తహసీల్దారు బృంద నాయకులు మండల స్థాయి అధికారుల్ని రెండు బృందాలుగా వేసి గ్రామసభలు నిర్వహిస్తాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

-పి. రాజేశ్వరరావు, ఎంపీడీవో, కొత్తూరు

బాధ్యతాయుతంగా సేవలు అందజేయండి



హిరమండలంలో ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న జి.ప్రశాంత్

హిరమండలం, న్యూస్‌టుడే : ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలు అందజేయాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జి. ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కొత్త సంవత్సర ప్రారంభం సందర్భంగా ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా కృషి చేయాలన్నారు. పాత సంవత్సరంలో సాధించిన విజయాలు, లోపలపై చర్చించారు. ఈ ఏడాదిలో చేపట్టాల్సి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎం. రాజేష్, ఎస్ పవన్, నీలిమ, ఆసుపత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్తూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర సరిహద్దు, మారుమూల ప్రాంతం కావడంతో వైద్యాధికారులు, సిబ్బంది మరింత కష్టపడి పనిచేయాలని ఆసుపత్రి కమిటీ అధ్యక్షులు పొత్రకొండ మోహనరావు పేర్కొన్నారు. స్థానిక సామాజిక ఆసుపత్రి ప్రాంగణంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన వైద్యాధికారి డా. కిషోర్, ఇతర వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జన్మభూమి గ్రామసభల్లో తోటపల్లి తీర్మానం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే : జన్మభూమి గ్రామసభల్లో తోటపల్లి ఆధునికీకరణ చేపట్టాలంటూ తీర్మానాలు చేసేందుకు అంతాసమాయత్తం కావాలని తోటపల్లి కాలువల ఆధునికీకరణ సాధనాసమితి బాధ్యులు బుడితి అప్పలనాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆసంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రైతుల ప్రయోజనార్థం పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికితీసుకువెళ్లి రైతులకు సత్వర న్యాయం జరగాలంటే ఇదొక్కటే సరైన మార్గమన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. ఆ సంఘ నాయకులు లక్ష్మినారాయణ, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

షెడ్లు నిర్మించండి....



ఎల్ఎన్‌పేటలో ఎండలో ఉన్న సైకిళ్లు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని ఎల్ఎన్‌పేట, కరకవలస, కొమ్ముపలస, రావిచెంద్రి, పూశాం జడ్పీ ఉన్నత పాఠశాల్లో చదువుకుంటున్న 360 మంది బాలికలకు ప్రభుత్వం సైకిళ్లు అందజేసింది. అయితే సైకిళ్లు ఆరుబయట పెట్టడం వల్ల మరమ్మతులకు గురువుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు. ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ పాడవుతున్నాయని వాపోతున్నారు. పాఠశాల ఆవరణలో షెడ్లు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

మాకవరం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

మాకవరం (కొత్తూరు), న్యూస్‌టుడే : మండలంలోని మాకవరం పంచాయతీని మరింత అభివృద్ధి చేస్తామని పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకటరమణ హామీ ఇచ్చారు. మండలంలోని మాకవరం గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన సామాజిక భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తాగునీరు, రహదారులు, ఇతర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు మాతల గాంధీ, ఆసుపత్రి కమిటీ అధ్యక్షులు పి. మోహనరావు, సర్పంచి, ఎంపీటీసీలు పొత్రకొండ శ్రీలత, ముగితి జ్యోతి, పార్టీ నాయకులు ముగితి నారాయణరావు, పొత్రకొండ భీమరాజు, కొమరాపు వెంకట్రావు, నెళ్లి అచ్చుతరావు, ఆసూరి ఆనందరావు, కెళ్ల యాధవరాజు, శ్రీనిబాబు, ఎస్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడా సామగ్రి అందజేత



యువతకు వాలీబాల్ క్రీడా పరికరాలు అందజేస్తున్న తంగి రమేష్, తదితరులు

హిరమండలం, న్యూస్‌టుడే : యువతను ప్రోత్సహించేందుకు క్రీడా పరికరాలు అందజేసినట్లు వైకాపా బీసీ సెల్ అధ్యక్షుడు తంగి రమేష్ అన్నారు. సోమవారం అంబావల్లి, రెల్లివలస గ్రామాల్లో యువతకు క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్‌లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో జి. రామారావు, ఎస్. సన్యాసిరావు, తదితరులు ఉన్నారు.

దట్టంగా పొగమంచు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే : మండలంలో వారం రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు కురవటంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పొగ మంచు వల్ల మామిడి, జీడి పూతకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. అలాగే అపరాల పంటకు కూడా నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తురకపేట వద్ద దట్టంగా కురుస్తున్న పొగమంచు

సీతంపేటలో గిరిజన దర్బార్

సీతంపేట, న్యూస్‌టుడే : సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం పీవో ఎల్. శివశంకర్ ఆధ్వర్యంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు హాజరై తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందజేశారు. పనుకువలసకు చెందిన లక్ష్మీకాంతం ఇళ్లు మంజూరు చేయాలని, పెదరామకు చెందిన మదన్‌మోహన్ వైద్య ఖర్చులు మంజూరు చేయాలని, బెన్నడుగూడకు చెందిన మంగయ్య ఏదైనా రుణం మంజూరు చేయాలని, దొండమానుగూడకు చెందిన సంజీవరావు కొండపోడు పట్టా మంజూరు చేయాలని కోరారు. దర్బార్‌లో డీడీ పి. సీతారామయ్య, డిప్యూటీ డీఈవో గున్ను రామ్మోహనరావు, ఎల్. ఆనందరావు, ఏపీడీలు లక్ష్మి, రమణమ్మ, ఏటీడబ్ల్యూవోలు, డీఈఈ ఉన్నారు.

కొనసాగుతున్న పోరాటం

వాల్తేరు, (సంతకవిటి), న్యూస్‌టుడే : నాగావళి నదిపై వాల్తేరు - ఇసుకలపేట గ్రామాల మధ్య వంతెన నిర్మించాలంటూ వంతెన పోరాటకమిటీ చేస్తున్న రిలేనిరాహార దీక్షలు 317 రోజుకు చేరాయి. సోమవారం వంతెన పోరాటకమిటీ కన్వీనర్ జి.నారాయణస్వామి ఆధ్వర్యంలో సభ్యులు రిలేనిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ దీక్షలో వంతెన పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజాం

సంగమేశ్వరుడికి అభిషేకాలు

సంగాం (వంగర), న్యూస్‌టుడే : సంగమేశ్వరాలయంలోని సంగమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు గణపతి, కనకలింగం తెలిపారు. సోమవారం ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కోలాహలంగా కొత్త సంవత్సర వేడుకలు



కేకు కోస్తున్న మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి

న్యూస్‌టుడే- రాజాం

నూతన సంవత్సర వేడుకలు అట్టహాసంగా జరిగాయి. రాజాం పట్టణంలోని ఎమ్మెల్యే కంబాల జోగులు తన క్యాంపు కార్యాలయంలో ఉండడంతో వైకాపా నాయకులు, అధికారులు, ప్రజలు భారీగా తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందించారు. పలువురు ఎమ్మెల్యేను సన్మానం చేశారు. ఎమ్మెల్యే కూడా అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందులో పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

★ మాజీ స్పీకర్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కావలి ప్రతిభాభారతి, రాజాం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, తెదేపా రాజాం పట్టణ అధ్యక్షురాలు కావలి గ్రీష్మప్రసాద్‌కు పలువురు అధికారులు, వైద్యులు, నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచిలు, ఎంపీటీసీలు ఇలా అన్ని వర్గాల వారు తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఉదయం రాజాంలోని ఆమె స్వగృహానికి వీరంతా

నాయకులకు శుభాకాంక్షల వెల్లువ

తరలి వచ్చారు. ఆమె కూడా అందరికీ నూనత సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

★ ఎంపీపీ జడ్డు ఉషారాణి, పొగిరి సర్పించి జడ్డు విష్ణుమూర్తిలకు అధికారులు, తెదేపా శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పొగిరిలోని వారి సృగృహానికి వీరంతా తరలి వచ్చారు.

★ జెడ్పీటీసీ టంకాల పాపినాయుడుకు పలువురు అధికారులు, నాయకులు, వైకాపా శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే కంబాల జోగులును సన్మానిస్తున్న నాయకులు



ఎంపీపీ జడ్డు ఉషారాణి, విష్ణుమూర్తిలకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



జెడ్పీటీసీ సభ్యుడు టంకాల పాపినాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



రామకృష్ణంనాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

అభివృద్ధికి సహకరించాలి

రేగిడి, న్యూస్‌టుడే: కొత్త ఏడాదిలో అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని రేగిడి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కిమిడి రామకృష్ణంనాయుడు , మండల తెదేపా అధ్యక్షుడు వినయ్‌కుమార్ అన్నారు. 2018లో అంతా కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధిని సాధిద్దామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా రేగిడిలో మండలస్థాయి నాయకులు. సర్పంచులు , ఎంపీటీసీలు, అధికారులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



తహశీల్దార్ సురేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వీఆర్‌ఏల సంఘ నేతలు

గ్రామాల్లో..

సంతకవిటి, న్యూస్‌టుడే:నూతన ఏడాది వేడుకలను సోమవారం సంతకవిటి మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నా, పెద్దా అంతా కలిసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకొని మిఠాయిలు పంచుకున్నారు. సంతకవిటి తహశీల్దార్ గార సురేష్‌కు వీఆర్‌ఏ సంఘ నేతలు నూతన ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో వేణుగోపాలనాయుడికి సిబ్బంది, ఎంఈవో బి.శాంతికుమారికి ఉపాధ్యాయులు, సంతకవిటి ఎస్సై చిరంజీవికి పోలీసులు , సంతకవిటి, మండవకురిటి వైద్యాధికారులు జి.భార్గవి, ఎ.భార్గవిలకు సిబ్బంది మిఠాయిలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చర్చిలో కేకు కోశారు.

వేడుకలకు దూరం: సంతకవిటి మండలంలోని తెదేపా, వైకాపా నేతలు కొత్త సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నారు. సంతకవిటి మండలంలో ఆర్థిన మోసానికి గురైతమ నాయకుడు దాసరి కన్నంనాయుడు మృతికి సంతాపంగా వైకాపా నేతలు నూతన ఏడాది వేడుకలు జరుపుకోలేదు. ఆర్థిక మోసానికి గురై ప్రజలు మోసపోయినందున తెదేపా నేతలు వేడుకలు చేసుకోలేదు.



చర్చిలో కేకు కోస్తున్న దృశ్యం

మందరాడలో..

సంతకవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.కృష్ణారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శేషాద్రిపురం సంతోషి పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ తమ్మినేని సింహాచలం ఆధ్వర్యంలో కేకు కోశారు. మండలంలో జి.ఎస్.పురం, మండాకురిటి, మామిడిపల్లి, సిరిపురం, బొద్దూరు ఉన్నత పాఠశాలలతోపాటు వసతిగృహాల్లో వేడుకలు జరుపుకున్నారు.



శేషాద్రిపురంలో..



మందరాడ ఉన్నత పాఠశాలలో..

ప్రార్థన మందిరంలో..

రాజాం, న్యూస్‌టుడే: రాజాం నగరపంచాయతీ పరిధిలోని గాయత్రీ కాలనీలో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు ఆదివారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. హోటీబేతస్థ ప్రార్థన మందిరంలో ఈవేడుకలు కొనసాగించారు. ఇందులో సిస్టర్ విజయ, బ్రదర్ రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కళాను కలిసిన కలెక్టర్ ధనంజయరెడ్డి, జేసీ చక్రధర్‌బాబు

వంగరలో

వంగర, న్యూస్‌టుడే : సోమవారం వంగర జడ్పీటీసీ సభ్యులు బొత్స వాసుదేవరావునాయుడు ఇంటి వద్ద అభిమానులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రుషింగిలో ఎంపీపీ యలకల అమ్మడమ్మకు, మద్దివలసలో వైకాపా నాయకులు ఉత్తరావిల్లి సురేష్‌ముఖర్జీ, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఉత్తరావిల్లి సరోజనమ్మలకు సర్పంచులు , ఎంపీటీసీలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యులు పాలవలస రాజశేఖర్ జన్మదినం సందర్భంగా మద్దివలసలోని వైకాపా అభిమానులంతా కేకు కోశారు.



వంగరలో జడ్పీటీసీ వాసుదేవరావునాయుడికి శుభాకాంక్షలు తెలుపుతూ



మద్దివలసలో సురేష్‌ముఖర్జీకి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

కళా ఇంట జనప్రభంజనం

వేలాదిగా తరలి వచ్చిన శ్రేణులు

న్యూస్‌టుడే- రాజాం

రాష్ట్ర ఇంధనశాఖా మంత్రి కిమిడి కళావెంకటరావు ఇల్లు సోమవారం జన సంద్రమైంది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు భారీగా అధికారులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు రాజాం తరలి వచ్చారు. సోమవారం ఉదయం నుంచి జనం బారులు తీరారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జిల్లా సంయుక్త పాలనాధికారి కేవీఎన్ చక్రధర్‌బాబు, ఎస్పీ సీఎం త్రివిక్రమవర్మ, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు బి.రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి సాయిరాం, డ్వామా పీడీ హనమంతు కూర్మారావు, డీఆర్‌డీఏ పీడీ జి.కిషోర్‌కుమార్, ఏజేసీ రజనీకాంతరావు, తదితర అధికారులతోపాటు జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు భారీగా తరలి వచ్చారు. జనాన్ని అదుపు చేయడం పోలీసులకు తలకు మించిన భారంగా పరిణమించింది. క్యాంపు కార్యాలయంలో మొదటి సందర్శకులను కలవగా, ఒక్కసారికి సంఖ్య పెరగడం వేలాదిగా తరలి రావడంతో బారికేడ్లు ఏర్పాటు చేసి వరుస పద్ధతిలో విడిచిపెట్టారు. అందరూ మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి కళావెంకటరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

రాజాం

నేడు నాలుగు పంచాయతీల్లో జన్మభూమి మాఊరు

సంతకవిటి, న్యూస్‌టుడే :జన్మభూమి మాఊరు గ్రామ సభలు మంగళవారం సంతకవిటి మండలంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో జి.వేణుగోపాలనాయుడు తెలిపారు. మొదటిరోజైన మంగళవారం తలతంపరం, బిల్లాణి, జీఎస్‌పురం, తాలాడ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోవటంతో పాటు, గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాలు అమలుపైన తెలుసుకోనున్నట్లు తెలిపారు. ప్రజలు గ్రామ సభల్లో తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్థికపరమైన దరఖాస్తులు వస్తే ఏ రోజు వచ్చే దరఖాస్తులు ఆరోజే అంతర్జాలంలో నమోదుచేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అధికారులంతా పూర్తిసమాచారంతో గ్రామసభలకు హాజరుకావాలన్నారు.

వంగర, న్యూస్‌టుడే : వంగరలో కొండచాకరాపల్లి, కొప్పరవలస , వి.వి.పేట, రాజులగుమడ పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపారు.

రాజాంలో సినిమాలు

సీతారామా: హలో సీతారామా(మినీ): ఒక్క క్షణం
అప్సర: ఎం.సి.ఎ

-న్యూస్‌టుడే- రాజాం

ముందు చూపుతో ముందడుగేయాలి!!

- 80 అడుగుల మేర రహదారి విస్తరణ
- కనీసం మరో అయిదు అడుగులు వెనక్కి తగ్గితే మేలు
- రహదారి ప్రణాళికపై అధికారుల మనోగతం
- లేదంటే దుకాణాలన్నీ మళ్లీ రహదారిపైనే



చదును చేయాల్సిన రహదారి

న్యూస్‌టుడే- రాజాం

రహదారులను 80 అడుగుల మేర విస్తరిస్తారు. ఈమేరకు భవనాలు తొలగించాలని అధికారులు సూచించారు. ఈమేరకు భవనాల తొలగింపు దాదాపు తుది దశకు చేరుకుంది.

రహదారికి కాస్త వెనక్కి తగ్గితేనే

ఇప్పుడున్న రహదారి మధ్య నుంచి ఇరువైపులా 40 అడుగుల మేర హద్దులు నిర్ణయించి భవనాలు తొలగిస్తున్నారు. ఇందుకు భవన యజమానులు సహకరించి తొలగించారు. అయితే భవనం వరకు కాలువలు రానున్నాయి. అంటే రహదారి నిర్మాణం పూర్తయ్యాక భవనంలోకి అడుగు పెట్టాలంటే కాలువే హద్దు అవుతుంది. కాలువపై నుంచి ఫుట్‌పాత్‌లు (నడకదారి) ఏర్పాటు చేసే అవకాశం ఉండడంతో కాలువకు కనీసం అయిదు అడుగులు అయినా వెనక్కి వెళ్లి కొత్తగా నిర్మాణాలు చేసుకుంటే పార్కింగ్‌కు ఇబ్బందులు ఉండవని, రహదారిపై వాహనాలు నిలిపే పరిస్థితి లేకుండా ఉంటుందని అధికారులు అంటున్నారు. ఇలా కాకుండా 40 అడుగుల మేరకే భవనాలు తొలగించి నిర్మాణాలు చేపడితే మున్ముందు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుందంటున్నారు.

అయితే రహదారి విస్తరణ మేరకే భవనాలు తొలగిస్తే.. ప్రయోజనం లేదు. కనీసం మరో అయిదు అడుగులు అయినా వెనక్కి తగ్గాలి. అప్పుడే సార్థకత ఉంటుంది. లేదంటే రహదారులపైనే షాపులున్నట్లు కనిపిస్తాయని అధికారులు అంటున్నారు. దీనిపై భవన యజమానుదారుల్లో అవగాహన లేకపోవడంతో హద్దుల మేర తొలగించి ఊరుకుండిపోతున్నారు. తరువాత ఇది కొత్త చిక్కులు తెచ్చే అవకాశం ఉందంటున్నారు.

రాజాం పట్టణ ప్రధాన రహదరాఇలో పట్టణ ప్రణాళిక దాదాపుగా ఖరారు చేశారు! 80 అడుగుల మేర రహదారి ఉండేలా చర్యలు చేపట్టారు. ఈ హద్దుల్లో రహదారికి ఇరువైపులా భారీ కాలువలు వస్తాయి నాలుగు వరుసల్లో రహదారి ఉంటుంది. మధ్యలో డివైడరు ఏర్పాటు చేసి అందమైన పచ్చదనం పెంచుతారు. ఇది ఇప్పటి వరకు అధికారుల వద్ద ఉన్న ప్రణాళికలో ముఖ్య అంశాలు! ప్రధాన రహదారిలో 169 మందికి రూ.3.89 కోట్లు మేర పరిహారం పంపిణీ చేయాల్సి ఉండగా, 150 మందికిపైగా పరిహారం పంపిణీ చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే దాదాపు నిర్మాణాలన్నీ హద్దుల మేర భవన యజమానులే స్వచ్ఛందంగా తొలగించి అధికారులకు సహకరిస్తున్నారు. ఇకిప్పుడు ఇరుకుగా ఉన్న రహదారి భవనాల తొలగింపు అనంతరం సువిశాలంగా, పట్టణ రూపే మారినట్లుగా కనబడుతోంది. రహదారి నిర్మాణం పూర్తయితే పట్టణం సుదరంగా తయారవుతుందన్న అంచనాలు ప్రజల్లో నెలకొన్నాయి.

శిథిలాలు తొలగించాలి

భవనాలు కూల్చివేత దాదాపు కొలిక్కి వచ్చిన నేపథ్యంలో శిథిలాలు పెద్ద సమస్యగా మారింది. వీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాల్సిన అవసరం ఉంది. శిథిలాలు తొలగించి రహదారి మొత్తాన్ని ఒకే ఎత్తులో చదును చేయాలి. ఇలా అయితేనే తరువాత ప్రక్రియ ప్రారంభించేందుకు వీలవుతుంది. నగరపంచాయతీ వద్ద అంత యాంత్రీకరణ లేకపోవడంతో గుత్తేదారుకు బాధ్యత అప్పగించాల్సి వస్తోంది. భారీ ఎత్తున జేసీబీలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేస్తే తప్ప శిథిలాలు తొలగించే పరిస్థితి కనిపించడం లేదని భవన యజమానులు అంటున్నారు. అధికారులు ఈదిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



తొలగించాల్సిన శిథిలాలు

చర్యలు తీసుకుంటున్నాం

యుద్ధ ప్రాతిపదికన శిథిలాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే చాలా వరకు శిథిలాలు తొలగించాం. 80 అడుగుల్లో కూల్చిన భవనాల శిథిలాలన్నీ తొలగిస్తాం. భవన యజమానులపై ఎలాంటి భారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే భవనాల కూల్చివేత దాదాపు కొలిక్కి వచ్చింది. నాలుగైదు భవనాలపైనే ప్రత్యేకంగా దృష్టి సారించాం. వాటిని కూల్చే చర్యలు తీసుకుంటున్నాం.

జి.సురేష్, కమిషనర్, రాజాం నగరపంచాయతీ

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఆంగ్ల పుస్తకాన్ని ఆవిష్కరణ చేస్తున్న ఉపాధ్యాయులు

సంతకవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : ఆంగ్ల పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జి.ఎస్.పురం స్కూల్ కాంప్లెక్సు ఛైర్మన్ శ్రీరామ్మూర్తి అన్నారు. సోమవారం మందరాడ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు అదపాక దామోదరరావు పేద విద్యార్థుల కోసం తయారుచేసిన ఆంగ్ల పుస్తకానికి సంబంధించిన పుస్తకాలను సంతకవిటి ఎం.ఆర్.సీ కార్యాలయంలో ఆవిష్కరించారు. పదో తరగతి పరీక్షలకు 60 రోజులు ఉన్నందున విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికతో చదివి ఆంగ్లంపై పట్టు సాధించి మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుప్రకాష్ , అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేవు..పనులు కానరావు!



రాజాం నగరపంచాయతీ పరిధిలోని డోలపేట ప్రధాన రహదారి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. రూ.40 లక్షలతో పనులు చేపడతామని గతంలో అధికారులు ప్రకటించారు. డోలపేట తనిఖీ కేంద్రం నుంచి జీఎమ్మార్ వరలక్ష్మి కేర్ ఆసుపత్రి రహదారి కూడలి వరకు ఈ పనులు కొనసాగుతాయని చెప్పారు. రూ.10 లక్షలు కేటాయించి కొంత వరకు పనులు చేసి నిలిపేశారు. మిగిలిన పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని, తక్షణం పనులు పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రహదారి పూర్తిగా గోతుల మయంగా మారింది. రాళ్లు తేలిపోయాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే- రాజాం

తలతంపరలో తాగునీటికి కటకట



తలతంపరంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తలతంపరం, (సంతకవిటి), న్యూస్‌టుడే: సంతకవిటి మండలం తలతంపరం గ్రామంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని సంతకవిటి, రాజాం, రేగిడి మండలాల్లోని పంచాయతీలకు తాగునీరు అందించేందుకు రూ.49.9 కోట్లతో ఏర్పాటు చేసిన సమగ్రరక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామానికి తాగునీరు అందుతోంది. ఒకే కుళాయి ద్వారా వస్తున్న తాగునీటిపైనే గ్రామస్థులంతా ఆధారపడుతున్నారు. కుళాయి ద్వారా అరకొరగా తాగునీరు వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. మంగళవారం నిర్వహించనున్న జన్మభూమి మాఊరు గ్రామ సభల్లో సమస్యను అధికారుల దృష్టికి తీసుకురానున్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు. తాగునీటి సమస్యలు తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

భగవద్గీత నగర సంకీర్తన

రాజాం, న్యూస్‌టుడే : పాశ్చత్య సంస్కృతి నుంచి యువతను బయట పడేసేందుకు, వారిలో అవగాహన కల్పించేందుకు భగవద్గీత పారాయణంతో నగర సంకీర్తన సోమవారం నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సంకీర్తన నిర్వహించారు. ఇందులో వికాసతరంగిణి అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి, సుజ్ఞాన సేవా సమాజం అధ్యక్షుడు టంకాల సన్యాసినాయుడు, దొంతంశెట్టి శ్రీదేవి, గడే అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వికాసతరంగిణి ప్రతినిధులు

భక్తి భావాలే ముక్తికి మార్గాలు

వి.వి.ఆర్.పేట (వంగర), న్యూస్‌టుడే : భక్తిభావాలే.. ముక్తికి మార్గాలని గీతా భక్తులు మిరియాల సింహాచలం, పైడిపినాయుడులు అన్నారు. సోమవారం మండల పరిధి వి.వి.ఆర్.పేట గీతామందిరంలో పూజలు నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కిమిడి కళావెంకటరావు

కాలమానిని ఆవిష్కరణ

రాజాం, న్యూస్‌టుడే: మంత్రి కిమిడి కళావెంకటరావు చేతుల మీదుగా తెదేపా నాయకులు ముద్రించిన క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. చేపట్టిన అభివృద్ధి పనులు, ఇతర వాటిని ఇందులో పొందుపర్చారు.

ధాన్యం..దైన్యం

రాజాం, న్యూస్‌టుడే: ధాన్యం తరలిపోతున్నాయి. ఇతర జిల్లాలకు చెందిన ప్రైవేటు వ్యాపారులు రాజాం నియోజకవర్గంలో భారీగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో భారీగా కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేసి తరలించుకుపోతున్నారు. ఒక్కో చోట ఒక్కో ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర మాత్రం సమకూరడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



తరలి పోతున్న ధాన్యం

శ్రీకాకుళం

శ్రీకూర్మంలో నేటి పూజలు

మంగళవారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, నిత్యాభిషేకం, నిత్యార్చన, ప్రాబోధిక, తిరువారాధన, మంగళాశాసనం, బాలభోగం, సర్వదర్శనం, * మధ్యాహ్నం 12 గంటలకు రాజభోగం, సర్వదర్శనం, ★ సాయంత్రం 7:30 గంటలకు నిత్య తిరువారాధన, మంగళాశాసనం, ★ రాత్రి 8 గంటలకు పవళింపు సేవ

-న్యూస్‌టుడే, శ్రీకూర్మం (గార)

కొత్త సంవత్సరంలో మరింత అభివృద్ధి

గార, న్యూస్‌టుడే: 2018లో మండలం మరింత అభివృద్ధి సాధించాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష, కారదర్శులు గొండు వెంకటరమణమూర్తి, బడగల వెంకటప్పారావు, మండల పరిషత్తు ప్రత్యేకాహ్వానితుడు గుండ భాస్కరరావు అన్నారు. గారలోని తెలుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ


నగరంలోని స్కూల్ ఆఫ్ తైక్వాండో శిక్షణ కేంద్రంలో


కవితా టాలెంట్ స్కూల్‌లో..


అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

అవినీతిరహిత పాలన అందిస్తాం

గుజరాతీపేట (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో అవినీతిరహిత పాలన అందించడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలపడానికి వచ్చినవారితో అరసవల్లి రహదారులు సోమవారం రద్దీగా మారాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మీదేవి, మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ దంపతులు కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. తెదేపా నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం. వెంకటేష్, చిట్టి నాగభూషణం, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఇప్పిలి తిరుమలరావు, సిటిజన్ ఫోరం గౌరవాధ్యక్షుడు బరాటం కామేశ్వరరావు, గుత్తు చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు. గృహ నిర్మాణ శాఖ, నగరపాలక సంస్థ కమిషనర్ ఉద్యోగులు, శ్రీకాకుళం, గార మండలాల తహసీల్దార్లు, శ్రీకాకుళం గ్రామీణ, గార మండలాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గుజరాతీపేట (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) వైద్య కళాశాలలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ ఎ. కృష్ణవేణికి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌నాయక్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీసీహెచ్ అప్పలనాయుడు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి కేక్ కట్ చేయించారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన అధిపతులు, వైద్యులు, వైద్య విద్యార్థులు డైరెక్టర్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

గుజరాతీపేట (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: నగరంలోని స్కూల్ ఆఫ్ తైక్వాండో శిక్షణ కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం శిక్షణ ముగిసిన తరువాత నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర తైక్వాండో సంఘం కార్యదర్శి, ప్రధాన శిక్షకుడు తైక్వాండో శ్రీను పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రీడాకారులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో శిక్షకులు నీలంశెట్టి రవికుమార్, గౌతమ్, నవీన్, సతీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని పేర్ల వారివీధిలో అవోపా కార్యాలయంలో సోమవారం అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు, దొరసాని తెలుగుభాష పోటీలు నిర్వహించారు. అవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు చేబోలుమణి, కార్యదర్శి రోజా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేక్‌కోసి కొత్తసంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. దొరసాని తెలుగుభాష పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అవోపా మహిళా విభాగం ప్రతినిధులు ఎం. లక్ష్మి, పద్మావతి, అరుణకుమారి, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. డా. దానేటి రాధా శ్రీధర్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పి.ఎన్. కాలనీలోని కవితా టాలెంట్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు కవిత, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రిమ్స్ వైద్యకళాశాలలో కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్ డాక్టర్ ఎ.కృష్ణవేణి


మాట్లాడుతున్న ఆర్టీసీ ఈయూ రీజియన్ చీఫ్ అడ్వయిజర్ గణేశ్వరరావు

అరసవల్లి, న్యూస్‌టుడే: నగరంలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం నిర్వహించారు. రీజియన్ చీఫ్ అడ్వయిజర్ గణేశ్వరరావు కేకు కోసి కార్మికులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ బలోపేతానికి ప్రతి కార్మికుడు కృషిచేయాలన్నారు. కాగా, ఎన్ఎంయూ కార్యాలయంలో నాయకులు కేకును కోశారు. కార్యక్రమంలో సుమన్, ఎస్ఎస్ఆర్ శర్మ, ఎస్.వి. రమణ, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం సాంస్కృతికం, గుజరాతీపేట (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: నూతన సంవత్సవరం సందర్భంగా నగరంలోని పలు దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. విజయగణపతి ఆలయంలో స్వామికి స్వర్ణ పుష్పార్చన చేశారు. ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉమారుద్రునికి, పార్వతీదేవికి విశేషపూజలు చేశారు. నూతన సంవత్సరం ఆరంభం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు రుద్రాభిషేకం, లలితాహోమం నిర్వహించారు.


విజయగణపతికి స్వర్ణపుష్పార్చన


పూజలందుకుంటున్న పార్వతీదేవి

నవ వసంత శుభవేళ.. అభినందనల మాల..



కలెక్టర్ ధనంజయరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ చక్రధరబాబు, జేసీ-2 రజనీకాంతరావు, జవహర్ నవోదయ విద్యార్థులు

2018వ సంవత్సరం అడుగిడిన శుభ తరుణాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం నగరంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు పలువురు శుభాకాంక్షలతో ముంచెత్తారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల నివాసాలు సందడిగా మారాయి.

-న్యూస్‌టుడే, కలెక్టరేట్ (శ్రీకాకుళం)


డీఎంహెచ్‌ఓ తిరుపతిరావును అభినందిస్తున్న వైద్యాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది


ఏఎంసీ చైర్మన్ పీస వెంకటరమణమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెటింగ్ శాఖ సిబ్బంది

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు

అరసవల్లి, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో జిల్లా కలెక్టర్ కె. ధనంజయరెడ్డి, జిల్లాజడ్జి నిర్మలగీతాంబ దంపతులు, సంయుక్త కలెక్టర్ చక్రధరబాబు ఉన్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ప్రత్యేక పూజలు చేశారు.


జిల్లాజడ్జి నిర్మలగీతాంబ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

భగవద్గీత నగర సంకీర్తన

రాజాం, న్యూస్‌టుడే : పాశ్చాత్య సంస్కృతి నుంచి యువతను బయట పడేసేందుకు, వారిలో అవగాహన కల్పించేందుకు భగవద్గీత పారాయణంతో నగర సంకీర్తన సోమవారం నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సంకీర్తన నిర్వహించారు.

తెరపై సినిమాలు

● కిన్నెర సినీమాక్స్ : 2 కంట్రీస్, ● కీర్తన: జుమాంజీ (వెల్‌కమ్ టు జంగిల్), ● ఎస్‌వీసీ (రామలక్ష్మణ): ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్), ● సన్‌మ్యాక్స్ (చంద్రమహల్): ఒక్క క్షణం, ● మారుతి: ప్రాజెక్టు (జెడ్), ● సూర్యమహల్: ఆక్సిజన్, ● రామకృష్ణ: జవాన్, ● సరస్వతి: హలో —న్యూస్‌టుడే, అరసవల్లి

గ్యాస్ సమాచారం

● శ్రీదేవిప్రసాద్ ఎంటర్‌ప్రైజెస్ (హెచ్‌పీ): జనవరి 1న నమోదు చేసిన వారికి జనవరి 2న సరఫరా చేస్తారు. ● వేదమాత ఎంటర్‌ప్రైజెస్ (హెచ్‌పీ): జనవరి 1న నమోదు చేసిన వారికి జనవరి 2న సరఫరా చేస్తారు. ● ప్రియలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్ (భారత్): జనవరి 1న నమోదు చేసిన వారికి జనవరి 2న సరఫరా చేస్తారు. ● సిరి భారత్ గ్యాస్ ఏజెన్సీ: జనవరి 1న నమోదు చేసిన వారికి జనవరి 2న సరఫరా చేస్తారు.


—న్యూస్‌టుడే, కలెక్టరేట్ (శ్రీకాకుళం)

మొక్కజొన్నపై మనసైంది!

750 హెక్టార్లలో సాగు
ఆసక్తి కనబరుస్తున్న అపరాల రైతులు

గార, న్యూస్‌టుడే

గార మండలంలో అపరాలు సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న ఊరటనిస్తోంది. మండలంలోని 24 పంచాయతీల పరిధిలో సుమారుగా 750 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. అపరాలతో ఆశించినంత మేరకు ప్రయోజనం కలగకపోవడంతో పాటు కలుపు బెడద ఎక్కువగా ఉండడంతో ఈ ఏడాది రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. రబీలో మండలంలో గతంలో అధికంగా పెసర, మినుము పంటలు సాగయ్యేవి. ఈ పంటలకు గడిచిన మూడేళ్లుగా గిట్టుబాటు ధర లేకపోవడం, కూలీల ఖర్చు పెరగడంతో రైతులు నిరాసక్తత కనబరుస్తూ వచ్చారు. నీటి వసతి ఉన్న రైతులు ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్నను ఎంచుకున్నారు. ఈ పంటకు జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారులు రాయితీపై విత్తనాలు సరఫరా చేశారు. ఈ పంట సాగుకు ఎకరాకు సుమారుగా రూ. 12 వేల నుంచి రూ. 15 వేల వరకు ఖర్చు అవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దిగుబడి విషయానికి వస్తే ఎకరాకు 30 క్వింటాళ్ల నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం క్వింటా ధర రూ. 1500 వరకు ఉంది. 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా అన్ని ఖర్చులు పోను ఎకరాపై సుమారు రూ. 30 వేల వరకు మిగులుతుందని రైతులు చెబుతున్నారు. పంట కోసిన తరువాత పశుగ్రాసం కూడా సమకూరుతుంది. కండెలను వంట చెరకుగా వినియోగించుకొని రైతులు అధనపు ప్రయోజనం పొందుతున్నారు.



గారలో సాగవుతున్న మొక్కజొన్న పంట

అపరాలు గిట్టుబాటు కాక..



గత రెండు సంవత్సరాలుగా అపరాల పంటలు గిట్టుబాటు కావడం లేదు. పెసర, మినుము పంటలు బాగా పండితే ఎకరాకు క్వింటాలున్నర వరకు దిగుబడి వస్తాయి. ప్రస్తుత ధరలతో పోల్చితే విత్తనాలు, పంటను తీసేందుకు కూలీలు, నూర్పిడి కూలీల ఖర్చుకు రావడం లేదు. అందుకే నీటి వసతి ఉన్న చోట ఎకరాకు పైగా మొక్కజొన్న సాగు చేస్తున్నాను.

-కల్లి రామిరెడ్డి, రైతు, ఎస్‌డీఎన్‌పేట

సాగు బాగా పెరిగింది



గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మొక్కజొన్న సాగు పెరిగింది. ఈ పంటను మా గ్రామంలో గతంలో ఒకరిద్దరు మాత్రమే సాగు చేసేవారు. ఈ ఏడాది నీటి వసతి ఉన్న ప్రాంతంలో సుమారుగా రెండు వందల ఎకరాల్లో సాగవుతోంది. దిగుబడి ఆశించినంత వస్తుందని ఇతర రైతులు చెబుతున్నారు. అందుకే ఏడాది మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపించాం.

-గొనపు కృష్ణ, రైతు, గార

సస్యరక్షణ పాటిస్తే..

మొక్కజొన్నను నీటి వసతి ఉన్న రైతులు అన్ని కాలాల్లో సాగు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ పంట వివిధ దశల్లో ఉంది. పంట సాగు విషయంలో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయి. తెగుళ్ల నివారణలో అప్రమత్తంగా ఉండాలి.

-పైల నవీన్, వ్యవసాయాధికారి, గార

యోగా, ఆయుర్వేదంలో ఉచిత శిక్షణ

రాగోలు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో అన్ని వర్గాల వారికి యోగా, ఆయుర్వేదం కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ సెంటర్ హెడ్ సిహెచ్.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఉంటాయన్నారు. బీఎస్సీ నర్సింగ్, ఎంఎల్‌టీ, బీపీటీ, మెడికల్ కోడింగ్, బిల్లింగ్‌లలో నిర్ణీత రుసుంతో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణానంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

గుజరాతీపేట (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: కిమ్స్ ఆసుపత్రుల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు జన్మదినం సందర్భంగా సోమవారం నగరంలోని కిమ్స్ సాయి శేషాద్రి ఆసుపత్రిలో ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ అన్నెపు శివప్రసాదరావు రోగులకు పండ్లు పంచిపెట్టారు. ఆసుపత్రి డైరెక్టర్ గూడేన సోమేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ సోమేశ్వరరావు, ప్రతినిధులు కె.భాస్కర్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

టెక్కలి

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

నిమ్మాడ (కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: నిమ్మాడ గ్రామానికి ముందు వంశధార కాలువలో స్నానం చేసుకుని వస్తున్న కొంచాడ మల్లేసును సోమవారం నిమ్మాడ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయపడ్డారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ. లక్ష్మణ తెలిపారు.

గ్యాస్ సమాచారం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి ప్రభానంద గ్యాస్‌లింక్స్‌లో డిసెంబరు 22వ తేదీన పేరు నమోదు చేసుకున్నవారికి మంగళవారం గ్యాస్‌సిలిండర్లు సరఫరా చేస్తారు. బుకింగ్ సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు. గ్యాస్ గోదాం వద్ద డెలివరీ ఇవ్వరు. సంప్రదించాల్సిన ఫోను నంబర్లు- 08945-244543, 244322, ఆన్‌లైన్ బుకింగ్ నంబరు- 9848824365

చెప్పేందుకే గానీ...చేయడానికి కాదు!

● ప్రభుత్వ కార్యాలయాల్లో కానరాని మరుగుదొడ్లు ● ప్రజలతోపాటు ఉద్యోగులు,, సిబ్బందికీ అసౌకర్యం



టెక్క లి మండలపరిషత్తు కార్యాలయం వద్ద మరుగుదొడ్లకు తాళాలు వేసిన దృశ్యం

స్వచ్ఛభారత్ నినాదంతో ఊరూరా, ఇంటింటా మరుగుదొడ్లు నిర్మించి పారిశుద్ధ్యం మెరుగుకు అందరూ కృషి చేయాలన్న ప్రభుత్వ ఆలోచన కేవలం ప్రజలకు చెప్పడానికే పరిమితమవుతోంది. ప్రభుత్వ కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రధానంగా వివిధ పనులపై వచ్చే ప్రజలతో పాటు ఉద్యోగులు, సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు సమకూర్చుతున్నప్పటికీ, అధికారుల అనాలోచిత విధానాలతో చాలాచోట్ల ఈ లక్ష్యం నీరుగారుతోంది.

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రం టెక్కలిలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు లేక వివిధ పనులపై వచ్చేవారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. శౌచాలయాల్లేక సమీపంలో అనువైన ప్రాంతాలు కానరాక పట్టణ శివారుకు పరుగుపెట్టాల్సిన పరిస్థితి నెలకొంటోంది. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మరుగు దొడ్లు కేవలం సిబ్బంది కోసమే వినియోగిస్తున్నారు. స్థానిక మండలపరిషత్తు కార్యాలయం వద్ద సైతం అదే పరిస్థితి. వినియోగించిన అనంతరం వాటికి తాళాలు వేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గతంలో నిర్మించిన మరుగుదొడ్డి కూలిపోవడంతో తిరిగి నిర్మించలేదు. నిత్యం జనంతో సంబంధాలు ఉండే ఈ కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు లేకపోవడంతో వివిధ పనులపై వచ్చేవారు నానా అవస్థలు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ, ఉపఖజానాశాఖ, వ్యవసాయశాఖ, వంశధారశాఖతో పాటు ఇతర కార్యాలయాల వద్ద జనం కోసం నిర్మించిన మరుగుదొడ్లే లేవు.

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. స్థానిక తహసీల్దారు కార్యాలయానికి నూతన భవనం నిర్మాణమవుతున్నందున సమీప వెలుగు కార్యాలయంలోకి మార్చడంతో మరుగుదొడ్ల సమస్యకు కొంతవరకు పరిష్కారమైంది. కోటబొమ్మాళి ఉపఖజానా శాఖ కార్యాలయంతో పాటు గృహనిర్మాణసంస్థ, గ్రామీణ నీటిసరఫరా విభాగం కార్యాలయాలకు మరుగుదొడ్లు లేవు. మరోపక్క ఎంఈవో, పంచాయతీరాజ్ శాఖ కార్యాలయాల్లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. నిత్యం మరుగు దొడ్లపై వరుస సమావేశాలు నిర్వహిస్తున్న అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో వీటిని సద్వినియోగం చేసుకునే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నందిగాం మండల వనరుల కేంద్రంలో నిరుపయోగంగా మరుగుదొడ్లు



కోటబొమ్మాళి ఉపఖజానాశాఖ కార్యాలయంలో మరుగుదొడ్ల తీరు అత్యవసరాలకు అవస్థలు

చాలాచోట్ల లేవు... ఉన్నవి వినియోగంలో లేవు

నందిగాం, న్యూస్‌టుడే: నందిగాం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చే సందర్శకుల నిమిత్తం ఆవరణలో మూడేళ్ల కిందట మరుగుదొడ్డి నిర్మించి అర్ధంతరంగా వదిలేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఉద్యోగులకు మరుగుదొడ్డి నిర్మించినప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. వెలుగు కార్యాలయంలోని మరుగుదొడ్లు వినియోగంలో లేవు. వ్యవసాయ, గృహనిర్మాణ, విద్యుత్తుశాఖల కార్యాలయాలతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువైద్య కార్యాలయానికి మరుగుదొడ్లు లేవు. దీంతో ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బంది, వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

నేటి నుంచి జన్మభూమి-మా ఊరు

నందిగాం, న్యూస్‌టుడే: మండలంలో నేటి (మంగళవారం) నుంచి ఈ నెల 11వ తేదీ వరకు జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి. రాంబాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తొలిరోజు సైలాడ, శివరాంపురం, ఉయ్యాలపేట, హర్షబాడ పంచాయతీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

అపరాలకు తెగుళ్ల దెబ్బ



అపరాల పంటలు

నందిగాం, న్యూస్‌టుడే: ఆకాశంలో గత మూడు రోజులుగా కమ్ముకున్న మబ్బులతో అపరాల పంటలైన పెసర, మినుము పంటలు మాడిపోతున్నాయి. పేనుబంక, నల్లి పురుగులు అపరాల పంటలను ఆశించి మొక్కల ఆకులు ముడుచుకుపోతున్నాయి. మండలంలో అపరాలు సుమారు 5.900 ఎకరాల్లో సాగు చేశారు. మబ్బుల కారణంగా తెగుళ్లు వ్యాపించాయి. చలిగాలులతోపాటు మబ్బులు పట్టడంతో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. పేనుబంక, నల్లి పురుగులకు ఆస్ట్రోపిడ్ ఎకరాకు 80 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఏవో సురేష్ తెలిపారు. వేరేగా మోనోక్రోటోపాస్ ఎకరాకు 250 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని ఆయన సూచించారు.

పంతులుపేటలో దాహం..దాహం..!

ఎత్తురాళ్లపాడు (కోటబొమ్మాళి) న్యూస్‌టుడే: ఎత్తురాళ్లపాడు పంచాయతీ పంతులుపేటలో మురుగు కాలువలు నిర్మించాలనే ఉద్దేశంతో గ్రామానికి ఇరువైపులా కొన్నినెలల కిందట పెద్దఎత్తున తవ్వకాలు చేశారు. ఈ నేపథ్యంలో రూ. 4 లక్షలతో ఏర్పాటు చేసిన సౌరశక్తి రక్షిత తాగునీటి పథకం పైపులైన్లు పాడైపోవడంతో గ్రామంలోని ఒకే ఒక్క తాగునీటి బోరు ఆధారమైంది. అయితే కొద్దిరోజులుగా బోరు పనిచేయకపోవడంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు బోరు భాగాలను తొలగించారు. ఫలితంగా గ్రామస్థులు తాగు నీటి కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సివస్తోంది. ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ కనకేశ్వరరావు మాట్లాడుతూ తక్షణమే పరిశీలించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



పనిచేయని తాగునీటి బోరు

రెండెకరాల వరిచేలు దహనంపై ఫిర్యాదు

గంగరాం (కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: కోటబొమ్మాళి మండలం గంగరాంకు చెందిన సుంకరి సింహాచలంనకు చెందిన రెండెకరాల వరిచేలను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు జలవనరుల సంఘం రాష్ట్ర డైరెక్టరు కర్రి అప్పారావు తెలిపారు. సుమారు రెండెకరాలకు చెందిన వరి చేలు కాలిబూడిదవ్వడంతో కుటుంబం పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. దీనిపై ఫిర్యాదు అందిందని విచారణ నిర్వహిస్తున్నామని ఎస్.ఐ. లక్ష్మణ తెలిపారు.

వార్డుసభ్యులు కాలేనివారూ విమర్శలే

● కళ్లుంటే అభివృద్ధిని పరిశీలించేందుకు రండి ● రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు ఘాటు విమర్శలు

టెక్కలి, న్యూస్‌టుడే: వార్డుసభ్యులు కాలేనివారు సైతం రాజకీయాల్లో విమర్శలు చేస్తున్నారని వైకాపా నాయకులపై రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కోటబొమ్మాళి మండలం కన్నేవలస సర్పంచి కాళ్ల గణపతి, తర్లిపేట సర్పంచి అంగ గున్నయ్య సోమవారం తెదేపా తీర్థం పుచ్చుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయాల్లోకి కొత్తగా వచ్చినట్లు వైకాపా నాయకులు చేస్తున్న విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. పదేళ్లపాటు అధికారం ఒరగబెట్టి అన్నిచోట్లా అవినీతికి పాల్పడ్డారని మంత్రి ఆరోపించారు. ఎరువులు వస్తే ఒడిశాలో అమ్ముకున్నారని, ప్రభుత్వ పథకాలు, ఉద్యోగాలు ఇస్తామని దండుకున్నారని, కొండలకు సైతం పట్టాలు సృష్టించి పంటపరిహారం పొందారని, అక్రమ రుణాలు అందుకున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరగడం లేదంటూ వారు చేస్తున్న విమర్శలపై అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లుండి పరిశీలిస్తామని వైకాపా నాయకులు కోరుకుంటే తానే వాహనాలు సమకూర్చుతానని, 20 రోజులపాటు నియోజకవర్గం మొత్తం గ్రామగ్రామాన జరిగిన అభివృద్ధిని పరిశీలించుకున్నాక చర్చకు రండని ఆయన పిలుపునిచ్చారు. కన్నేవలస, తర్లిపేట పంచాయతీల్లో సైతం అభివృద్ధికి ఆకర్షితులై తెదేపాలో చేరారని, రానున్న ఎన్నికలు ఏకపక్షంగా సాగుతాయన్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలను గౌరవిస్తూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కోటబొమ్మాళి, టెక్కలి ఎంపీపీలు తర్ర రామకృష్ణ, మట్ట సుందరమ్మ, టెక్కలి జడ్పీటీసీ సభ్యురాలు కర్నిక సుప్రియ, తెదేపా టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పినకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు, వంశధార ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బాలకృష్ణ, మండలపరిషత్తు ఉపాధ్యక్షుడు హనుమంతు రామకృష్ణ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీసభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తెదేపాలో చేరుతున్న సర్పంచులు

కళలకు జీవం పోయాలి



కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: కళలకు జీవం పోయాలని శ్రీజగద్ధాత్రి కార్పెంటరీ సంఘం ప్రతినిధులు కోరారు. నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని స్థానిక మెట్టవీధిలోని జగద్ధాత్రి ఆలయంలో వృద్ధ కళాకారులకు సోమవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సింహాద్రి అమ్మారావు ఆచారి, సింహాద్రి మోహనరావు ఆచారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అద్దాల నాగేశ్వరరావు, సంఘ అధ్యక్షుడు రాయల నాగరాజుతో పాటు అద్దాల మధుబాబు, చలపాకుల నారాయణరావు, గోవింద్, సింహాచలం, రాజు, సోమేష్, కామేష్, బ్రహ్మం, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తెరపై సినిమాలు

కోటబొమ్మాళిలో... శివకృష్ణ: **ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి)** టెక్కలిలో.. సుదర్శన్ : **2 కంట్రీస్,** భవానీ: **ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి)**

టెక్కలి

బానిసత్వంపై ఆత్మగౌరవ విజయోత్సవ దినం



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: దళిత, బహుజనులు ఏటా జనవరి ఒకటో తేదీని మహర్‌ల శౌర్య దినంగా జరుపుకోవాలని దళిత ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా రామారావు పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో సోమవారం బీమా కోరే గావ్ విజయోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహర్‌లు బానిసత్వ విముక్తి కోసం సామాజిక గౌరవం కోసం పీష్వాలతో యుద్ధం చేశారన్నారు. మహర్‌ల వీరోచిత గాథ జరిగి 200 ఏళ్లు దాటిందన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన మహర్‌లకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో దివ్వల ఎర్రన్నాయుడు, కేఎన్‌పీఎస్ నాయకులు బెలమర ప్రభాకరరావు, మురళి, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

వికలాంగునికి రుణం మంజూరు

సంతబొమ్మాళి,న్యూస్‌టుడే: మండలంలో బావనపాడు గ్రామానికి చెందిన లింగూడు స్వాతంత్ర రావుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వికలాంగ ఉపాధి పథకంలో భాగంగా రూ.2 లక్షల రుణం మంజూరు కాగా, దానిని సోమవారం దేవనల్తాడ ఆంధ్రాబ్యాంకు మేనేజర్ రాజేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సైని గురువులు, మత్స్యకార ప్రతినిధి అల్లుపల్లి పోతయ్య, కె. చిన్నయ్య, రామకృష్ణా సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు పలువురి ఎంపిక

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 5, 6, 7వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లాకేంద్రంలో జరగనున్న మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు సీతాపురం జడ్పీ బాలికోన్నత పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయినులు ఎంపికయ్యారు. 35 ఏళ్ల వయోవిభాగంలో వ్యాయామోపాధ్యాయిని విజయ లక్ష్మి జావెలిన్, డిస్క్‌త్రో, హేమర్ త్రో విభాగాలకు ఎంపిక కాగా, 45 ఏళ్ల వయోవిభాగంలో హిందీ ఉపాధ్యాయిని కోళ్ల చంద్రిక డిస్క్, జావెలిన్, షాట్‌పుట్ విభాగాలకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్తారు వేణీకుమారితో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.



క్రీడాపోటీలకు ఎంపికైన ఉపాధ్యాయినులను అభినందిస్తున్న తోటి ఉపాధ్యాయులు



ఆర్డీవో వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు



ఎంపీపీ యర్ర విశ్వశాంతికి శుభాకాంక్షలు చెబుతున్న మండల పరిషత్తు కార్యాలయ సిబ్బంది



వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

నూతన సంవత్సరం... అభినందనల హారం

2018వ సంవత్సరం అడుగిడిన శుభ తరుణాన్ని పురస్కరించుకుని టెక్కలి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, అధికారులను పలువురు శుభాకాంక్షలతో ముంచెత్తారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల నివాసాలు సందడిగా మారాయి.

– న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం, నందిగాం, కోటబొమ్మాళి



స్థానిక అంబేడ్కర్ కూడలిలోని సెంటినరీ ఆంధ్రాబాప్టిస్టు ఆలయంలోనాటిక వేస్తున్న యవ్వన సమాజ సభ్యులు



కేంద్ర మాజీ సహాయ మంత్రి కిల్లి కృపారాణికి శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు



కోటబొమ్మాళి సర్పంచి దేవాది సింహాద్రి, బోయిన సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, తదితరులు



తిలారులో ఎంపీపీ తర్ర రామకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, తదితరులు

జలదాత...జనబాట !

● సొంత ట్యాంకరుతో ఆదుకుంటున్న తీరు ● ఆదర్శంగా నిలుస్తున్న తంగుడు కృష్ణస్వామి



తాగునీటి ట్యాంకరుతో తంగుడు కృష్ణస్వామి

తాగునీటికి తంటాలు పడుతున్నవారిని తాగునీరందిస్తూ ఆదుకుంటున్నారు. జనం దప్పికను తీరుస్తూ ముందుకు సాగుతున్నారు. సొంత ట్యాంకరుతో తాగునీరు సరఫరా చేస్తూ అందరి ఆదరాభిమానాలను చూరగొంటున్నారు. ఆయనే కోటబొమ్మాళికి చెందిన తంగుడు కృష్ణస్వామి.

–న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

కోటబొమ్మాళి మేజరుపంచాయతీలో రూ.35 లక్షలతో నిర్మించిన రక్షిత తాగునీటి పథకం ద్వారా ఎగువనున్న పలు ప్రాంతాలకు తాగునీరు అంతంతమాత్రంగానే అందుతోంది. దీంతో వారి తాగునీటి సమస్య పరిష్కారానికి రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్నాయుడు ప్రత్యేకంగా ఓ తాగునీటి ట్యాంకరును అందించారు. అయినప్పటికీ గ్రామపంచాయతీలో పలు వీధులకు తాగునీటి సమస్య నెలకొంది. దీంతో కృష్ణస్వామి సొంతంగా తాగునీరందిస్తూ వస్తున్నారు.

ముందుకొచ్చిన స్వామి.... :ఇక్కడ కొన్ని వీధుల్లో నివాసముంటున్న ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృష్ణస్వామి ముందుకొచ్చారు. గ్రామపంచాయతీ ట్యాంకురుతో పాటు వేసవిలో ప్రతి దఫా ఉచితంగా తాగునీరందిస్తున్నారు. అంతేకాకుండా సాధారణ రోజుల్లో ఎటువంటి తాగునీటి ఇబ్బందులున్నా ఒక్క ఫోన్‌కాల్‌తో ట్యాంకరు పంపించి ఆదుకుంటున్నారు. ఇటీవల కోటబొమ్మాళి ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో నెలల తరబడి రక్షిత తాగునీటి పథకం మొరాయిస్తే ట్యాంకరుతో తాగునీరు సరఫరా చేశారు. కోటబొమ్మాళి ప్రధానవీధి, ప్రకాశ్‌నగర్ కాలనీలకు తాగునీరు సరఫరా చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అంతేకాకుండా కోటబొమ్మాళిలో రూ. లక్షలతో అయ్యప్పస్వామి ఆలయం నిర్మించారు.



తాగునీరు అందుకుంటున్న మహిళలు

తాగునీరందించాలనే: ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఎక్కడో? ఏదోవిధంగా తాగునీటి సమస్య తలెత్తుతోంది. దీనికి నావంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ట్యాంకరు తీసుకున్నాం. నాకున్న పనులతో పాటు ప్రజల అవసరాల మేరకు తాగునీరు అందిస్తున్నాం. ఫోన్‌లో సమాచారం అందించినా అందిస్తున్నాం. **–తంగుడు కృష్ణస్వామి, కోటబొమ్మాళి**

రంగవల్లుల పోటీలకు విశేష స్పందన



గ్రామంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

టెక్కలి, న్యూస్‌టుడే: శ్యామసుందరాపురం గ్రామంలో సోమవారం విప్రో సంస్థ ఆధ్వర్యంలో సంతూర్ కాంటెస్ట్ పేరిట ముగ్గుల పోటీలను నిర్వహించారు. నూతన సంవత్సర సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. గ్రామంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని విభిన్న రంగ వల్లులతో విశేషంగా ఆకట్టుకున్నారు. ఏఎస్ఎం సూర్యనారాయణ పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. విజేతలకు సర్పంచి పొట్నూరు భూలక్ష్మి, నీటి సంఘాల అధ్యక్షుడు గుంట బాబూరావు, గ్రామ పెద్ద పొట్నూరు రామ్మూర్తినాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బమ్మిడి ఖగేశ్వరరావు బహుమతి ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం